SATHYA PATHAM

(tatvika anweshana lakshyam)

Ankalla Prudhvi Raj

Spiral Publications

సత్యపథం

(తాత్త్విక అన్వేషణ లక్ష్యం)

అంకాళ్ళ పృథ్వి రాజ్

స్పైరల్ పబ్లికేషన్స్

కాని సత్యం మరింత ప్రియతమైనది...

– అరిస్టాటిల్

ప్లేటో నాకు ప్రియతముడే
కాని సత్యం మరింత ప్రియతమైనది...

– అరిస్టాటిల్

సత్యపథం

(తాత్త్విక అన్వేషణ లక్ష్యం)

అంకాళ్ళ పృథ్వీ రాజ్

స్పైరల్ పబ్లికేషన్స్

సత్యపథం
(వ్యాసాలు)

అంకాళ్ళ పృథ్వీరాజ్

ప్రచురణ : స్పైరల్ పబ్లికేషన్స్

సెప్టెంబర్, 2020

ప్రతులు : 250

ప్రతులకు :
అనేక పుస్తక కేంద్రం, విజయవాడ
మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

వెల : 120/-

అంకితం

తాత్త్విక అన్వేషణలో
తమని తాము
రగిలించుకున్న,
అర్పించుకున్న
తాత్త్వికులకు
వినమ్రంగా
ఈ పుస్తకం
అంకితం

Philosophy is an elegant thing,

If anyone modestly meddles with it,

But if they are conversant with it more than is becoming, it corrupts them……

- Plato

విషయసూచిక

*	*సత్యపథంలోకి... - రివేరా*	*9*
1.	తాత్త్విక వర్గపోరాటంతో రాజ్యాన్ని ఎదురుకుందాం!	10
2.	విశ్వమారి సామ్రాజ్యవాదం	14
3.	కుల నిర్మూలన జరగాల్సిందే...	19
4.	రాజకీయ ఖైదీల సత్యార్థం	24
5.	గరుడాంధ్రము	27
6.	ఎడారి వాసనపై విమర్శనాత్మక పరిశీలన	30
7.	విద్య లేని వాడు వింత పశువు	33
8.	నిర్బంధ మరణాలు	35
9.	కులోన్మాదం - యుద్ధోన్మాదం	37
10.	సంక్షేమ సంక్షోభం	39
11.	ఆచార్య నాగార్జున	41
12.	సత్య మార్గం	43
13.	రాజకీయ యుద్ధతంత్రం	45
14.	మీమాంస	47
15.	సామాజిక మార్పు	49
16.	అశ్లీల చిత్రాలకు వ్యతిరేకంగా పోరాడదాం!	51
17.	ఏకమేవాద్వితీయం	54
18.	వ్యవస్థీకృత దోపిడి-ప్రత్యక్ష దాడి	56
19.	మానవ శక్తి	59
20.	తాత్త్విక భారతం	61
21.	మానవ ఆచరణ	63
22.	విశ్వనరుడు	65
23.	విషయత్వం	68
24.	విద్యా దృక్పథం	70
26.	రామ రాజకీయం	74
27.	అస్తి - నాస్తి	77
28.	కవిత్వ సంప్రదానము	79
29.	అంటరానితనపు అనురూపమే శిరోముండనం!	86
30.	ఆపరేషన్ పోలో - ఓ కుట్ర	88

కృతజ్ఞతలు

ప్రజాకాంక్ష దినపత్రికకు, మనం దినపత్రికకు, సామాజిక వార్త పత్రికకు, స్పైరల్ పబ్లికేషన్స్ కు, అలాగే రివేరా గారికి, వెన్నెలకంటి రామారావు గారికి, భీమారావు (చిన్నా బాబాయ్) గారికి, నరేష్ కు, కిరణ్ కు, మిత్రుడు చందన్ కు మరియు నా తల్లితండ్రులకు, చెల్లెలు అవనికి

సత్యపథంలోకి...

ఇద్దరు బిడ్డలను కంటే ఒకడు ధర్మకన్నాలు వేసి జైలుకు పోతాడు. మరొకడు ఊరి పెత్తందారులతో తలపడి చనిపోయాడు. ఇక తండ్రి ఒక్కడే ఆ ఇంటికీ, వాడకీ, దేశానికీ దిక్కు. ఇది ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లి నవల ఇతివృత్తం. 1947 ఆగస్టు 15 దాకా ఇదే తలకిందుల చైతన్యం మనదేశాన్ని నడిపించింది. ఆ రోజు వరకు అందరూ గాంధేయవాదులే, కాంగ్రెస్‌వాదులే, రష్యావాదులే! వ్యాపారాలను చేజిక్కించుకొన్న దళారులు, పొన్నుగర్రలో పొన్ను ఊడిపోయినా కర్రను పట్టుకొని గ్రామాల్లో పెత్తనం చెలాయిస్తున్న భూస్వాముల రాజకీయ ప్రతినిధులుగా దేశభక్తులు, మతభక్తులు ముందుకొచ్చారు. ఈ భక్తులను ఒకేగాటన కట్టి, వారికి వ్యతిరేకంగా ఒకే కార్యక్రమం తీసుకోలేకపోయిన కమ్యూనిస్టులు మరోతరహా భక్తులుగా మిగిలిపోయారు. వారు మూఢ భక్తులు. ఈ భక్తులు రానురాను డిండింభట్టు, నామంబొట్టు అన్నట్టు తయారయ్యారు. ఊర్ధ్వముఖంగా ఏనాడూ ఈ దేశంలో చైతన్యం నడవలేదనేందుకు ఇవన్నీ నిదర్శనాలే. మన తాత్విక, మేధో ప్రపంచాలను ఈ అధోపతనం ఈనాటికీ శాసిస్తోంది. ఈ నేపథ్యంలోనే అంకాళ్ల పృథ్వీరాజ్ –సత్యపథం– వెలువడుతోంది. అచ్చులో ఇది ఆయన నాలుగో రచన. వ్యాసాలుగా వెలువడుతున్న రెండో పుస్తకం. ఇంతకుముందు –మార్క్సిజం అజేయం– వెలువరించారు.

విశ్వాసాల బలాన్ని వచనం పట్టి ఇస్తుందని జార్జ్ ఓర్వేల్ అంటారు. పృథ్వీరాజ్ వ్యాసాల్లో అలాంటి బలం ఎంతనేది ఎవరికి వారు బేరీజు వేసుకోవాల్సిందే!

27.08.2020

- రివేరా

1

తాత్త్విక వర్గపోరాటంతో రాజ్యాన్ని ఎదురుకుందాం!

మానవుడు ఆలోచించడం తన చారిత్రక ఆచరణ నుండి అభివృద్ధి చెందింది. ఈ ఆలోచన యొక్క వ్యక్తీకరణ ఖచ్చితంగా ఆనాటి తను జీవించియున్న సాంఘిక సంబంధాలను ప్రతిబింబిస్తుంది. ఈ సాంఘిక సంబంధాలు మానవుని ఉత్పత్తి సంబంధాల ఆచరణ యొక్క కొనసాగింపుగా అభివృద్ధి చెందుతూ మానవుని ఆలోచనా మెరుగుకు పదును పెడుతుంది. ఈ ఆలోచన పాక్షికతకు అనగా వర్గ ప్రాతిపదిక ప్రతిఫలంగా వ్యక్తమౌతుంది, కావున దానికి తగిన భాష, వేషం, ప్రవర్తన, కోపం, తాపం, రాజకీయ పదజాలము, కళలు, ధృక్పథము, మతమూ ముందుకు వస్తాయి. ఉత్పత్తి విధానం మానవ సమాజం యొక్క సంబంధాల స్వభావాన్ని తెల్పుతుంది. ఉత్పత్తి విధానం అనగా ఉత్పత్తి శక్తులు- ఉత్పత్తి సంబంధాలు. ఉత్పత్తి సంబంధాలు ఉత్పత్తి శక్తులకనుగుణంగా ఉంటూ వాటిని మెరుగుపరుస్తాయి. ఉత్పత్తి శక్తులు ఉత్పత్తి సంబంధాలను అభివృద్ధి పరుస్తాయి ప్రతిఫలనంగా ఉపరితల అంశాలు అభివృద్ధి చెందుతాయి. ఉత్పత్తి సంబంధపు అనగా ఉత్పత్తి యాజమాన్యం-శ్రమ-పంపిణీ సంబంధాలల్లో మార్పు ఉపరితలంలో మార్పులను నిర్ణయిస్తుంది.

ఉపరితలం మొత్తం ఉత్పత్తి విధానాన్ని ప్రతిఫలిస్తుంది. ఉత్పత్తి విధానం- ఉపరితలాల మధ్య పరస్పర ఆధార వ్యతిరేక తత్వముంటుంది. రాజ్యం ప్రధాన వైరుధ్యంగా ఉంటూ ఉత్పత్తి విధానాన్ని ప్రతిఫలిస్తుంది. ఈ ప్రధాన వైరుధ్యం అప్రధాన ఉపరితల వైరుధ్యాలను అదుపు చేస్తుంది, చలనంలో ఉండేట్లు చేస్తుంది- ఇవి పరస్పరం ప్రభావించుకుంటాయి. ఉత్పత్తి శక్తుల- ఉత్పత్తి పంపిణి- మారకాల అభివృద్ధి అనివార్యంగా శ్రమ విభజనను అభివృద్ధి పరుస్తాయి-ఫలితంగా ఉపరితలపు ప్రధాన వైరుధ్యం వర్గ పోరాటానికి (వైషమ్య స్థితి) గురై అప్రధానంశాలను కదిలిస్తూ వాటిని మెరుగుపడేట్లు చేస్తుంది లేదా అప్రధానంశాలే వర్గపోరాటానికి (వైషమ్య స్థితి) గురై ప్రధాన వైరుధ్యాన్ని మార్పుకు గురిచేయవచ్చు. కావున భారతీయ తాత్త్వికత విప్లవకార్యాచరణకు గురికావడం తక్షణ ఆవశ్యకత, అయితే భారత దేశం ప్రపంచాన్ని ప్రభావితం చేసిన తాత్విక దర్శనాలల్లో ప్రముఖ స్థానంలో ఉందనడంలో పొరపాటు లేదు. మత సాంప్రదాయం చుట్టూ తత్త్వం దాగిపోయి కనుమరుగు అయ్యిందనే వాదన ఒక మేరకు సమంజసంగా ఉన్నా దానిని ఎదావిధిగా స్వీకరించి సంతృప్తి చెందకూడదు. మతం యొక్క తాత్త్వికత కీలకాంశంగా ఉంటుంది. దాని యొక్క పరిశీలన చేత ఆయా సమాజపు వాస్తవికాంశాలను పరిశీలించడానికి ఉపయోగపడుతుంది. అంతేకాకుండా అభివృద్ధి చెందేవి, కొనసాగుతుండేవి అయిన వివిధ దర్శనాలకు ఈ తాత్త్వికత యొక్క ఉపయౌగం, ఆధారం కీలకమైనది. అందుకే మనం తత్త్వ పరిశీలనను ప్రధానమైనది భావించాలి. గతకాలం విశ్వసించినది, ఆ విశ్వానికి గురైన పదార్థపు వాస్తవ సత్యం గోచరించడంతో అనివార్యంగా విశ్వాసాన్ని కోల్పోతుంది. తాము విశ్వసిస్తున్న నమ్మకాల యధార్థతలను రుజువుచేస్తూ మానవుని సందేహాలకు జవాబులను అన్వేషిస్తుంది తత్త్వశాస్త్రం. కావున భారత దేశంలో వివిధ దర్శనాలు హిందూ మత తాత్త్విక విశ్వాసాలను ప్రశ్నిస్తూ-పరిష్కరిస్తూ-సంశ్లేషణ వైపుగా పయనించాయి- ఫలితంగా 11 వ శతాబ్దంలో ప్రారంభమైన వీర శైవమూ- శ్రీ వైష్ణవ సాంప్రదాయం పలనాడు యుద్ధ సమయానికే వీర వైష్ణవంగానూ అభివృద్ధిచెంది సహపంక్తి భోజనాలు (చాపకూడు), కులాంతర వివాహాలు, శాస్త్రీయ విద్యను అభ్యసించడం-గుడుల నిర్మాణము-పూజారత్వం కలిగి ఉండటం వంటి విప్లవాత్మక సంస్కరణలు(ఆ నాటికి) గుణాత్మకంగా వృద్ధి చెందాయి(బహుజన-దళిత-గిరిజనులలో). ఐతే

వీర సాంప్రదాయము రాజ్యాన్ని వర్గపోరాటానికి గురిచేసే సందర్భంలో ఓటమికి గురైనది.

వాస్తవానికి వైషమ్య కారణాలు వైషమ్య కార్యాలకు మూలం. వైషమ్య కార్యాలు రాజ్యపు సమర్ధనగా- ఆధిపత్య చలామణిగానూ- వైషమ్య కార్యాలు సామాజిక మార్పుగానూ వ్యక్తమవుతాయి (ఇవి వైషమ్య కారణాల గుణాత్మక పరిష్కారంగా ఉంటుంది). వైషమ్య కార్యాలు వ్యక్తిగత నిర్ణయక స్థాయిగానూ వ్యక్తమవుతూ వైషమ్య కారణాలను బలోపేతం చెయ్యడం-కొనసాగించడం-వ్యతిరేకించడం కూడా భాగమై కొనసాగుతాయి. వైషమ్య కారణాలను గుణాత్మకంగా పరిష్కరించాలి. అంతేకానీ వైషమ్య కార్యాలను అదుపు చెయ్యడంతో వైషమ్య కారణాలను పరిష్కరించడమనే విధానం అధిభౌతికవాదం. రాజ్యం వైషమ్య కార్యాలపట్ల అసహనం ప్రదర్శించడం వైషమ్య కారణాలను పరిష్కరించడంగా భావించడమే కాకుండా పరిష్కార మార్గం లేకపోవడమైయుంటుంది. ఎందుకంటే వైషమ్య కారణమునకు ఆ రాజ్యమే ప్రతీక. కావున నిర్భంధం-అధ్యయనం మొదలైన వాటిపై ఆంక్షలు వగైరా చర్యలు వైషమ్య కారణాల ప్రతీకైన రాజ్యపు అసహనం కూడా వైషమ్య కార్యమే అవుతుంది. కావున నివారణ-అదుపు అనేవి వైషమ్య కార్యాలు అవుతాయి. అంతేకాకుండా ఈ రాజ్యానికి వ్యతిరేకంగా జరిగే సామాజిక మార్పు సైతం వైషమ్య కార్యమే(గుణాత్మకం). వైషమ్య కారణాల మధ్య వైరుధ్యం వైషమ్య కార్యాల మధ్య వైరుధ్యంగానూ ఏకీకృత వ్యవస్థగానూ ఉంటూ మొత్తం సమాజపు సంక్షోభాన్ని తెలుపుతుంది. వైషమ్య కారణాలు వైషమ్య కార్యాలుగా ఈ కార్యాలు కారణాలుగా అభివృద్ధి చెందుతూ ఉంటాయి. కార్యాలను పరిష్కరించడంతో కారణాన్ని పరిష్కరించడంగా భావన కలుగుతుంది. కావున ఈనాటి సందర్భం కూడా ఇటువంటిదే, ముఖ్యంగా విప్లవాత్మక సంస్కరణలైన కులాంతర వివాహాలు-సహపంక్తి భోజనాలు- శాస్త్రీయవిధ్యావిధానం- ఉపాధి అవకాశాల అంశాలను స్వీకరిస్తున్న నేటి సామాజిక విప్లవం పరిపూర్ణత్వం, ఈనాటి సామాజిక- రాజకీయార్ధిక సంక్షోభాన్ని గుణాత్మకంగా పరిష్కరించడమంటే తాత్వికంగా సైతమూ విప్లవీకరణ అవసరం, ఎందుకంటే చరిత్రలో ప్రపంచ తాత్విక ప్రగతిశీల దర్శనాలు భారతీయ దర్శనాలలోకి ప్రవేశించి వాటిని విస్తృతపరిచాయి (అధానప్రధానాలు). అయితే తాత్విక అభివృద్ధికి అనుగుణంగా సారం-సాంప్రదాయం వికాసం చెందకుండా

కుంటుపడిపోయాయి. అత్యంత అభివృద్ధికర తాత్త్వికాంశాలు కూడా సనాతన సారం-సాంప్రదాయం చేత ప్రభావం చెంది కేవలం మతమనే మొత్తంగా నిర్వచించుకుని తమకు తాము పరిమితం చేయబడ్డాయి. అభివృద్ధికర తాత్త్వికాంశాలు సారం-సాంప్రదాయాలను పూర్తిగా మార్చి వికాసాన్ని అందించే బదులు సారం-సాంప్రదాయాలను బలోపేతం చేసే విధంగా, ఎంతటి పురోగమన తాత్త్వికత సైతం సనాతన సారం-సాంప్రదాయాలతో ముడిపెట్టబడి భాగమై వాటిలో లీనం చేయబడినది(కారణం ఏసియాటిక్ మోడ్ ఆఫ్ ప్రొడక్షన్).

ఫలితంగా హిందూ మత సారం-సాంప్రదాయాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టే దాడి అనివార్యంగా అభివృద్ధికర భారతీయ తాత్త్వికతపైనా జరుగుతుందని గమనించాలి. కావున తాత్త్వికతను సారం-సాంప్రదాయాల నుండి విముక్తం చేసి దాని తాత్త్వికతలోని అశాస్త్రీయ-ఊహాజనితాన్ని విమర్శనాత్మకంగా అధ్యాయణం చేసి భౌతికవాద గతితర్కంలో విలీన పరుస్తూ సుసంపన్నం చెయ్యాలి (దీర్ఘకాలిక సామాజిక పోరాటంలో భాగం). అప్పుడు ప్రపంచ తాత్త్విక పురోగతిలో మనం రెండు పార్శ్వాలను బయటపెట్టడం జరుగుతుంది. ఒకటి మన తాత్త్వికతలోని అశాస్త్రీయపు భాగాన్ని తొలగించి సుద్ధి చెయ్యడం. రెండు ఆధునిక భౌతికవాదంతో మిళితం చేసి ప్రపంచానికి అభివృద్ధికర తాత్త్వికతను పెంపోందించడం. దీనితో భారతీయ సమాజంలోని రెండు పార్శ్వాలను అనగా అభివృద్ధి- అభివృద్ధి నిరోధకమును గుర్తించ వీలుకలుగుతుంది. అభివృద్ధి నిరోధక తాత్త్వికతకు రాజ్యం విప్లవ ప్రతిఘాతుక శక్తి, కావున అనివార్యంగా రాజ్యాన్ని ఎదురుకొనక తప్పని అనివార్యత. ఈ ఆవశ్యకత చెడు/ రాక్షసత్వం/ దుష్టత్వం కేవలం మార్చే సమాజం/వ్యక్తి తాలుకు అంశం కాదు, ఆ సమాజపు సంపూర్ణ వ్యక్తీకరణ. కావున దుష్టత్వాన్ని వెంటనే గుర్తించినా ఆ సమాజపు పశ్చాతాపం-దాని యొక్క స్వరూపం- పరిష్కరించాలనే సంకల్పం మాత్రమే పారద్రోలుతుంది. ఇటువంటి సందర్భం తాత్త్విక విప్లవీకరణతోనే సాధ్యపడుతుంది-ప్రజలను చైతన్యవంతులను చేస్తుంది.

2

విశ్వమారి సామ్రాజ్యవాదం

కోవిడ్-19ను ప్రపంచ వ్యాప్తంగా అందరు ఎదురుకుంటున్న విశ్వమారి సమస్యగా పరిగణించడం, అందుకు సామాజిక ఎడాన్ని, నిర్బంధాన్ని పరిష్కారంగా చూపడం, మరీ ముఖ్యంగా అలోపతి వైద్యాన్ని గత్యంతరంగా పరిగణించడం నేడు మనం ఎదురుకుంటున్న సందర్భం. సాహిత్యం (అన్నిరకాల ఛాందసం - అభ్యుదయం) ఆధారంగా శాస్త్రీయ విజ్ఞానాన్ని చర్చించే వాతావరణం భారత దేశంలో(తెలుగు రాష్ట్రాల్లో తీవ్రంగా) ప్రాముఖ్యత వహించడంతో- సాహిత్య పరిభాషతో శాస్త్రీయ విజ్ఞాణ చర్చ పల్చబడటం జరిగింది, మరీ ముఖ్యంగా సాహిత్యమే శాస్త్రీయమైన వాదనకు సరైన ఎంపికగా మలచబడినది. ఫలితంగా శాస్త్రీయ విజ్ఞాణ చర్చ ఈ కాలానికి నోచుకోనిదిగా గత పరిణామక్రమపు స్థల విస్తీరణంలో చక్రాకార పరిభ్రమణంగా పరిగణింపబడుతుంది, నిజానికి శాస్త్రీయ విజ్ఞాణ యాంత్రికతకు పరిమితి-సాపేక్షత ఉంటుంది, ఐతే ఈ సాపేక్షత ఉన్నతమైన గతితార్కిక ఆలోచనా నియమాలతో సమన్వయీకరించడంతో తన పరిధిని బహిరంగ పరుస్తూ భౌతికవాద గతితర్కంతో పునర్నిర్మించబడుతుంది. ఐతే సాహిత్యం తన పరిధిలోనుంచే తనను ప్రతిఫలించుకుంటుంది కాబట్టి విజ్ఞాణ శాస్త్రపు యాంత్రిక పరిమితులతో ఈనాడు మధ్యవర్తిత్వమవుతుంది. ఈ సమస్యను అధిగమించకుండా

కాలక్షేపం చేస్తూ ఉండటంతో శాస్త్రీయతకు చేరువకాలేని ప్రధాన సమస్యగా మారుతుంది. ఫలితంగా కరోనా సమస్యను శాస్త్రీయ దృక్పథంలో నుంచి పరిశీలించడంలో వెనకడుగువేయడంతో శోధనా పద్ధతిలో పరిమితులు ఏర్పడ్డాయి. అందులో ముఖ్యంగా వేడి ప్రాంతాలల్లో సహజంగా ఫ్లూ లాంటి వైరస్లు వ్యాప్తి చెందినా అధిగమించగల వాతావరణం ఉంటుంది కాబట్టి లేదా వైరస్ ఈ వేడి ప్రాంతాల పరిస్థితుల పరిణామానికి గురై ప్రత్యేకీకరణ చెంది వ్యాపించడం జరగవచ్చు. నిజానికి ఏ దేశానికా దేశం వైరస్ పై పరిశోధనలు జరుపుతూ ప్రత్యేకీకరణ సమస్యను అధ్యాయణం చేయడంతో పాటుగా దాని యొక్క సాధారణత్వాన్ని సైతం పరిగణించి వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ సైద్ధాంతిక అవగాహనకు చేరువకానటువంటి స్థితికి కారణం అలోపతీ వైద్యపు ప్రాపంచిక దృక్పథ నిర్ధిష్ట-విశిష్ట వ్యక్తీకరణ రూపమైన యాంత్రిక భౌతిక వాదం.

ఇకపోతే ఆవశ్యకత-యాదృచ్ఛికత అనే అంశాల నుండే పుట్టుకను గమనించాలి అందులోను ఉద్దేశపూరిత వ్యాప్తి/ ఆకస్మిక వ్యాప్తిని అవగాహన చేసుకోవాలి. నిజానికి యాదృచ్ఛికతకైనా, ఆకస్మిక, ఉద్దేశిత విషయాలకైనా ఆవశ్యకతను గ్రహించడం అవసరం. అంతర్జాతీయంగా గృహ రుణ సంక్షోభం క్రమానుగత సంక్షోభం నుండి సంచయ ప్రక్రియ అనివార్యంగా పెట్టుబడి అధికోత్పత్తిని, ఫలితంగా లాభాల ప్రమేయం తగనట్టి స్థితిగా పరిణామం చెందడంతో శాశ్వత సంక్షోభంగా పరిణమించింది, ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా కరోనా వంటి ఉపద్రవాలు ఆవశ్యకంగా తెరమీదకు వస్తున్నాయి, ఈ సమస్య యొక్క ఉద్దేశపూరిత వ్యాప్తిని లేదా ఆకస్మిక వ్యాప్తిని సామ్రాజ్యవాదం దాని తొత్తులు వినియొగించుకుంటూ ఉత్పత్తి కేంద్రాలను మూసివేస్తున్నాయి, ఫలితంగా నిరుద్యోగం విశ్వమారిగా విలయతాండవం చేస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క తీవ్ర లాభాపేక్ష ఫలితంగా పర్యావరణ విధ్వంసం యుగ సంక్షోభానికి దారి తీస్తుంది, అంతేకాకుండా ఈ సంక్షోభ నేపథ్యంలో సామాజిక అసమానతలు తీవ్రతరమవుతున్నాయి, ఈ అసమానతల విషయమై ఉద్యమాలు తీవ్రతరమై ముందుకు సాగుతున్నాయి కూడా. వీటిని సూత్రీకరించడంలో ఆర్థికేతర సంబంధాల ఫలిత సమస్యలని, మరికొంత సున్నితంగా ఉత్పత్తేతర సంబంధాల సమస్యలతో ముందుకువస్తున్న ఉద్యమాలని వాదిస్తున్నారు. ఈ సూత్రీకరణల కొనసాగింపుగా రాజకీయాలు రాజ్యం అధారంగా కన్నా సమాజం

అధారంగా కొనసాగుతాయి అనే వాదనలు లేవనెత్తుతున్నారు(రాజ్యమే సామాజిక ఉత్పాదితం అని గ్రహించడంలో లోపం). నిజానికి పై వాదాలన్నీ ఆధునికానంతరవాద అనురూపాలుగా చలామణీ అవుతున్నాయి. ఉత్పత్తి శక్తుల నిర్థిష్ట దశకు అనుగుణంగా ఏర్పడే ఉత్పత్తి సంబంధాలు మానవ సామాజిక సంబంధాలకు పునాదిగా–నిర్ణయాత్మకమైనదిగా వ్యవహరిస్తుంది, ఈ ఉత్పత్తి సంబంధాల పునాది నుండే ఉపరితలం అన్వయ (సాధనమునకును, సాధ్యమునకును గల నియత సంబంధము) నియమంగా ప్రతిఫలిస్తుంది, అలాగే ఉపరితలం పునాదిపై ప్రభావం చూపుతుంది కూడా. అంతేకానీ ఉపరితల అంశాలు, వాటి రూపాలు వాటికవే స్వతంత్రమైనవని చర్చించడం, ఉత్పత్తి సంబంధాల పునాదితో సంబంధం లేని ఉపరితలంగా భావించడం అశాస్త్రీయం. ఈ అశాస్త్రీయ దృక్పథంతో వైద్య శాస్త్రం తానేదో స్వతంత్ర ఉనికి కలిగినదిగా వ్యవహరించేట్లుగా ఉంటుంది. సామాజిక అసమానతల(శాశ్వత వివక్ష అంటూ ఎక్కడా లేదు సాపేక్షత ముఖ్యం) తీవ్రతకు కారణమైన పెట్టుబడీదారీ వ్యవస్థ యొక్క శాశ్వత కొనసాగింపుకు ప్రయత్నముగా ఈ కరోనా సంక్షోభాన్ని భావించాలి. అంతేకాకుండా ప్రపంచ వ్యాప్తంగా అమెరికా–చైనా వంటి అగ్ర దేశాలతో వివిధ దేశాలు వచ్చిన నూతన వ్యాపార ఒప్పందాలను అమలు చేయడానికి ఈ సందర్భం ఒక అవకాశం, ఫలితంగా గుత్త పెట్టుబడి రోజువారీ చిన్న వ్యాపారాలని కబలిస్తుంది. దీనికి తోడు ప్రపంచాన్ని పంచుకునే సామ్రాజ్యవాద పోటీ ఉగ్రవాదమే నేటి సంక్షోభంగా పరిగణించాలి.

ఇకపోతే ఈ కరోనా సందర్భంలో కేవలం లాభాపేక్ష విధానంతో అలోపతిపై అధారపడే వ్యవహారంతో వస్తున్న–వచ్చే విపత్కర పరిస్థితి సంక్షోభాలుగా మారుతున్నాయి. భారత దేశంలోని వైద్య రంగం ఇప్పటికే 80% ప్రవేటీకరణకు లోనైనది. భారతదేశంలోని పట్టణ ప్రాంతీయులు 70%గా ప్రవేటు వైద్యరంగాన్ని వినియోగించుకుంటున్నారు, అలాగే గ్రామీణ ప్రాంతీయులు 60%పైగా ప్రవేటు వైద్యరంగాన్ని వాడుకుంటున్నారు. ప్రభుత్వ–ప్రవేట్ భాగస్వామ్యముతో(పి.పి.పి) వైద్యరంగం దాని అనుబంధ రంగాలలోని ప్రభుత్వపరమైన శాతం సైతం రోజురోజుకూ ప్రవేటీకరణవైపు మొగ్గుచుపుతున్నాయి. లాభాపేక్ష ఉద్దేశిత వాతావరణంలో వైద్యం అందుబాటులోకి వచ్చే స్థితి కనుమరుగైయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయనే విషయం కరోనా వ్యవహారంలో బయటపడుతున్నది. ఇక ప్రభుత్వాలు ప్రత్యమ్నాయ వైద్య అవకాశాలను ప్రోత్సహించే విధానాన్ని

వదిలేసాయని గ్రహించాలి, ఆయురువేదాన్ని, హోమియోపతిని, యునానీని ప్రత్యమ్నయ వైద్యంగా ప్రోత్సహించి-అభివృద్ధి పరచాల్సిన అవసరం, గుణపాఠంగా ఉద్యమించాల్సిన తరుణమిది, ఐతే నిజానికి హోమియోపతి వైద్య వ్యవస్థ స్వీయాత్మక భావవాద దృక్పథం కలిగియుండటంతో దాని యొక్క పద్ధతిని విస్మరించడం జరుగుతుంది, అంతేకాకుండా ఆయుర్వేదం-యునానీ వైద్యా దృక్పథాలు వస్తుగత భావవాదం మరియూ యాదృచ్ఛిక భౌతికవాదాలు, దీనితో వీటి పద్ధతులను సైతం నిర్లక్ష్యం చేయడం జరుగుతుంది, ఇక అలోపతి వైద్యం యాంత్రిక భౌతికవాదంపై ఆధారపడినది. కావున వీటి యొక్క రూపాన్ని విమర్శించి సారాన్ని కలుపుకుని వైద్య శాస్త్రాన్ని గతితార్కిక ఆలోచనా పద్ధతితో సుసంపన్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఇక కరోనా ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా 489 వేలమందికి పైగా మరణాలు, భారతదేశంలో నైతే 15,301కి పైగా మరణాలు సంభవించాయి, వేలు-లక్షలల్లో భాదితుల సంఖ్య పెరిగిపోతూనే ఉన్నవి. మనిషి రేపటి శవమని జరుగుతున్న మానవ హననాన్ని కర్మ సిద్ధాంతంతో సరిపెట్టుకోవాలా? లేదా మరణాన్ని తర్కిస్తూ మనిషి మరణం రేపటిదైనప్పుడు ఈ రోజు మనిషి జీవించడం రేపటికి మరణించడమౌతుందా... నిజానికి జీవించడం మరణం అని అర్ధమైతే మనిషి రేపటి శవం అని గ్రహిస్తాడా? లేకపోతే మరణం సంభవిస్తేనే రేపటి శవం అని గ్రహిస్తాడా? మనిషి ఎరుక జీవించడమా? మరణించడమా? జీవిస్తున్న ఎరుక మరణాన్ని, మరణిస్తున్న ఎరుక జీవించడాన్ని తలపోస్తాడా? నిజానికి జీవించేది మరణం, మరణించేది జీవించడమనే మానవ సామాజిక జీవన్మరణం. కావున Live to Life, life to Live అనే ప్రక్రియ మానవుడు కేవలం జీవజాతే కాదు సామాజిక మానవుడు అని తెలుపుతుంది. ఇదంతా మానవ కార్యాచరణ చైతన్యం. ఈ చైతన్యం గ్రహించే మానవుడి సామాజిక సంబంధ నిర్ణయ భూమిక. గతం చలనం కాకపోతే వర్తమానం ఉంటుందా? వర్తమానం చలనం కాకపోతే భవిష్యత్తు ఉంటుందా? చలిస్తుంది మానవ సంబంధాలు-మానవుడే, అందుకే చలించేవి గ్రహించగలిగే చలనం మానవుడు. అంతెందుకు పుట్టేవాడు మరణించడం..ఏమని గ్రహించడం చలనం సారం కాదా? మానవ అవసరం అనివార్యంగా తనకోసం ఇతరుల ద్వారా వ్యక్తీకరించబడుతుంది. అందుకే సామాన్యత ఇమిడియుంటుంది,

జీవించడం–మరణించడం మానవ సంబంధం కాక ఏమౌతుంది అందుకే “HOMO SUM HUMANI NIHIL A ME ALIENUM PUTO” కావున మానవునికి సంబంధించినవి ఏవీ ఏ మానవునికైనా పరాయివి కావుగా. కావున మానవుడు సామాజిక సంబంధాల సారం.

“అగ్ని నాగ్నిస్సమిధ్యతే”...నిప్పును నిప్పే వెలిగించగలదు అనే ఈ సూక్తి సాధారణమైనదిగా ఉండవచ్చు కానీ ప్రత్యేక పరిస్థితులల్లో దాని చెల్లుబాటును పరిగణించడమే దాని మనుగడను జ్ఞానీకరించే విజ్ఞానం, నిజానికి సామాజికాంశాలలో అన్ని సందర్భాలల్లో ప్రచోదనం కాగలిగిన సూక్తిగా కన్నా ఆయా సందర్భానుసారం వర్తించే వ్యవహారంగా ఉంటుంది కూడా. అందుకే మన పరిస్థితుల నిర్థిష్టత నుండే వ్యవహరించాలి ఈ నేపథ్యం నుంచే ప్రపంచవ్యాప్తంగా సంభవించిన సంక్షోభం సామ్రాజ్యవాద వ్యాపార లాభాపేక్ష జనితం–ఫలితమని గుర్తించాలి, విశ్వమారీ/మహమ్మారీ కోవిడ్–19 కాదని దాని పునాదియగు సామ్రాజ్యవాదమే విశ్వమారియని గ్రహించాల్సిన సమయం ఇది. సామ్రాజ్యవాదమే ప్రపంచాన్ని కబలిస్తుంది. సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘటిత పోరాటాలతోనే మనల్ని మనం కాపాడుకోగలమని–పోరాటాలతోనే ప్రాణ రక్షణకానీ తాత్కాలిక సామాజిక యెడం మరియూ నిర్భంధంతో కాదని గ్రహించాలి.

3

కుల నిర్మూలన జరగాల్సిందే...

ఆలోచనలు–భావాలతోనూ నిమిత్తం లేకుండా – ఉనికి' కలిగియుండటమే వస్తుగతమైనది. మానవుని ఆచరణ/కార్యాకలాపం దానికదిగా వస్తుగతమైనది. ఐతే మానవుని ఆచరణ కార్యకలాప వస్తుగత విశిష్టత – భావాత్మక ఉనికి' (అస్థిత్వం–ఆలోచనల ఏకత్వం). ఇక మానవుని భౌతిక పరిస్థితుల ప్రతిఫలనంగా వస్తు(మానవుని ఆచరణాత్మక–భావాత్మక) స్వభావాన్ని గ్రహించడం జరుగుతుంది, ఈ గ్రహింపు క్రమంలో అమూర్త భావనగా కాకుండా మానవుని ఆచరణాత్మక కార్యకలాపం ద్వారా హేతుబద్ధ జ్ఞానం సాపేక్ష గ్రహింపుగా సాలోక్యం–గ్రహింప వస్తు క్రమ స్థితిలో భాగమవుట, సామీప్యం–గ్రహింప వస్తు సమీప ఆర్జన, సారూప్యం–వస్తు రూప సంగ్రహణం, సాయుజ్యం–గ్రహింప వస్తు మధ్యవర్తిత్వ ఐక్యతలుగా ఉంటుంది. ఐతే కేవల అనుభవ ప్రధాన విషయంగా వస్తు తత్వాన్ని గ్రహిస్తామనుకోవడం పొరపాటు. ఈ పొరపాటు దృక్పథం నుంచే అన్య దృక్పథాలు ఉద్భవిస్తున్నాయి కూడా. నిజానికి కుల సమస్య పై చర్చలలో ముఖ్యంగా కులాల పుట్టుపూర్వోత్తరాలు, కుల సమస్యపై సాంఘిక సంస్కరణోద్యమాలు–సంస్కర్తల గుర్తింపు, శ్రమ విభజనే కాదు శ్రామికుల విభజన సమస్య, వివిధ కుల నిర్మూలనా కార్యక్రమాలు–వాటి శాస్త్రీయతలు ప్రధానమైనవి. కుల సమస్యపై

పరిశోధించే వారు, చర్చించే వారు ఈ ప్రాథమిక అంశాలని తడమకుండా ముందుకు సాగలేరు.

ఇప్పటి వరకూ కుల సమస్య పై మాట్లాడుతున్న లేదా ఉద్యమిస్తున్న సాంఘిక సంస్కరణోద్యమాలు–సంస్కర్తలు మతాన్ని దాని మటుకు అదేదో స్వయం ఉత్పాదితం అయినట్లు భావించడంతో మానవ సారాన్ని మత సారంగా తేలుస్తున్నారు. దీనితో మతం సృష్టిగా కులాన్ని పరిమితం చేస్తున్నారు–చేసారు. మతం మారితే కులం దానంతటదే పోతుందని భావించి ఆచరించారు కూడా. కానీ వీరు మతం సామాజిక ఉత్పాదితమని గ్రహించకుండా తప్పుడు చైతన్యంతో సాగారు. మానవుడుని కేవలం జీవజాతిగా తేలుస్తున్నారు, మానవ సారమనేది సామాజిక సంబంధాల సారమని భౌతికవాద గతితార్కిక దృక్పథం సామాజీకృత మానవ జాతిగా–మానవీకరణ అంశాన్ని గ్రహిస్తుంది–గుర్తించాలనంటుంది. నిజానికి ఈ సంస్కర్తలు తాము కలిగి ఉన్న దృక్పథం ప్రత్యేక సామాజిక రూపానికి సంబంధించినదని గ్రహించాలి.

ఇక చరిత్ర ప్రారంభ యుగాలలో సామాజిక సంబంధాల శ్రమ విభజన ప్రతిఫలనం శ్రామికుల విభజనగా అనగా ప్రత్యేక సామాజిక రూపాల సంక్లిష్ట తరతమ భేదాలుగల సాంఘిక విభజనగా ఏర్పడ్డాయి–ఉన్నవి. ఈ విధమైన సామాజిక స్థితిలో భేద భావనపై చర్చ సాగుతుందే కానీ స్వతంత్ర భావనపై చర్చగా ఉండటం జరగదు, కానీ పోనుపోనూ వర్ణ సామాజిక రూపం నుండి కుల సామాజిక రూపాల (చేతి వృత్తులు) భౌతిక పరిస్థితులలో అదనం వడ్డీలుగా పోగుబడటంతో వంశపారంపర్యపు కుటుంబ వారసత్వ ఉత్పత్తిలోనే సమాజం కుచించుకుపోయిన స్థితిని గ్రహించవచ్చు. ఐతే పెట్టుబడి ప్రవేశంతో కుల వృత్తుల విధ్వంసం ప్రారంభమైనది. రోజురోజుకూ పెట్టుబడి సంచయనం–విస్తీరణం పెరుగుతుండటంతో ఈ నాటికీ కుల వృత్తుల విధ్వంసం జరుగుతుంది కూడా, కుల వృత్తుల విధ్వంసంతో ఏర్పడిన స్థితిని పరిష్కరించడంగా ఖచ్చిత భిన్న వృత్తుల అవకాశాలు, భూమి పంపకం జరగడం, ఉద్యోగావకాశాలు ఏర్పరచడంతోపాటుగా, సాంఘిక వివక్ష నిర్మూలనకు కటినమైన చట్టాలు, అధునిక విజ్ఞాణ శాస్త్ర విద్య, సాంస్కృతిక ప్రజాస్వామ్యం రాజ్యాంగబద్ధ నిర్బంధ రూపంలో అమలు కావాలి. కానీ భారతదేశంలో ఈ విధంగా జరగలేదు పైపెచ్చు కులవృత్తుల విధ్వంసంతో

వివిధ రోజువారీ కూలీలుగా- వివిధ ఉపాధులలో భాగమయ్యారు, ఐతే ఇది ఖచ్చితమైన అవకాశాల రూపంలో కాదు కాబట్టే ఆయా కులాల వారు దెబ్బతిన్న తమ భద్రతా వృత్తి స్థానే స్థిరమైన జీవనాధారాన్ని కోరుతూ వివిధ కులవాదాలను- కుల ఉద్యమాలను లేవనెత్తుతున్నారు. నిజానికి ఈ విధమైన శకలవాద స్థితి నుండి సంఘటితమైన రూపానికి కుల సమస్యను కుల నిర్మూలనా పోరాటంగా రాజకీయ అధికారం సాధించడంతోనే పరిష్కార మార్గమవుతుందని అంబేద్కర్ గారు భావించారు. కానీ శకలవాదాల మధ్య ఈ కుల నిర్మూలనా పోరాట రూపం అభివృద్ధి కాకపోంగా ఆయా కులాల రాజకీయ వాటా ఉద్యమంగా ముందుకు సాగుతుంది. కుల నిర్మూలనా పోరాటాలు-నినాదాలు కుల సమస్య మూలంగా జరిగే సంఘటనలు-వివక్షతలకు వ్యతిరేకంగా స్పందించడంగా పరిమితించబడింది. ఇక సుధీర్ఘమైన పోరాటాల ఫలితంగా సాంఘిక సంక్షేమ పథకాలు రావడంతో వాటి యొక్క వినియోగం, రిజర్వేషన్ల అమలు, వాటితో ఉద్యోగాలు సాధించడం జరుగుతుంది. (ఇంకా కుల వృత్తులను పాటిస్తున్నవారి సంతానం-మరియూ కుల వృత్తులు విధ్వంసం అయినవారు మరియూ వారి సంతానం, ఐతే వీటి వినియోగంలో వీరందరి శాతం అత్యంత అల్పమే). దీనితో వీరిలోనుంచే నూతనంగా వర్గాలు ఆవిర్భవించడాన్ని కూడా గమనించవచ్చు.

నేటి పెట్టుబడీదారీ యుగ విశిష్టత సంక్లిష్ట భేదాలుగల సాంఘిక విభజన వైరుధ్యాలు తొలుగుతూ రెండు మహా వర్గాలుగా విభజన అవ్వడం. అయితే భారతదేశంలో ఈ వైరుధ్యాల సంపూర్ణ తొలగింపు జరగని స్థితిలో విరోధాభాసగా పరిణమించింది(దానికదే ఒక వైరుధ్యం). సామాజిక మార్పు ఒక సంక్లిష్ట ప్రక్రియగా మారింది కూడా. కావున కుల సమస్యకు వ్యతిరేకంగా కేవలం వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడటంతో తాత్కాలిక పరిష్కారం దొరకవచ్చును, కానీ దీర్ఘకాలిక పరిష్కారం చైతన్యయుత కులనిర్మూలనా కార్యక్రమం-ప్రణాళిక ద్వారా అనగా రాజకీయార్థిక-సాంస్కృతిక డిమాండ్ల కోసం ఉద్యమించడమే ముఖ్యం, అందుకు నూతనంగా ఆవిర్భవిస్తున్న వర్గ శక్తులు నాయకత్వం వహించాలని అంబేద్కర్ గారి భావన కూడా, ఐతే ఈ నూతన వర్గాలు కుల సమస్య యొక్క భావజాల పర కులవాదులుగా, కుల ఉద్యమకారులుగా పరిమితమయ్యారు(అంబేద్కర్ గారు తీవ్రంగా మదనపడిన విషయం కూడా ఇదే).

కావున ఈ రోజుకూ అభ్యుదయులు కుల సమస్యను పట్టించుకోకుండా విస్మరించడం ఒక వాస్తవం. పెట్టుబడి లాభాపేక్షకై జరుగుతున్న వర్గ దోపిడిలో కుల సమస్యను దాని పాత్రను పట్టించుకోవాలి కూడా. దీనికి ఉదాహరణగా ఉనికిలి గ్రామంలోని(కృష్ణా జిల్లా, మండవల్లి మండలం) షెడ్యూల్డ్ కులాల(ప్రస్తుతం పేద–మధ్యతరగతి రైతులుగా ఉన్నారు) రాజకీయార్థిక సమస్యను ప్రస్థావించవచ్చు, ఈ గ్రామంలోని సాంఘిక కులాలు మాల–మాదిగ–మాల దాసులు 2000, చౌదరీలు 400, యాదవులు–శెట్టిబలిజలు 500, ఎరుకల తెగ 10 గడపలుగా ఉన్నారు. ఓటర్లు 1600 మందికాగా, జనాభా మొత్తం 5500 మంది. ఇకపోతే 1956వ సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉనికిలి గ్రామ పరిధిలోగల 146 ఎకరాల 3 సెంట్లను షెడ్యూల్డ్ కులాల గ్రామస్తులు పొంది వ్యవసాయానికి వాడుకున్నారు. ఐతే 1989వ సంవత్సరంలో 70 ఎకరాలకు జిగ్ జాగ్ పద్ధతిలో పట్టాలు పొందారు. అగ్రకుల చౌదరీలైన(భూస్వామ్య–దళారీలు) కొందరు షెడ్యూల్డ్ కులాల వారిని నమ్మించి వారి భూములను చేపల చెరువుగా మార్చి లీజుకు తీసుకుని సంవత్సరానికి ఎకరాకి 3000రూపాయలుగా ఇస్తూవచ్చారు. ఐతే 1992 సంవత్సరం నుండి వేరొక ఊరి నుండి అగ్రకుల క్షత్రీయుడైన(భూస్వామ్య–దళారీ) మరొకరితో 146 ఎకరాలని లీజుకు తీసుకునేట్లు చేసారు, కానీ 146 ఎకరాలలో 69 ఎకరాలకే పట్టాలు ఉన్నవి కాబట్టి వాటికే లీజు డబ్బు ఇస్తానని లేకపోతే చెరువు ఎండగడతానని బెదిరించారు. దీనితో 69 ఎకరాలకు 5వేలు చొప్పున అంటే సంవత్సరానికి 3,45000 రూపాయలు ఇవ్వడానికి ఒప్పందం అయింది. 146 ఎకరాల 3 సెంట్లలో 126 ఎకరాలు పెద్ద చెరువుగా, 18 ఎకరాలు చిన్న చెరువుగా ఉంది. ఈ క్షత్రియ అగ్రకులస్తుడు 69 ఎకరాలకు లీజు డబ్బులు చెల్లిస్తూ మిగతా 77 ఎకరాలను అప్పనంగా వాడుకుంటూ పెట్టుబడిపై అదనపు లాభం గడిస్తున్నాడు. ఇక పట్టాలు లేని 77 ఎకరాల భూమిని ఈ ముగ్గురు దొంగ పట్టాదారులుగా గుర్తింపు కార్డులు లేని వారి బినామీగా నమోదు చేసుకున్నారు(రెవెన్యూ అధికారుల మద్ధతుతో జరిగిన ప్రక్రియ). ఐతే ఈ బినామీ రద్దు కోసం అనేక సంవత్సరాలుగా షెడ్యూల్డ్ కులాల (పేద–మధ్యతరగతి రైతులు) వారు పోరాడి సాధించారు. ఇక 77ఎకరాల భూమిపై గల హక్కు విషయంలో మాట్లాడనీయకుండా షెడ్యూల్డ్ కులాల వారిని రకరకాల పద్ధతులల్లో ఇబ్బందులకు

గురిచేస్తున్నారు కూడా. లీజును చేపల పిల్లలు పెరగలేదని, నీరు లేవని అదనంగా 6 నెలలు పొడిగించుకుంటారు, దీనితో పాటుగా 2019 డిశెంబర్ 25న పండుగ ఖర్చులుగా 1000 నుండి 3000 రూపాయలుగా ఇస్తూ లీజు ఎగ్రిమెంటును పున:ప్రారంభించుకున్నారు. ఈ విధంగా దోపిడి కొన్ని సంవత్సరాలుగా జరుగుతుంది (వ్యవస్థాగతంగా ఈ దోపిడికి సహకారం అందుతుంది కూడా–పోలీసులు, రెవెన్యూ, రాజకీయ నాయకులు). షెడ్యూల్డ్ కులాలు(పేద–మధ్యతరగతి రైతులు) వివిధ దోపిడి రూపాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నా ఫలితం లేకుండా పోయింది(అదే అగ్ర కులాలు –వర్గాలు ఇంతలా సుదీర్ఘకాలం దోపిడీ–అణచివేతలకు గురౌతారని ఊహించగలమా?).

ఇకపోతే భారత దేశంలో వివిధ రూపాలల్లో కుల వివక్ష–అంటరానితనం తీవ్ర సమస్యగా ముందుకు వస్తున్నది. ఈ వివక్ష ప్రధానంగా శ్రమ విభజన ఆధారంగా శ్రామికుల విభజన శ్రమల యొక్క కట్టుబాట్లు–సాంప్రదాయాలు భావజాల వ్యవస్థల–భావజాల సంస్థల భావజాల రూపంలో ప్రతిబింబించడం జరుగుతుంది. ఇది తప్పుడు చైతన్యపు తారుమారు ప్రతఫలనంగా ఉంటుంది. ఇక ఈ అంశం భారతదేశంలో మత భావజాల రూపంగా చలామణీ అవ్వడంతో సాంఘిక వివక్షకు మతం ప్రాతిపధికగా ఉంటుంది. అందుకే ఈ వివక్ష వ్యతిరేకత మత విమర్శగా సాగుతుంది. దీనితో మతమే కులాల–కట్టుబాట్ల పుట్టుకకు మూలంగా భావించే తారుమారు ప్రతిఫలనానికి గురికాబడతాం. అంతేకాకుండా పెట్టుబడి ఫలితంగా వస్తున్న మార్పులు, జరిగిన పరిణామాలలో భావజాల రూపంలో గత వివక్ష తాలూకు అంశాలు భౌతిక పరిస్థితుల ప్రతిఫలనంగా ఉద్భృతమవుతున్నాయి. వివక్ష ప్రత్యక్ష – పరోక్ష రూపాలలో సాగుతుంటాయి. కావున దీర్ఘకాలిక రాజకీయార్థిక–సాంస్కృతిక ఉద్యమ ప్రణాళికతో కూడిన పోరాటాలను నిర్మించాలి అందుకు సామాజిక సంబంధాల మూలాలను గ్రహించడంతో కుల సమస్యకు పరిష్కారాన్ని పొందుతామని గుర్తించాలి.

4

రాజకీయ ఖైదీల సత్యార్థం

రాజకీయ ఖైదీల విడుదల కోసం ఉద్యమించడం నేటి సందర్భం, నిజానికి రాజకీయ ఖైదీల విడుదలకై ఉద్యమం సరైన రీతిలో జరగడం లేదనే బలహీన వాదం వినబడుతూనే ఉంటుంది. రాజకీయ ఖైదీలు వారి కుటుంబాలు ప్రత్యక్షంగా, మరీ బలంగా కూడా తమవారి విడుదలకు ఉద్యమాలు జరగడం లేదని లేదా ఆ స్థాయిలో లేవని విచారించడం పరిపాటి. అందుకుగాను సంఘాలు, వాటి సభ్యులును నిందించడం జరుగుతుంది. అంతేకాకుండా అసలు రాజకీయ–ఆర్థిక–సామాజిక–భావజాల(అస్థిత్వాలు) సమస్యలను వదిలేసి కేవలం రాజకీయ ఖైదీల విడుదలకే కాలాన్ని వెల్లబుచ్చడం సరైన సిద్ధాంతమా అని తర్కించడం జరుగుతుంటుంది. మరి కొందరు రాజకీయ ఖైదీల పోరాటం కమ్యూనిస్టుల సందర్భంలో వారి రాజకీయ నాయకుల నిర్బంధ సందర్భంగా వ్యవహరించే విషయాన్ని కేవలం అనుచరులు–వివిధ సంఘాలు–నిరసన గళాలు వినిపించే వారి సందర్భంలో సైతం వ్యవహరించవచ్చా అని వాదిస్తుంటారు. ఏమైనప్పటికీ వాక్ స్వాతంత్రము, భావప్రకటనా స్వేచ్ఛను ఉపయోగించే వాతావరణం, వేదికలను వాడుకునే సందర్భం(రాజ్య కల్పననే) ఆధారంగా రాజ్యవిధానపు ఆదేశిక సూత్రాల అమలు హక్కుకై

అభిప్రాయాన్ని వ్యక్తం చేసినా రాజకీయ ఖైదీలుగా మారబడుతున్నారు, దీనిని తప్పించుకోని రాజకీయ ఖైదీల సమస్యను చర్చించలేని కాలం ఉద్భవించింది.

ఇకపోతే దేశంలో కొన్ని ఏళ్ళుగా జరుగుతున్న రాజకీయ పోరాటాలు, ఈ పోరాటాల తీవ్రత, స్థాయిని అనుసరించి రాజకీయ పోరాటాలలో భాగంగా రాజకీయ ఖైదీల విడుదల, మరీ ముఖ్యంగా ఈ పోరాట నేపథ్యంలోని నాయకులే కాకుండా దాని శ్రేణులను సైతం రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని ఉద్యమించడం జరిగింది. ఉద్యమ ఫలితాలు సైతం సాధించడం జరిగింది. ఐతే ఇటీవల రాజకీయ ఖైదీలకు ఉండే హక్కులు, కొన్ని మినహాయింపులు లేకుండా జైళ్ళల్లో సాధారణ నేరస్థులుగా గుర్తించాలనే రాజ్య స్వభావం బహిర్గతం అవుతున్నది, ఫలితంగా రాజకీయ ఖైదీలుగా గుర్తింపును కోల్పోవడం జరుగుతుంది. ఇదిలా ఉండగా విశాల ప్రాతిపధికలో నిరసన గళాలు విస్తరిస్తున్న సందర్భంలో నిర్బంధానికి గురౌతున్న వ్యక్తీకరణలు పెరుగుతున్న వాతావరణంలో వీరు సైతం సాధారణ నేరస్థులుగా పరిమితం చేయబడటం జరుగుతుంది. కావున సువిశాల ప్రజాస్వామిక వేదికలో రాజకీయ ఖైదీలుగా గుర్తింపుకు నోచుకోవడం ప్రథమ విషయంగా ముందుకు వస్తుంది. ఈ నేపథ్యంలో రాజకీయ ఖైదీల గుర్తింపును చర్చించడం- ఉద్యమించడం ప్రధానం.

ఇక రాజకీయ ఖైదీల గుర్తింపు వారి హక్కుల సాధనలో భాగమై విడదీయనటువంటిది. కావున రాజకీయ ఖైదీలుగా హక్కులకు నోచుకోవడం సర్వసాధారణ నియమం. రాజ్యాంగ తరుణోపాయముల హక్కులు, స్వేచ్ఛా, సమానత్వం, వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన హక్కులతో పాటుగా, జీవించే హక్కును కలిగి ఉండాలి. రాజకీయ ఖైదీ దేశ సార్వభౌమ్య హితార్ధ సంకల్ప సిద్ధి కలిగిన వారే, కానీ రాజకీయ ఖైదీ దేశ ద్రోహి అనే విపరీతార్ధములకు పోయి జీవించే హక్కును కాలరాసే విధానం కక్షపూరిత కుట్ర (వర్గ స్వభావంలో భాగం) అవుతుందే కానీ ప్రజాస్వామ్యమని పరిగణన అవ్వదు.రాజకీయ ఖైదీలుగా గుర్తింపు పొందడం ప్రధానమైతే వారు హక్కులకు నోచుకోవడం ద్వితీయత్వం.

రాజకీయ ఖైదీల అంశానికి రెండు కోణాలు ఉంటాయి ఒక కోణం ఏమనగా పాలక పక్షానికి వ్యతిరేకంగా గళం విప్పినా లేక వ్యతిరేకంగా పోరాడినా నిర్బందింప పడటం మరొక కోణం ఏమంటే ఇక ఏ రాజకీయ పక్షం పాలక వర్గంగా ఉన్నా

తమకంటూ వ్యతిరేక వర్గం(అభ్యుదయులు లేక ఛాందస్సులైనా కావచ్చు) ఉనికి కలిగి ఉండటం. ఆ వర్గం కచ్చితంగా పాలక పక్షానికి వ్యతిరేకంగా నిరసనను, పోరాటాన్ని ముందుకు తీసుకుని వస్తారు ఫలితంగా రాజకీయ ఖైదీలుగా పరిగణించబడతారు. రాజ్య ఆవిర్భావం–ఉనికి వర్గ వైరుధ్య ప్రతిఫలనం, కావున సుధీర్ఘ చారిత్రక పోరాట పరిణామ క్రమంలో భాగంగా ఉద్భవిస్తున్న రాజకీయ ఖైదీలను వారి వర్గ స్వభావాన్ని గుర్తిస్తూనే దాని యొక్క సాధారణత్వాన్ని గ్రహించి రాజకీయ ఖైదీల సామాన్యత ప్రాతిపథికగా ముందుకు సాగాల్సిన అవసరం ముందుకు వస్తుంది. కావున రాజకీయ ఖైదీలకు నిర్ధిష్ట గుర్తింపు, హక్కులు ఏర్పర్చుకునే ఉమ్మడి ప్రణాళికను తయారు చేసుకోవాలి, దీనిని సాధారణీకరణ రూపంలో అభివృద్ధి, అమలును ఉద్యమ సంస్థలు, హక్కుల ఉద్యమాలు పూనుకోవాల్సిన తరుణం.

5

గరుడాంధ్రము

కేంద్రం ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వాన్ని కూల్చడానికి పన్నిన కుట్రాజికీయమును ఆపరేషన్ గరుడగా అభివర్ణిస్తూ విస్తృత ప్రచారం, సమీకరణ, ఆందోళనలు సాగుతున్నాయి. నిజానికి ఈ అభియోగం వాస్తవమైనదా అంటే నిజం కావచ్చు నిజం కాక పోవచ్చు– నిజం కావచ్చు, కాకపోవచ్చని అది అసలు అవ్యక్తవ్యమని, నిజం కావచ్చు కానీ అవ్యక్తవ్యమని, నిజం కాకపోవచ్చు కానీ అవ్యక్తవ్యమని, నిజం కావచ్చు కాకపోవచ్చు కానీ అవ్యక్తవ్యమని అభిప్రాయపడుతున్నారు. నిజానికి మన దేశ రాజకీయాలల్లో జరిగే పరిణామాలు వ్యక్తావ్యక్తముగా చలామణి అవుతూ ఉంటాయి. ఫలితంగా సందర్భాను సారంగా అభివృద్ధి చెందే భావోద్రేకములే రాజకీయ విశ్వాసాలను ఏర్పరుస్తూ కాలం గడిపేస్తూండేటువంటి స్థితి కలుగుతూంటుంది.

శరీరి–శరీరం

శరీరి కేంద్రం–శరీరం రాష్ట్రాలు. నిజానికి శరీరి శరీరం కన్నా ఉన్నతమైనది, శరీరికి–శరీరానికి భేదం మాత్రమే ఉంటుంది కానీ స్వతంత్రత ఉండదని వ్యవహారం. ఐతే శరీరి లేనిదే శరీరం ఉండదు–శరీరం లేనిదే శరీరి ఉండదు. అవి విడదీయనటువంటి

అంతఃసంబంధం కలిగియున్నవని గ్రహించాలి. అందుకే కేంద్రం యొక్క అభివృద్ధి రాష్ట్రాల అభివృద్ధిగా కేంద్రం యొక్క వైఫల్యములు రాష్ట్రాల వైఫల్యముగా ఉంటుంది. రాష్ట్ర అభివృద్ధి కేంద్ర అభివృద్ధిగా రాష్ట్ర వైఫల్యం కేంద్ర వైఫల్యంగా వ్యక్తమవుతుంది. కావున జరిగిన, జరుగుతున్న పరిణామాల మధ్య సమన్వయం ఉన్నది. ఇవి పరస్పరత కలిగినాంశములు.

పూర్వకాండ

మంచి ప్రభుత్వం రాష్ట్రానికి–దేశానికి మేలు–శ్రేయస్కరం. ఆ ప్రభుత్వానికి–పరిపాలకులకు ఉండవల్సిన ప్రధాన అంశాలు ధర్మం–సత్యం–న్యాయం, ప్రజలు బరించే పన్నులు విధించటం, మంత్రులు–అధికారులు ప్రజల పక్షం వహించడం, జారులు అయ్యియుండకుండుట, అంతేకాకుండా స్థిరత్వం కలిగిన పరిపాలక నాయకత్వం ముఖ్యము, వీటికి తోడు విదేశీ దాసోహం ఉండకుండుట. ఈ లక్షణాలు లేనటువంటి రాజ్యం నిలదక్కుకోలేని స్థితికి జారుకుంటుందని గరుడ పురాణం సెలవిచ్చింది. నిజానికి ఇటువంటి స్థితి లేనటువంటి రాష్ట్రాలల్లోని ప్రభుత్వాలు ఉండవల్సిన అవసరం లేదుకూడా కానీ జరిగిన అభివృద్ధి– జరుగుతున్న అభివృద్ధి– జరగబోయే అభివృద్ధిని అటు తరువాత అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు కొనసాగించడం, స్థిరత్వం కల్పించడం ముఖ్యము, ఐతే అభివృద్ధి నిర్వచనము మార్పు చెందవల్సిన అవసరం ఉంది లేదా సంక్షోభం విలయ తాండవం చేస్తుంది.

ప్రేత కాండ

పరిపాలనలో జరిగిన దోషాలు, స్వార్ధం ఫలితంగా ఇబ్బందులు, ధన వ్యామోహం, పదవీ వ్యామోహం, దేశాన్ని అజ్ఞాణాంధకారంలో నడిపించడం, ఒకటేమిటి దేశంలో జరుగుతున్న సర్వ తప్పులకు అనుభవించవల్సిన శిక్షల ఫలితంగా పతన సమయంలో చేస్తున్నటువంటి పనులు మన రాజకీయ నాయకుల ఈ విన్యాసాలు. ఎన్ని కూటములు ఏర్పచుకున్నా ప్రజల సమస్యలకన్నా స్వార్ధ రాజకీయమే ప్రధానంగా ఉన్నది, వారి తప్పులను కప్పిపుచ్చుకోవడానికి చేసే ఈ పనులు తాత్కాలిక ఉపశమనమే కానీ దీర్ఘకాలిక పరిష్కారం కానే కాదని గ్రహించాలి.

ఈ పరిస్థితులపై సమాజం జ్ఞానాన్ని సంపాదించుకోవాలి, జరుగుతున్న పరిణామాలకు ప్రత్యామ్నయాన్ని అన్వేషించాలి. అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వాంసాన్ని గ్రహించాలి. వాస్తవ అభివృద్ధికై ప్రశ్నించాలి, అప్రజాస్వామిక–నియంతృత్వ–స్వార్థ రాజకీయాలను తొలగించడమే ఆపరేషన్ గరుడగా, ప్రజలే కీలకదారులుగా వ్యవహరించాలి.

6

ఎడారి వాసనపై విమర్శనాత్మక పరిశీలన

కవిత్వంపై సమీక్ష చారిత్రకంగా జరగవలసిన అవసరం ఉన్నది. చారిత్రకంగా సమీక్షించడమంటే తాత్విక విశ్లేషణ ఆవశ్యకత. కవిత్వంపై నేటి వరకూ జరిపిన వర్గీకరణ అశాస్త్రీయమైనది. కవిత్వం ఏ తాత్వికత యొక్క ప్రభావంతో వెలువడినదో విశ్లేషించుకోనంత కాలం కవిత్వంపై శాస్త్రీయ దృక్పథం పెంపొందదు. కవిత్వపు తాత్వికతను దాని దృక్పథం, పద్ధతి, సిద్ధాంతం, భావజాలంల ద్వారా తెలుసుకోవాలి, విశ్లేషించుకోవాలి. తాత్విక దృక్పథాలైన వస్తుగత భావవాదం, స్వీయాత్మక భావవాదం లేదా అధిభౌతికవాదం, యాంత్రిక భౌతికవాదం, భౌతికవాద గతితర్కాలపై ఆధారపడిన కవిత్వాన్ని మొదట గ్రహించాలి ఫలితంగా ఆ కవిత్వం ఏ తాత్విక నేపథ్యమో విశ్లేషణకు రావచ్చు, కవిత్వం యొక్క దృక్పథానికి అనివార్యంగా పద్ధతి కీలకం, ఈ పద్ధతి అధిభౌతికమూ-గతితార్కికములు. ఇకపోతే జ్ఞాన సిద్ధాంతం అనేది జ్ఞాన ఆధార అవగాహన, భావజాలం విషయానికి వస్తే భావజాలం అనేది తారుమారు/తలక్రిందులుగా అభివర్ణించాలి, వాస్తవికతకు పూర్తి తారుమారు ప్రతిఫలనమే భావజాలం. కవిత్వమనేది భావజాలం, అది వాస్తవికతపై వైయక్తిక తారుమారు ప్రతఫలనం. అందుకే కవిత్వం అనుసరణ. ఈ తలక్రిందులపై సరైన తాత్విక విశ్లేషణ జరిపితేనే దానిని నిటారుగా పాదాలపై నిలబెట్టగలము. అప్పుడు

కవిత్వాన్ని తాత్వికంగా విమర్శించి విప్లవీకరించడం సాధ్యపడుతుంది. ఐతే సమీక్ష అనేది విరుద్ధాంశాల మధ్యవర్తిత్వ ఐక్యతను తెలపడం అందుకే ఆయా కాలాల్లో ఉద్భవించిన కవిత్వము–ఆధునిక కవిత్వాల కొనసాగింపుల మధ్య ఐక్యతలను గ్రహించి అవగాహన చేసుకోవాలి. ఈ నేపథ్యం నుంచే ఎస్. చంద్రయ్య రాసిన ఎడారి వాసన కవితా సంపుటిని(అభిజ్ఞ ప్రచురణలు–ఫిబ్రవరి,2019) అవగాహన చేసుకోవాలి. ఈ కవితల సంపుటిలో రచయిత దృక్పథం ఈ క్రింది కవితా పాదాన్ని బట్టి అవగాహన చేసుకోవచ్చు ....

"మనిషిని అర్థంచేసుకున్నామని చెప్పటమంటే
సముద్రానికి బొటనవేలు తాకించి
మునకలు వేసామని ప్రగల్భాలు పలకడం
మనిషి లోతుల్ని చేరుకోగలిగామని చెప్పటమంటే
పైకి ఉప్పొంగినప్పటి లావాను పరికరంతో పట్టుకోవడం....."(మనిషి లోతుల్లోకి..)

ఎంపిక అనేది ఆధునిక మనిషికి కీలకమైన అంశంగా మారడానికి అభివృద్ధిచెందిన–చెందుతున్న ఉత్పత్తి శక్తులు–శ్రమ విభజన ఫలితమని చెప్పుకోవాలి. అయితే స్వీయాత్మక భావవాద దృక్పథ భూమికగా మానవ ఎంపికను తాత్వీకరిస్తూ ఇదైనా అదైనా అనేదే నిర్ణయాత్మకమైనదని తేల్చడంగా అస్థిత్వవాదం బయలుదేరింది.

"వివిధ అస్తిత్వాలు ఆత్మగౌరవంగా కాకుండా
భావోద్వేగాల్ని రెచ్చగొట్టే ఉత్ప్రేరకాలుగా మారిన చోటుకు
మీరూ వెళ్ళాలనుకుంటున్నారా...
ఆ మాటకొస్తే ఏ అస్తిత్వమూ ఆత్మగౌరవ ప్రతీక కాదేమో
అవి ఒక ఉద్వేగాల సంపుటి
ఉవ్వెత్తున ఎగసి చప్పున చల్లారే సముద్ర కెరటాలు.."

ఈ కవితా పాదంలో రచయిత స్పష్టంగా అస్తిత్వాలు ఆత్మగౌరవ సూచికగా ఉండాలని వ్యక్తంచేస్తూనే భావోద్వేగాలుగా అస్తిత్వాలు వ్యక్తమవుతున్నాయని తెలుపుతున్నారు అంతేకాకుండా ఉద్వేగాల ప్రయోజనాన్ని కూడా స్పష్టంగా రచయిత అదే కవితలో వెలువరించారు

"ప్రజలు భావోద్వేగపు మత్తులో జొగుతున్నప్పుడు
చివరికి ఎవరికో ఒకరికి, ఎప్పుడో ఒకప్పుడు
తాకట్టు పెట్టే నాయకుల తయారీ కర్మాగారానికి..."

ఇచ్ఛాశక్తి మాత్రమే తనకొరకు తానుగా మనిషిని నిలబెడుతుందని కొందరు వాదిస్తే, అనుభవమనే చైతన్య స్రవంతి యొక్క నిత్యపరివర్తన మాత్రమే సత్యమని మరికొందరు భావించారు, ఐతే ఈ వాదాలన్నింటికీ పరాకాష్ట తనకొరకు తాను అయిన అస్తిత్వం (మానవ చైతన్యం–శూన్యత) తనలోతానైన అస్తిత్వం(అచేతన వస్తువులు) ఇతరులకొర్కైన అస్తిత్వంగా అస్తిత్వాన్ని సిద్ధాంతీకరిస్తూ అస్తిత్వవాదాన్ని స్థాపించారు. ఈ నేపథ్యంగా అస్తిత్వవాద సాహిత్యంలో ఇతరులకొర్కైన అంశాలపై స్పందించడాన్ని గమనించవచ్చు అంతేకానీ ఆ స్పందనను ఆధారం చేసుకుని భౌతికవాద గతితర్క తాత్వికతే వారి దృక్పథమని నిర్ణయించలేము.

ఎడారి వాసన కవితా సంపుటిలో ప్రస్తుతం మనం నిత్యం ఎదురుకుంటున్న కొన్ని ఆభాసములపై కవిత్వాలు ఉండటమే కాకుండా ముఖ్యంగా గ్రామీణ–పట్టణాల మధ్య వైరుధ్యాలు, సామ్రాజ్యవాద పెట్టుబడి ఫలితంగా గ్రామీణ వృత్తుల విధ్వంసాలు–ప్రాంతీయ యుద్ధాలు, మాతృ భాషపై ప్రపంచీకరణ నేపథ్యంగా చూపుతున్న ప్రభావంతో బాటుగా రచయిత అంతర్జాల సంస్కృతి ఫలితంగా జరుగుతున్న మార్పులను తన కవితల ద్వారా వ్యక్తపరిచారు.

రచయిత కొన్ని గంభీరమైన విషయాలను అత్యంత సున్నితంగా చెప్పడం, వాడిన భాషా పదాలు సైతం సులభ గ్రాహ్యంగా ఉండటంచేత చదవడానికి వీలుగా ఉంటుంది.

రచయిత వ్యక్తిగతంగా అత్యంత మృదుస్వభావి మాత్రమే కాదు తీవ్ర ఆలోచనాపరుడు, భావోద్రేకుడు అందుకే మనం పట్టించుకోని వాటిని సైతం కవిత్వీకరిస్తూ మన ముందుకు ఎడారి వాసనై వచ్చారు.

"ఇక్కడ
నగరమంతా ఎడారి వాసనేస్తోంది
అక్కడ
అడివంతా మనిషి వాసనేస్తుంది...."

ఆధునికం ఆహ్లాదకరమవ్వాలని, మనుషుల విలువల పెంపుదలలకై తాపత్రయం ఈ కవితా సంపుటిలో అడుగడుగునా గోచరించడం రచయితల తాలూకు భాధ్యతను మేలుకొల్పుతుంది. ఈ ప్రవాహం అగకుండా సాగాలి.............

7

విద్య లేని వాడు వింత పశువు

ఇటీవల ఈ సామెత పై కొందరు మిత్రులు వద్ద చర్చచేయడం జరిగింది, ఈ సామెత యొక్క వాస్తవ అర్ధాన్ని తెలిసిన వారి సంఖ్య అందులో లేరని, అందులోనూ వీరు తాత్వికంగా దీని అర్ధాన్ని గ్రహించడంలో పొరపాటు ఉన్నదని అర్ధమైనది. నిజానికి ఈ సామెతలో ఎక్కువగా అపార్ధానికి గురైయ్యేది 'పశువు' అనే పదం, పశువు అనే పదానికి వాస్తవార్ధం జీవి లేదా జీవాత్మ. గత కాలపు అవగాహనలో జీవి అణు రూపమనే భావనతో సాగింది, ఇక ప్రస్తుతం జీవి అనగా సర్వసామాన్య సాధారణ వస్తుగత స్వభావం అని గ్రహించవచ్చు, ఐతే ఈ పై సామెత యొక్క అంతరార్ధం గ్రహించడంలో పశువు అనే పదమే మూలంగా నిలుస్తుంది. పశువుల(జీవి) సామాన్య స్వభావం అభివర్గాలుగా వ్యవహరిస్తాయి, అవి రెండు రకాలు అందులో జంగమ జీవులు–స్థావర జీవులు అని గ్రహించాలి. జంగమ జీవులలో అత్యున్నత రూపంగా మానవులని గ్రహిస్తారు, దీనికి మూలం మానవుడే కలిగియున్న శ్రమ సంబంధాలు మరియూ అలోచనాత్మక కార్యకలాపాలు. ఈ పశువులు(జీవి) భవబంధాలు కలిగియుంటాయి. గత కాలంలో భవబంధాలు కేవలం ఇంద్రియ శక్తుల వ్యవహారమని భావించారు. కానీ భౌతిక పరిస్థితులు ఆచరణలో మెదడు ద్వారా ప్రతిఫలనమవుతూ తిరిగి మెదడు ద్వారా భావాలు–ఉద్రేకాలుగా భావరూప ధోరణులలో భావరూప శక్తులుగా

వ్యక్తమవుతాయి, కావున భవబంధాలు భావరూప శక్తులుగా గ్రహించాలి. అంతేకాకుండా ఇప్పటి వరకూ జంగమ జీవులలోని జంతువులు కేవలం పరిసరాల జ్ఞానం మాత్రమే కలిగియుంటాయని భావించారు కానీ 'కొంత వరకూ జంతువులు కూడా తర్కించే ఒకానొక పరిస్థితిలో కొన్ని నిర్ధారణలు చేసే సామర్థ్యం కలిగి ఉంటాయి' అనే విషయాన్ని పరిగణించాలి. నిజానికి జంతువులు మానవ సామాజిక పరిణామంలో భాగమవుతూ(పెంపుడు పద్ధతి) అభివృద్ధి చెందాయి, అలాగే మనిషి వీటిని తన అభివృద్ధిలో కీలక భాగస్వామ్యం చేసుకున్నాడు. ఈ అభివృద్ధి మానవ సాంఘిక సంబంధాలల్లో స్పష్టంగా కనబడుతుండటమే కాకుండా ఈ జీవుల యొక్క మెదడు పరిణామం కూడా పరిశీలన చేయడంతో వాటి గుణాత్మక మార్పులైన గ్రహకశక్తి, భావోద్రేకాలు, అవసరాలు తీర్చే శక్తి మానవ సాంఘిక సహచర్యంలోనే గొప్ప ముందంజ వేసాయని అర్థమవుతుంది. మనిషి ప్రకృతి నుండి అవసరాలను తీర్చుకోవడమే కాకుండా ప్రకృతినే తన అవసరంగా అభివృద్ధి పరచడంతో(స్థల-కాల పరిస్థితులలో ఆవశ్యకంగా ఉంటుంది) మనిషి ఉత్పత్తిని అధనంగా ప్రోగు చేసుకోవడం వృద్ధి చెందింది. కావున ప్రకృతి మానవుని ఆచరణపై ఆధారపడేట్లుగా పరిణమించింది, దీనితో ప్రకృతి పరిశీలన-పరిశోధన, ఆధారం, విధ్వంసం, వినియోగం మానవీయమైనది. ఇక మానవుని భవబంధలు అవిద్య-అధ్యాసలుగా ఉంటాయి. భావవాదలు అవిద్య ఫలితంగా కర్మతో(ఆచరణ) భాందవ్యాన్ని కిలిగి ఉన్నదని భావించారు. నిజానికి కర్మ(ఆచరణ) ప్రతిఫలనంగా అవిద్య మరియూ అధ్యాసలు ఉద్భవిస్తాయి. అందుకే అవిద్యలు-అధ్యాసలు ఆయా కర్మ(ఆచరణ) పరిస్థితులల్లో ఉద్భవించేవే కానీ శాశ్వతాంశాలు కావు. ఇక ఆయా పరిస్థితులు నశిస్తే ఆ పరిస్థితులల్లోని అవిద్యలు-అధ్యాసలు సైతం నశిస్తాయి కూడా.

కావున ఇక విద్య విషయంలో కూడా మనం ఏ విద్య? ఏ కాలపు విద్య? అనే దృక్పథాన్ని గ్రహించాలి-గుర్తించాలి, విద్య ఆయా మానవ చారిత్రక దశ యొక్క ప్రతిఫలనంగా చూడాలి. ఇక భారత దేశంలో నైతే వేద విద్య ప్రామానికంగా ఉన్నప్పుడు అది అందరికీ అందుబాటులో లేని విద్యగా ఉన్నది, ఇక నేటికీ దాని అధిభౌతిక సరళితో బాటుగా ఆధునిక విద్య యొక్క యాంత్రికత శాస్త్రీయతకు పరిమితులు కూడా. కావున విద్య గతితార్కిక ఆలోచన పద్ధతితో పునర్నిర్మించాల్సిన అవసరం ఉన్నది. కాబట్టే 'విద్య లేని వాడు వింత పశువు' స్థల-కాల పరిస్థితులలో నూతనమైన, ఉన్నతమైన రూపంలోని పరిణామాలలో వర్తిస్తుంది.

8

నిర్బంధ మరణాలు

ఇటీవలి కాలంలో తాత్విక చింతనను తీవ్రంగా నిర్లక్ష్యం చేయడంలోని నిగూడార్థం కేవల అనుభవవాద పరిమితుల నుండే సత్యాన్ని గ్రహించగలుగుతామనే స్వీయాత్మక ధోరణులు మరియూ ఆజ్ఞేయ ధోరణులని గ్రహించాలి. అస్థిత్వ–వస్తు–సత్తా విషయాల అంత:స్సారాలని గ్రహించకుండా ప్రత్యక్షానుభవమే సత్యానికి అధారమని ఇక కేవల తార్కిక–భాషాప్రయోగ వ్యవహారంగా తాత్విక చింతన పరిమితం అవ్వాలనే యథాతథవాదం మహమ్మారిగా తయారైనది. ఇక అన్ని రకాల తాత్విక ధోరణులను అధిగమిస్తూ తానొక స్వతంత్ర ధోరణిగా నిలబడతుందని నిరూపించుకుంటుంది. అంతెందుకు ఈ ధోరణి ఏ తాత్విక రచనైనా అంత:స్సారాన్ని పరిశీలిస్తే కచ్చితమైన దాడిని ఎక్కుపెడుతుంది కూడా. ప్రమాణాలు లేని వాదనలను మోసుకొచ్చే ధోరణులతో సత్యానంతర వాదులుగా, అపభ్రంశ భౌతికవాదులుగా తమని ప్రతిష్టించుకుంటున్నారు. సరిగ్గా ఈ నేపథ్యం నుండే న్యాయ సిద్ధాంతం కేవల యథాతథవాదంగా భావవాద–భౌతికవాదలకు భిన్నమైనదిగా ప్రతిష్టించుకుంటుంది, కార్యాకారణాల గతితర్కాన్ని వ్యతిరేకించే ధోరణిగా నిలబడుతుంది. అందుకే న్యాయ సిద్ధాంతం వాస్తవ భౌతిక శక్తుల అగోచర స్థితి ప్రేరణ భావజాలంగా తప్పుడు చైతన్యంతో ప్రాతిభాసిక సత్తాగా ప్రతిఫలించడమని అర్ధం చేసుకోవాలి. ఈ నేపథ్యంలో నుండి మనం న్యాయాన్ని వర్తించే

విషయంలో (కోర్టులు విధించే శిక్షా పద్ధతులు సైతం) వ్యవస్థాగతంగా పోలీసు నిర్బంధంలో భయపెట్టి ఆటంకపరుచు సిద్ధాంతాన్ని అనగా నేర తీవ్రతను–పరిమాణాన్ని పరిగణించి శిక్షించడంతో నేరాలు చేయకుండా చట్టం పట్ల భయంతో మసులుకుంటారని అమలు చేయడం జరుగుతుంది. దీనితో పాటుగా ప్రతిఫల శిక్షా సిద్ధాంతం అనగా కన్నుకు కన్ను–పన్నుకు పన్ను అనే పద్ధతి కూడా చలామణిలో ఉన్నది, కావునే ఇటీవల కొన్ని నివేదికలలో పోలీసు నిర్భందంలో ఉన్న 125 కేసులలో పోలీసు హింసలల్లో 93 మంది(74.4%) మరణిస్తున్నారు, 24 మంది(19.2%) అనుమానస్పద కారణాలతో మరణించినవారు కాగా, పోలీసు నిర్భందంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నవారు 16గా ఉంటుంది. ఇక కారణాలు తెలియరాని స్థితిలో మరణించేవారి సంఖ్య 4%గా ఉన్నది. అనారోగ్యాలు మరియు గాయాలకు 1%గా ఉన్నవి. నిజానికి ఆయా సమాజపు వ్యవస్థీకృత సామాన్య ప్రతిబింబంగా నేరాన్ని గ్రహించాలి, అంతేకానీ నేరం దాని వంతుకు అదే వ్యవహరించేదిగా, పరిమితమైనది కాదు. ఎలాగైతే రాజ్యంగం ద్వారా మన సమాజపు ప్రజాస్వామ్యం–స్వేచ్ఛా–సమానత్వం–భాధ్యతలను గుర్తించగలమో అలాగే భారత శిక్షాస్మృతి ద్వారా మన సమాజపు సాధారణ నేరమయ రూపాన్ని గ్రహించవచ్చు (రాజ్యాంగం–నేరాలు రెండూ భావజాలాలే), కావున ఆ సమాజంలోని రెండు పార్శ్వాలను ఒకేసారి గ్రహించగలము. ఇంక నేరాలపై మనం అమలు చేసే శిక్షా పద్ధతి కూడా సమాజపు సాధారణ స్వభావపు నేర రూపంగానే ఉన్నది (కోర్టుల ద్వారానైనా–పోలిసుల ద్వారానైనా). అయితే నేరమనేది వర్గ సమాజపు ప్రతిఫలనం అది ఆయా సమాజపు స్థల–కాల పరిస్థితులలో ఉద్భవించేదిగా ఉంటుంది. అందుకే శిక్షలు సైతం వర్గ సమాజ అభివృద్ధిని బట్టి వైషమ్య రూపాలలో వ్యవహరిస్తుంది–ఆయా పరిస్థితులల్లో విభిన్నంగా వ్యక్తమవుతుంది కూడా. యథాతధవాద దృక్పథం నుండే నేర సిద్ధాంతాల ఆధారాంగా ఉరిశిక్షను కూడా ఆదిమ సమాజపు ఆఖరి అవశేషంగా ప్రచారం చేసారు, కానీ అది వర్గ సమాజపు అత్యున్నత శిక్షా రూపంగా వ్యవహరిస్తుందనే సిద్ధాంతాన్ని విస్మరించారు. కావున ఈ రోజుకూ న్యాయ శాస్త్రాన్ని గతితార్కిక ఆలోచనా పరివర్తనాశీల దృక్పథం నుండి అభివృద్ధి పరుచుకోవాల్సిన కర్తవ్యం మన ముందుంది. ఇకపోతే మన దేశంలో జరుగుతున్న వ్యవస్థాగత నేరాలకు మూల కారణమైన సమాజాన్ని మార్చుకోవడమనే సంకల్పంతో ఐక్యమవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

9

కులోన్మాదం - యుద్ధోన్మాదం

కుల వాదాలు, కుల ఉద్యమాలు ప్రభలంగా సాగుతున్న నేటి తరుణంలోనుంచి కులోన్మాదంగా పరిణమించడం ఒక బాహ్య రాజకీయంగా, మరీ ముఖ్యంగా దీనికి పట్టణ మధ్యతరగతి (పెట్టుబడి, విభిన్న కులాలు) మరియూ గ్రామీణ నూతన భూస్వామ్య అగ్ర కులాలతో పాటూగా వివిధ నూతన ధనిక, మధ్యతరగతి దిగువ కులాలు పునాదిగా ఉండటాన్ని పురస్కరించుకుని, ఆయా బహుసంఖ్యాకులవాదాలుగా చలామణీ అవ్వడమే నేటి నియో ఫాసిజానికి మూలంగా ఉన్నది. ఈ కులోన్మాదం ఆధిక్యవాదంగా రాజకీయ సమీకరణ సంక్షేమ ఫలప్రధమైన కార్యకలాపపు నిర్ధిష్ట భాగస్వామ్యమవుతుంది, కావునే ప్రస్తుత స్థితి మనుగడ ప్రాధాన్యవాదంగా కులోన్మాదం వ్యవహరిస్తుంది. ఇటువంటి స్థితిలో తీవ్ర కులోన్మాద ప్రేరణ సంఘటనలు–సన్నివేశాలు–కార్యక్రమాలు సువిశాల రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చే వేదికలవుతాయి. ఇకపోతే దేశంలో ఆంతరిక కులోన్మాద స్థితిగతుల కొనసాగింపుతో బాటుగా తీవ్ర జాతీయవాద యుద్ధోన్మాదాన్ని (జింగోయిజం) ప్రచన్న రాజకీయ ఎత్తుగడగా ఉపయోగించడం నియో ఫాసిజపు బాహ్య వ్యూహంలో బాగం. దీనితో నిర్హేతుక స్వదేశాధిపత్య అభిమానం చెలరేగుతుంది. ఈ విధానాలు సరిగ్గా కేంద్రీకృత రాజకీయం లేదా నాయకత్వం ద్వారా

స్థిరమైన ఆర్థిక స్వప్రయోజనార్థం (గుత్త పెట్టుబడి) జరిగే ప్రక్రియ. ఈ యుద్ధోన్మాదంతో సుధీర్ఘకాలిక నిరుద్యోగ సమస్యకు పరిష్కారంగా వారిని సైన్యంలోకి నియామకం గావించి తీవ్ర సైనిక శక్తిగా అభివృద్ధిపరుస్తూ సామ్రాజ్యవాద ఆకాంక్షల సహకారమే లక్ష్యంగా సాగుతుంది. నిజానికి మనం ఒక సంక్లిష్ట సందర్భంలో ఉన్నాము ఏకవాద వ్యక్తుల సంఘాలు–నాయకత్వాలతో స్థూల–సూక్ష్మ రూపాల నిరంకుశత్వాలు(ఫాసిజం) మన సమాజంలో రాజ్యమేలుతున్నాయి, దీనితో సువిశాల ప్రజల మధ్య, వర్గాల మధ్య సమిష్టిపర ఐక్యత దెబ్బతింటున్నది. ఛాందస పార్శ్వ రూపంగల శక్తులతోనే స్థిరవాద సాంప్రదాయాల మనుగడకు భూమిక అవుతుందని, ఏకపక్ష వ్యవస్థీకృత నిర్మాణాత్మకతతో ఏర్పడే ఏకపాలనాధిపత్యంతో ప్రజాస్వామ్య ప్రక్రియ స్థానేనా నిరంకుశాధిపత్య ప్రక్రియగా ప్రారంభమవుతుంది. ఇది పెట్టుబడి ప్రయోజనాలను నెరవేర్చే నిరంకుశ రాజకీయ రూపంగా పరిగణించాలి. సరళీకరణ–ప్రపంచీకరణ–ప్రైవేటీకరణలను దూకుడుగా అమలు చేసే సంకల్ప సిద్ధి కలిగిన ఏకాధిపత్య విధానంగా ముందుకొస్తుంది. కచ్చితంగా ఇటువంటి సంకట స్థితిలో కార్మిక వర్గాల హక్కుల కాలరాత, వివిధ రూపాలల్లో దోపిడీ–దౌర్జన్యాలు పెరగడంతో పాటుగా రాజకీయార్థిక–సాంస్కృతిక దోపిడీలో భాగంగా షెడ్యూల్డ్ కులాలు మరియూ షెడ్యూల్డ్ తెగల వారిపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ రోజుకూ దీర్ఘకాలిక రాజకీయార్థిక వ్యవస్థీకృత దోపిడీ దాని అనురూపమైన వివక్షలు మరింత చిక్కగా మారుతున్న నేపథ్యం, అంతేకాకుండా కలహాశీల దేశభక్తి రూపంలో ప్రజాస్వామ్య గొంతుకను అణచివేసే కార్యక్రమం దూకుడుగా అమలవుతున్నది. మరొకపక్క దౌర్జన్యపూరిత రాజకీయ వాతావరణంలో పౌర హక్కుల చట్టాలు నీరుకారిపోతున్నాయి, వివిధ వ్యవస్థల స్వతంత్ర వ్యవహారాలని కోల్పోతున్నాయి. పాలనావిధానవే అత్యవసర పరిస్థితి రూపంలో సాగుతుంది(ప్రత్యేకంగా అత్యవసర పరిస్థితిని అమలు చేయనక్కర లేదు). ఇక సాంఘిక మార్పుకు దోపిడీ కొనసాగింపుల రూపాలు ప్రతిబంధకాలు కాగా, మరొకవంక మార్పుకు గురికావాల్సిన అంశాల స్పష్టత కొరవడినది కూడా. ఏమైనా నేటి సంక్లిష్ట పరిస్థితుల నుండి ఆశాజనకమైన ప్రజాస్వామ్య ప్రక్రియలోకి పయణించే వాతావరణం సుదీర్ఘకాలిక రాజకీయార్థిక–తాత్త్విక పోరాటాల కార్యక్రమం ద్వారా సాధ్యపడుతుంది. అందుకు అభ్యుదయ–ప్రజాస్వామ్య శక్తుల ఐక్య సంఘటనతో సాగాల్సిన అవసరం నేటి తరుణం.

10

సంక్షేమ సంక్షోభం

పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ఆధునిక పరిభాషలో తన వ్యవస్థ తాలూకు పరిపాలన అనేది ప్రజాస్వామ్య (డెమోక్రసీ) రూపంగా ఉంటూ సంక్షేమ విధానంతో నిర్ధిష్ట సామాజిక ప్రయోజనార్ధ ఫలితవాదంగా ఆయా సమాజ వ్యక్తుల భౌతిక- భౌద్ధికమైన ఆర్ధిక, సమాన అవకాశాల హక్కుల కల్పన ప్రభావములు కలదిగా ఉంటుందని, అంతేకాకుండా ఈ నిర్ధిష్టతను ప్రభుత్వపరమైన సంరక్షణ- కొనసాగింపులతో కూడిన విలక్షణమైన సంక్షేమ రాజ్యంగా వ్యవహరిస్తుందని సామాజిక శాస్త్రవేత్తల భావన. అందుకే ప్రజాస్వామ్యం-సంక్షేమం-పెట్టుబడిదారి వ్యవస్థల ఐక్యతే సంక్షేమ రాజ్యమని భావిస్తున్నారు. నిజానికి ప్రజలకు విద్య, ఆరోగ్యం, సామాజిక సమానత్వం, రాజకీయ వాటా పద్ధతి కల్పన అనే సంక్షేమ అభివృద్ధి నమూనాతో ప్రపంచీకరణ, ప్రవేటీకరణ, సరళీకరణలలో ఉత్సాహపూరిత భాగస్వామ్యమవుతారని భావించేవారుండగా, మరికొంతమంది కేవల సంక్షేమ కార్యకలాపం అనేది నేటి స్థితికి ముందున్న వ్యవస్థల తాలూకు నమూనాలతో అధిగమించినదని, మరీ ముఖ్యంగా కమ్యూనిస్టు రాజ్య సంక్షేమ విధానంతో ప్రజల జీవన-ఆయుఃప్రమానాలు పెంచడం జరిగిందని భావించారు(ఇది సంక్షేమ రాజ్యమనే భావాన్ని యథాతథంగా అన్ని వ్యవస్థలకు అన్వయించే మూసపద్ధతి నుండి పుట్టుంది). నిజానికి ప్రకృతి-

సమాజం నిరంతరం చలనశీలమైన మధ్యంతర దశలు కలిగిన గతితార్కిక విధానమైనవి, అవి ఎప్పటికీ శాశ్వత దశలు కలిగినవి–చేరేవి కావు, ఈ చలనం యాంత్రికమైన పద్ధతి కానటువంటిదై ఆరోహనా దశలు సైతం కలిగినవి. ప్రకృతి–సమాజాలు నిరంతరం పరివర్తనశీలమైనవి. మానవ సమాజ చలనశీలత శ్రమపై ఆధారపడినది. దీనికి అనివార్యంగా ఉత్పత్తి శక్తుల నిర్ధిష్ట దశకు అనుగుణమైన ఉత్పత్తి సంబంధాలు ఉద్భవిస్తాయి. ఇవి రెండూ పరస్పరాధారితమైనవి, ఉత్పత్తి సంబంధాల పునాది నుండి ఉపరితలం ఏర్పడుతుంది ఇవి పరస్పర ప్రభావాత్మకమైనవి. కావున ఉత్పత్తి సంబంధాల ప్రతిఫల ఉపరితల అంశాలైన రాజ్యం, కళలు, విద్య, సంస్కృతి, వీటి ఆయా భావజాలాంశాలు అనివార్యంగా ఉత్పత్తి సంబంధాలపై పునఃప్రతిబింబమవుతాయి. ఈ శాస్త్రీయ అంచనా నుండి సంక్షేమ వ్యవహారాన్ని లేదా సంక్షేమ రాజ్యాన్ని పరిశీలించడం ప్రారంభిస్తే దాని యొక్క మాయను(ఉంది–లేదు) గ్రహిస్తాము. నిజానికి సంక్షేమం–లేదా సంక్షేమ రాజ్యం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన వ్యవహారం. పెట్టుబడిదారీ వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న ఉత్పత్తి శక్తులకు అనుగుణంగా ప్రజల విద్యా, వైద్య, సమానాంశాల, భావజాలాత్మక విషయాలలో సామాజిక పునరుత్పత్తి కార్యక్రమంగా ఉద్భవించడాన్నే సంక్షేమమని, దానిని ఉపయోగించే నిర్ధిష్ట దశనే సంక్షేమ రాజ్యమని వ్యవహరిస్తుంది. ప్రారంభంలో ఈ విధాన పద్ధతి ప్రపంచ యుద్ధాల అనంతరం, అటు తరువాత తీవ్ర సంక్షోభాల అనంతరం ధ్వంసమైన ఉత్పత్తి శక్తుల పునరుద్ధరణలో భాగంగా సామాజిక పునరుద్ధరణ స్థాయిని పెంచే పెట్టుబడిదారీ వ్యవస్థ తాలూకు కార్యక్రమ రూపంగా సంక్షేమం లేదా సంక్షేమ రాజ్యమనే విధానంగా ముందుకు వచ్చింది. భారతదేశంలోనైతే విభిన్న కులవాద అస్తిత్వాల సేవా తాత్పర్య తద్గుణంగా ఉంటూ ప్రస్తుత వ్యవస్థ తాలూకు స్థితిని కొనసాగించేదిగా ఉంటుంది కూడా, కానీ ఈ రోజు పెట్టుబడిదారీ వ్యవస్థ క్రమానుగత సంక్షోభ సమయానంతర పునరుద్ధారణ విధానం(సంక్షేమం) కాకుండా ఈ వ్యవహారం సరళీకరణ, ప్రవేటీకరణ, ప్రపంచీకరణ రూపంలో సాగతుండటాన్ని గ్రహించాల్సిన అవసరం ఉన్నది ఫలితంగా శాశ్వత సంక్షోభ దిశగా పయనించింది. కావున క్రమానుగత సంక్షోభాలు మరియూ శాశ్వత సంక్షోభాల నుండి, శ్రమశక్తి దోపిడీ నుండి మరియూ పరాయీకరణ నుండి పెట్టుబడిదారీ వ్యవస్థ తప్పించుకోలేని వాస్తవం కాబట్టే అది ఏర్పర్చే సంక్షేమం–సంక్షేమ రాజ్యపు విధానం కేవలం ఒక పాలక వర్గ భ్రమాత్మక కల్పనగా గ్రహించాలి.

11

ఆచార్య నాగార్జున

బౌద్ధ అభిమానులు లేదా బౌద్ధ మతస్తుల వద్ద ఆచార్య నాగార్జునుడు గురించి మాట్లాడే సందర్భంలో ఖచ్చితమైన వ్యతిరేకతను ఎదురుకుంటామనడంలో సందేహమేమీలేదు. ఆచార్య నాగార్జున బౌద్ధ మతాన్ని లేదా బౌద్ధ తత్త్వాన్ని క్షీణింప చేసిన వ్యక్తని, అటు తరువాత హైందవ తత్త్వాలకు మూలకారణమైన వ్యక్తని నిందించడం పరిపాటి. వాస్తవానికి నాగార్జునుడి రచనలను పరిశీలిస్తే వీరి అపోహలకు భిన్నమైన విషయాన్ని గ్రహించవచ్చు. ఆచార్య నాగార్జునుడి గతితార్కిక రచనలు ప్రపంచంలోనే బహుప్రసిద్ధమైనవి, గతితార్కికంపై బహు గ్రంథాలు రచించిన ఏకైక వ్యక్తిగా చెప్పుకుంటారు కూడా. ఆచార్య నాగార్జునుడు దక్షిణ భారతదేశపు విదర్భకు చెందిన వ్యక్తిగా ప్రసిద్ధుడు, అంతేకాకుండా ఆయన మహాయాన బౌద్ధశాఖ మాధ్యమికవాదాన్ని అభివృద్ధి చేసిన వాడుగా మరీ ముఖ్యంగా అప్పటివరకూ బౌద్ధ సాహిత్యపు సంభాషణా పద్ధతిలోని విషయాలను మరియూ జాతక కథల రూప సాహిత్యాన్ని విమర్శనాత్మక దృక్పథం నుండి తాత్విక మార్గానికి పయనింప చేసిన వాడిగా ఆచార్య నాగార్జునుడిని కీర్తించాల్సిన భాద్యత మనపై ఉన్నది. బౌద్ధ తాత్వికతను అభివృద్ధి గావిస్తూ అద్వైత సాంప్రదాయాన్ని ప్రపంచ తాత్విక వేదికపైకి తీసుకుని వచ్చాడు. ఆయన తాత్విక జటిలత్వం ఆయనను దూరం గావించడానికి కారణమైనదని చెప్పుకున్నా ఆయన తాత్విక

వారసత్వాన్ని భారతీయ తాత్వికులైన శంకరాచార్య–రామానుజాచార్య–మధ్వాచార్యులు కొనసాగించారు, అభివృద్ధిపరిచారు. కావున బాహ్యంగా బౌద్ధం భారతదేశం నుండి తరలివెళ్లినా ఆంతరంగికంగా తాత్త్విక సాంప్రదాయపరంగా, ఆత్మికంగా ఇప్పటికీ కొనసాగుతున్న వాస్తవం. ఇటువంటి తాత్త్విక సంపదకు కారణమైన ఆచార్య నాగార్జునుడిని తలుచుకోవడం మన విధి, అంతేకాకుండా తాత్త్విక సారాన్ని కొనసాగించిన (భావవాద రూపంలో) అభివృద్ధి పరిచిన మన భారతీయ తాత్త్వికుల గొప్పతనాన్ని కీర్తించక తప్పదు కూడా. నాగార్జునుని వాదాన్ని శూన్యవాదమని–అద్వైతమని వ్యవహరిస్తారు. శూన్యవాదం ప్రతీ వస్తువూ శూన్యమని ఎందుకంటే దానికదిగా స్వత:సిద్ధమైనదికాదని, స్వభావమైనది కాదు నిస్వభావములు అని అంటుంది. ఏ వస్తువైనా హేతు ప్రత్యయాలపై ఆధారపడి ఉత్పన్నం అవుతుంది, ఈ హేతు ప్రత్యయాలు ఒక వస్తువు పుట్టడానికి క్రితం క్షణం వరకూ ఉండి శాశ్వతంగా శూన్యమవుతాయి. కావున ఏదైతే హేతు ప్రత్యయాల నుండి ఉత్పన్నం అవుతుందో అది అదిగా స్వత:సిద్ధమైనది కాదు, స్వభావమైనది కాదు కావున శూన్యము. ఇక ఈ హేతు ప్రత్యయాలు ఒక వస్తువు పుట్టడానికి క్రితం క్షణం వరకూ ఉండి శాశ్వతంగా శూన్యమవుతాయి, కావున అంతిమ దృష్టిలో ప్రతిదీ శూన్యమని భావన. ఈ అద్వైత శూన్యవాదాన్నే శంకరులు మాయగా భావవాద రూపంలో గ్రహించి సాంఖ్యవాదంతో జతపరిచి సంశ్లేషణ గావించారు. ఈ తాత్విక అభివృద్ధి వివిధ నూతన–ఉన్నత రూపాలుగా విశిష్టాద్వైతంగా–ద్వైతంగా–ద్వైతాద్వైతంగా–శుద్ధాత్వైతంగా సాగాయి. అంతేకాకుండా పాశ్చాత్యులు అందులో ముఖ్యులైన హెగెల్ పై భారతీయ విశిష్టాద్వైత ప్రభావం ఉన్నదని చెప్పుకోవచ్చు. హెగెల్ తన గ్రంథాలలో శూన్యవాద ఖండనను విశిష్టాద్వైత తాత్వికరూపంలో సాగించాడని మన పరిశీలనలో తేలుతుంది కూడా. భారతీయులు ఇటువంటి మహా ప్రభావాన్ని ప్రపంచవ్యాప్తంగా కలిగించడం ఎంతో గర్వకారణం. ఇక ఆధునిక శాస్త్రీయతకు పారమార్థిక సత్తను పునాదిగా–వ్యవహార సత్తను ఉపరితలంగా, ప్రాతిభాసిక సత్తను భావజాలంగా పరిశీలన చేసే దృక్పథాన్ని జతపరచవచ్చు. ఇకపోతే గతితర్కం ప్రాగ్దిశ గతితర్కం (విచ్చిన ప్రవాహం) మరియూ పాశ్చాత్య గతితర్కాలుగా (అవిచ్చిన ప్రవాహాలు) ఉంటాయి. శూన్యవాదం విచ్చిన్న ప్రవాహం కాగా అద్వైతం–విశిష్టాద్వైత–ద్వైతాలు విచ్చిన్న–అవిచ్చిన్నల సంశ్లేషనలుగా ఉన్నాయి. ఏమైనా భారతీయ తాత్త్విక సాంప్రదాయ వారసత్వంలో ఏర్పడిన కాలీలను తాత్త్విక అధ్యయణంతో పూరించాల్సిన అవసరం ఉన్నది.

12

సత్య మార్గం

భారతీయ తాత్త్వికతలో ధర్మానికి ప్రాధాన్యతనిస్తూ సాగడం ఆనవాయితి. నిజానికి ధర్మాన్ని మనం రక్షిస్తే ధర్మం మనల్ని రక్షిస్తుందని భావన. కానీ ధర్మం అనే అంశాన్ని అర్ధం చేసుకోవడంలో విఫలమవ్వడం జరుగుతుంది. ఇందుకు ధర్మాన్ని ఆధునికంలోకి పరిణమించడంలోను– నిర్వచించడంలోను ఉండే సమస్యగా ఇది ఉద్భవిస్తుంది. వాస్తవానికి మన తాత్త్వికత ఒకరకంగా వస్తుగత భావవాదపు అధిభౌతికవాద పద్ధతిలో దీర్ఘకాలికంగా కొనసాగుతుండటంతో ధర్మాన్ని నిర్వచించడంలో భ్రమణరహిత అర్ధ రూపపు విశేషంగా ఉన్నది. ఒకవేళ భ్రమణపూరిత నిర్వచణార్ధంలో సాగినా స్థలవాద సాంప్రదాయంగా ఉంటున్నదే కానీ కాల నిర్ణయంలోని చలనంగా రూపు దాల్చలేదనే చెప్పుకోవాలి. అందుకే ఆధునిక ప్రామాణికాలలో మన తాత్త్వికత కల్పిత లేక అనుసరణ దుస్థితిగా వాదింపబడుతుంది. మన తాత్త్వికతలో ధర్మార్ధకామాలు కీలకమైన విషయాలుగా ఉన్నాయని గ్రహించాలి, వీటిని పురుషార్ధాలుగా సంభోదిస్తారు. ఈ రోజుకూ ఈ పురుషార్ధాల వాస్తవ చలింపు సామాజిక అంశపు ప్రక్రియ. నిర్ధిష్ట స్థల–కాలాలలోని సామాజిక మార్పుల –అవసరాల స్థితి నుండే నిరంతర అభివృద్ధి– నూతనాంశపు జననార్ధ ఉన్నతకు మారుతుంది. ధర్మం సామాన్యం– విశేషం, అర్ధం అనగా అన్ని రకాల సంపద(కానీ ఆధునికంలో

అర్థం ధనంగా సంభోదిస్తున్నారు), ఇక కామం అనగా కోర్కెలు. పోనుపోనూ మానవ భౌద్ధికాభివృద్ధిలో పురుషార్థములకు మూలంగా–ఉన్నతమైనదిగా సత్యం అనే భావన ముందుకు వచ్చింది. కావున ధర్మం కంటే సత్యం కీలకమైనదని, ధర్మాన్ని సైతం నడిపించేది సత్యమని తాత్త్వికాభివృద్ధిలో స్థానమైనది. ఎప్పుడైతే సత్యం ప్రాధాన్యమైనదో అది ధర్మాన్ని సామాన్య–విశేషాంశాల చలనంలో ఆయా తాత్త్విక సాంప్రదాయాల అనుసరణలోని నిర్వచనంగా మలుస్తుంది. ఫలితంగా ఆయా తాత్త్విక నిర్ధిష్టతల ధర్మంగా–అర్థాల–కోర్కెల నిర్వచనాలుగా చలామణీ అవుతుంది. కావున నేటి ఆధునికతలో గత కాలపు శాస్త్రీయ–ఆయా పరిస్థితుల చలనాంశాల అవరోహనాలను విమర్శనాత్మకతతో గతితార్కీకరించాలి. అందుకు సత్యం శాశ్వతం–అఖండమనే స్థితి నుండి మధ్యంతరం–సాపేక్షకం అనే స్థితికి పయనించాలి. ఇందుకు కావాల్సినది సత్యం క్రింది స్థాయి నుండి పై స్థాయికి సాగే గమనంలో జరిగే పరివర్తన నియమాలను–వైరుధ్య వైషమ్యాలను గ్రహించడంలో పాతది నశించుట కొత్తది ఉద్భవించుటగా ఉన్నతమైన–నూతనమైన దశల ఆరోహనా–అవరోహనలను ప్రతిఫలించడం. కావున సత్యం నిరంతర స్థల–కాల చలనం, అందుకే మానవ సామాజిక ధార్మికాంశాలు చలనశీలమైనవి–మానవీయమైనవి, ఇకపోతే సత్యం మానవీయ సత్త. ఇక మనం ప్రస్తుత భారతదేశాన్ని అర్థం చేసుకుంటే మనం అత్యంత పాశ్చాత్య అనుకరణలో తలమునకలై గిడసబారిపోయామనే చెప్పుకోవాలి. అంతేకాకుండా మరొక ప్రక్క అత్యంత సనాతన సాంప్రదాయపు భావజాలాత్మకతలో కూరుకుపోయి ఆధునికతపై ద్వేషాన్ని వెల్లగక్కుతూ కాలాన్ని వృధా చేస్తున్నాము. ఇంకొక ప్రక్క అపభ్రంశపు వెర్రితలల భౌతికవాదాలతో కాలక్షేపం గావిస్తున్నాము. ఇటువంటి సంక్లిష్టతల నడుమ భారతదేశపు తాత్త్వికతను ఏకరువు పెట్టే వారు కరువైయ్యారని వర్తమానాన్ని చూసినా గ్రహించవచ్చు. ఇప్పటికే ఈ కాలం సత్యానంతర కాలమని సత్యాన్వేషణకు తిలోధకాలిచ్చి తత్త్వశాస్త్రాన్ని పాడుబడిన గదులకు పరిమితం చేసేసారు కూడా, ప్రపంచవ్యాప్తంగా యధాతథవాదం–ఆధునికానంతరవాదాలు రాజ్యమేలుతున్న సందర్భంలో ఉన్నాము. ఇప్పటికైనా సత్యాన్ని ప్రథమం గావించే వ్యవహారాన్ని భుజానికి ఎత్తుకోవాల్సిన అవసరం ఉన్నది. అందుకు వీటి యొక్క మూలాలను గతితార్కిక ఆలోచనతో విమర్శనాత్మక సుద్ధి గావించాల్సిన గురుతర కర్తవ్యం ఇంకా భారతీయులపై ఉండనే ఉంది.

13

రాజకీయ యుద్ధతంత్రం

యుద్ధం చేయడం గెలవడం కోసం. ఇందులో ఓటమి ఉండదు. అంగీకారం, ఆమోదం ఉండదు అంతే స్థాయిలో నిరాకరణా ఉండదు కేవలం అనుకరణ మాత్రమే నిన్ను గెలిపిస్తుంది. ఈ అనుకరణలో అంగీకారం, ఆమోదం తనకు తాను నిరాకరణ దాగి ఉండటమే ముఖ్యం. శత్రువుని ధైర్యవంతుడిగా అనుకోని, తెలివైనవాడిగా గుర్తించినట్లు ప్రదర్శించు. తనలోని బలహీనతను బయటకు రానివ్వు వెంటనే తనకు ఆధిక్యం వహించేట్లు చెయ్యి తక్షణం గందరగోళం ప్రదర్శించేట్లు చెయ్యి. ఈ మొత్తం వ్యవహారంలో వీటన్నింటినీ నీవూ ప్రదర్శించడంతో శత్రువు నిన్ను అర్థం చేసుకునేట్లు చేయడంగా ఎరవేయి. కానీ నీ ప్రదర్శన నీ బలహీనత కాదని బలమని తెలియనియ్యకు. నీపై ఆలోచన చేయడం ప్రారంభింపచేసిన తరువాత, నిన్ను వదిలించుకునేటట్లు చేస్తున్నారా అని గమనించు, నిన్ను వదిలించుకోవడమే నీపైన సరైన ఆలోచన ఏర్పడటానికి మూలం. కానీ నీ బలహీనతల బలం నీ గురించి సరైన అభిప్రాయం కలగనివ్వదు కాబట్టి నీ గురించి రోజురోజుకూ తీవ్రమైన గురిపెట్టక తప్పదు. శత్రువు నీపై గెలవడానికి నీకు అందుబాటులో లేని సంఖ్యను, మాటను, మనిషిని ఆశ్రయిస్తాడు కానీ వాడికన్నా ముందుగా సంఖ్యను ప్రోగుచేయి, మాటను వ్యాపింపచేయి మనిషిని సమీకరించు. శత్రువు

పై గెలవటంలో ఇది నిర్ణయాత్మక స్థితిగా ఉంటుంది. భయంతో చేసే దాడి కన్నా, ఆవేశంతో చేసే దాడి కన్నా, పిరికితనంతో చేసే దాడి కన్నా, కోపంతో చేసే దాడికన్నా తెలివిగా చేసే దాడితోనే తీవ్ర నష్టం, తీవ్రత అధికంగా ఉంటుంది. దాడిలో జరిగిన నష్టంతో ఎటువంటి స్థితిలో దాడి జరిగిందో అంచనా కట్టవచ్చు. ఇందుకు సామదానభేద దండోపాయాలని విరివిగా ఉపయోగించడం కీలకం. సుఖానికి మూలం ధర్మం, ధర్మానికి మూలం ధనం, ధనానికి మూలం రాజ్యమనే భావన నుండే ఈ వ్యూహ–ఎత్తుగడల యుద్ధతంత్రం ముందుకు వస్తుంది. ఈ రోజు కచ్చితంగా ఇటువంటి వ్యూహం–ఎత్తుగడలతో పాలకవర్గాలు రెండు పార్శ్వాల యుద్ధతంత్రాన్ని అమలు చేస్తున్నారు ఒకటి తమ ప్రజలపై మరోకటి శత్రుదేశాలపైనదిగా చెప్పుకుంటున్నారు(ఆర్థిక లావాదేవీల–వ్యాపార ఎత్తుగడల రిత్యా అని గ్రహించాలి), అంతేకాకుండా ప్రత్యర్థులు లేదా ప్రతిపక్షాలపై ఉపయోగిస్తున్నారు. వ్యాపార–ధనవ్యామోహ పునాదిగా శత్రువు, మిత్రుడు, శత్రుమిత్రుడు, మిత్రశత్రువు, శత్రుమిత్రమిత్రుడుగా పరిగణిస్తూ రాజకీయం చేస్తున్నారు, ఐతే ఇవి ఎల్లకాలలూ ఒకేవిధంగా స్థిరమైనవి కావు ఆయా పరిస్థితులల్లో పరిణమిస్తూ ఉంటాయి. నిజానికి ఈ కాలంలో యుద్ధతంత్రం భౌతిక రూపం కన్నా మానసిక రూపంలో సాగుతున్నదని గ్రహించాలి. వాస్తవానికి నేడు ప్రజలను మభ్యపెడుతూ సూదీర్ఘకాలిక రాజకీయ రూపంలో వ్యాపార లాభాలని నెరవేర్చుకోవడమనే లక్ష్యంగా రాజకీయ యుద్ధతంత్రం ప్రధానంగా సాగుతుందని గమనించాలి, ఐతే వీటికి పునాదిగా ఉగ్ర మతవాదం మరియూ ఉగ్ర జాతీయవాదం, ఉగ్ర యుద్ధవాదాలు, ఉగ్ర కులవాదాల నేపథ్యంగా మనగలడాన్ని చూడవచ్చు. అందుకే యుద్ధమే జరగకుండా యుద్ధాన్ని గెలవడమనే రాజకీయ యుద్ధతంత్రం మనందరిని గెలుస్తుంది. పాలకవర్గాల రాజకీయ లక్ష్యాలకు ప్రజలు మోసపోవడం మనం కొన్ని వందల వేల సంవత్సరాల నుండి చూస్తున్నదే. ప్రజల కంటూ రాజకీయ లక్ష్యం లేకుండా చేయడం–రాజకీయ శక్తిగా ఎదగనీయకుండా ఉండటంకై పురోగామి శక్తులపై దాడులు, ఆంక్షలు రోజు రోజుకూ పెరగడాన్ని గమనించవచ్చు. ఏమైనా పాత వాస్తవికత స్థానే నూతనమైన–ఉన్నతమైన వాస్తవికత యొక్క ఆవిర్భావాన్ని అడ్డుకునే గత వ్యవస్థల వ్యూహ–ఎత్తుగడలుగా నేటి రాజకీయ యుద్ధతంత్రాన్ని అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. దీనిని అడ్డుకోవల్సిన బాధ్యత మనందరి పై ఉన్నది.

14

మీమాంస

ప్రమ అనేది మానవుని ప్రమేయముల ఆచరణాత్మక కార్యకలాపంలో ప్రమాణాల ద్వారా నిర్ధిష్ట చారిత్రక క్రమంలో ప్రతిఫలించే యథార్ధ జ్ఞానంగా గ్రహించాలి. ప్రమ అనగా సత్యజ్ఞానం కాగా ప్రమాణం అనజ్ఞాణ కారణం అవి ప్రత్యక్ష–అనుమాన–ఉపమాన–శబ్ధ–అర్థాపత్తి–అనుపలబ్ధిలుగా ఉంటాయి, ఇక ప్రమేయమనగా ప్రాణం, శరీరం, ఇంద్రియం, అర్ధం, బుద్ధి, ప్రవృత్తి, దోషం, మనస్సు, ప్రేత్యాభావం, దుఃఖం, అపవర్గాలుగా చెప్పుకోవచ్చు. జ్ఞేయం అనగా తెలుసుకోబడే జ్ఞాణం ఇది జ్ఞాత ద్వారా అంటే తెలుసుకోబడే వారితో, ఇక జ్ఞాణం తెలుసుకున్నది అనే ప్రక్రియతో వాస్తవాన్ని గ్రహించడానికి మూలంగా ఉన్నదని గమనించాలి. ఇకపోతే పాశ్చాత్య తార్కిక విధానంలో నిగమన పద్ధతి లేదా ఆగమన పద్ధతిలో విషయ వాస్తవికత గ్రహించబడుతుంది, ఐతే భారతీయ దర్శనాలలోని 'న్యాయం' ఆగమన నిగమనల సంశ్లేషణగా నూతన తార్కిక పద్ధతిని అభివృద్ధి పరిచింది అందులో ప్రతిజ్ఞ, హేతు, ఉదాహరణ, ఉపానయం, నిగమనం లేదా సిద్ధాంతంగా చలామణి అవుతుంది. ఇక మనం ఒక ఉదాహరణగా పువ్వు అనే దాన్ని తీసుకుని చర్చిస్తే, పువ్వు అనే వస్తువుకు ఉండే విశేషములుగా వాసన, పువ్వు రంగు మొదలైనవిగా చెప్పుకోవచ్చు అయితే పువ్వు

లేనిదే దాని విశేషములు ఉండవు, పువ్వును విశేషములతో గుర్తించవచ్చు, విశేషములను పువ్వుతో గుర్తించవచ్చు, కానీ విశేషములే పువ్వు కాదు, పువ్వుని విశేషములకు భిన్నంగా చూడవచ్చు, విశేషములను పువ్వుకు భిన్నంగా చూడవచ్చు, ఐతే పువ్వు నుండి విశేషములను స్వతంత్రంగా చూడలేము, అలాగే విశేషములను పువ్వు నుండి స్వతంత్రంగా చూడలేము కూడా. పువ్వులోనే విశేషములు అవ్యాకృతంగా ఉంటాయని, కారణంలోనే కార్యం దాగియుంటుందనే సత్కార్యవాదంగా సాగింది. అయితే బౌద్ధుల ప్రతీత్యసముద్పాద తాత్త్వికత (విచ్చిన్న ప్రవాహం) అనగా 'ఒక వస్తువు లేదా సంఘటన ఉత్పన్నం కావడానికి క్రితం క్షణం వుండి శాశ్వతంగా విలుప్తం చెందడం' నుండి వారి తార్కికత అభివృద్ధి చెందింది. ఫలితంగా కారణంలోనే కార్యం అనే భావనని బౌద్ధుల విచ్చిన్న గతితార్కిక తర్కంతో ఖండించారు. అంతేకాకుండా జైనులు సైతం నిర్ధిష్ట తార్కికతను అభివృద్ధి పరుచుకున్నారు, వారి తర్కాన్ని స్యాద్వాదం అని అంటారు అంతే కాకుండా జైనుల దృక్పథాన్ని 'నయంగా' ప్రస్థావిస్తారు. ఏమైనా భారతీయుల తార్కికవాద సిద్ధాంతాలు వందలల్లో ఉన్నాయనే చెప్పుకోవాలి. ఒకొక్క దర్శన శాఖ తమ నిర్ధిష్ట తర్కాన్ని అభివృద్ధి గావిస్తూనే వివిధ తార్కిక శాఖలను ఖండించడం కూడా జరిగింది. ఇకపోతే పాశ్చాత్యుల నిగమన–ఆగమన తర్కాలను విమర్శిస్తూ గతితార్కిక తర్కశాస్త్రాన్ని అభివృద్ధి గావించారు. గతితార్కిక తర్కశాస్త్రం వైరుధ్యాన్ని–వైరుధ్య నియమాలను గ్రహించడంగా అభివృద్ధి చెందింది, అయితే దీని విశిష్టత మానవుని ఆచరణతో తర్కాన్ని విడదీయ లేనటువంటిదిగా గుర్తించాలని భావిస్తుంది. అందుకే గత తత్త్వశాస్త్రాల లోపాల విమర్శనాత్మక దృక్పథంగా భౌతికవాద గతితర్కం ముందుకు వచ్చింది. నేడు మన భారత దేశంలో ఎవరైనా తాత్త్విక చర్చను సాగిస్తే మనకు సంబంధించినది కాదని, దానికీ రాజకీయానికి ఏమి సంబంధమున్నదని భావిస్తున్నారు కూడా(ప్రతీ రాజకీయ చర్చకు, నేపథ్యానికి తాత్త్వికతే భూమిక అని గ్రహించడంలోని లోపం నుండే ఈ సమస్య ముందుకు వస్తుంది), నిజానికి మన భారతదేశంలో జరిగినంత తాత్త్విక పరిశ్రమ–కృషి వేరొక చోట జరగలేదనే చెప్పవచ్చు, కానీ నేటి ఆధునిక అశాస్త్రీయత మరియూ గతకాలపు భావవాదాల ధోరణులలో సాగిపోవడంతో అభివృద్ధి కాలేకపోతున్నాము, అందుకే మన తాత్త్వికతల రూపాన్ని విమర్శిస్తూ వాటి సారాన్ని కాపాడుకుంటూ భౌతికవాద గతితర్కంలో సంధానింప చేయాల్సిన భాధ్యత ఉన్నది.

15

సామాజిక మార్పు

మానవ సమాజం నిరంతరం మార్పు చెందుతుందని భావించడం ఏమంత తప్పుకాదు. నేటి భారతదేశం కూడా మారుతుందని భావించడంలో పొరపాటులేదు. ఏ విధమైన మార్పు అనే ప్రశ్నే మనల్ని ఒకింత ఆలోచించేట్లు చేస్తుంది, సందిగ్ధంలోకి నెడుతుంది. నిజానికి సమాజ శాస్త్రం అనేది ప్రకృతి శాస్త్రాలకు ఉన్నంత సుధీర్ఘ పరిణామాత్మక-గుణాత్మక చరిత్ర కలిగి ఉన్నదని భావిస్తుంది. ఐతే సామాజిక శాస్త్రం అనేది చారిత్రక-తాత్త్విక శాస్త్రాలకు భిన్నమైనదని వాదిస్తున్న ఆధునికానంతర మేధావులు మనకు గోచరించడాన్ని గమనించవచ్చు. సామాజిక శాస్త్రం అంటేనే చారిత్రక-తత్త్వశాస్త్రాల నిర్మాణం అని గ్రహించాలి అయితే ఈ చారిత్రక-తత్త్వశాస్త్రాలపై ఎటువంటి దృక్పథం కలిగి ఉన్నామనే సమస్యే మార్పు అనే అంశంపై మన వైఖరి ఎటువంటిది అనే స్పష్టతను కలిగిస్తుంది. మార్పు అనేది నిరంతరం అని వాదించినా ఆ మార్పు అధిభౌతికమైనది లేదా యాంత్రికమైనదిగా చలామణి అయినదై ఉన్నది, వీటి యొక్క అశాస్త్రీయ దృక్పథాలను విమర్శించి భౌతికవాద గతితర్కం మార్పు అనే అంశాన్ని అభివృద్ధి చేసింది. ఐతే సామాజిక మార్పుకు సంబంధించి ఇప్పటివరకూ మన అవగాహనలోనూ లేక మన ఆచరణలోనూ వ్యష్టి పూరితమైన వైషమ్యామే సమాజపు సమస్యల పరిష్కారంగా

భావిస్తున్నారు, తదనుగుణంగా ఆచరించడం కూడా జరుగుతుంది. కానీ సామాజిక వైరుధ్యాన్ని వ్యక్తుల సామాజిక సంబంధాల నుండి ఉద్భవించే వైషమ్య పూరితాంశంగా గ్రహించాలని భౌతిక పరిస్థితులే మూలమని(ఉత్పత్తి సంబంధాలు) రాజ్యరూపాలు, మానవ చైతన్యయుత వ్యవహారాలు ఉత్పత్తి సంబంధాల నుండే ఉద్భవిస్తాయని గుర్తించాలి, అయితే 'అన్ని ఉత్పాదక శక్తులు అభివృద్ధి చెందక ముందే ఏ సామాజిక క్రమం కూడా నాశనం చేయబడదు మరియు పాత సమాజపు చట్రంలో పరిణతి చెందడానికి ముందే ఉత్పత్తి యొక్క కొత్త ఉన్నతమైన సంబంధాలు పాత వాటిని భర్తీ చేయవు' అనే భౌతికవాద గతితార్కిక భావనను పరిగణలోకి తీసుకోకుండా ఉండటమనేది ఉత్పత్తి శక్తుల ఉత్పత్తి సంబంధాల వైరుధ్యాన్ని గ్రహించకపోవడమనే సమస్య నుండి ఉద్భవిస్తుంది. కావున సామాజిక మార్పు విషయంలో మనకున్న అభిప్రాయాలు కేవలం అస్పష్ట–అనిర్ధిష్ట అవగాహనలే. ఇక అనుభవవాద ప్రాతిపథికగా మార్పును నిర్వచించడం లేదా ఆచరించడంగా సాగిపోతున్న నేటి తరుణంలో మర్పు యొక్క నిర్వచనాన్ని స్థానిక భౌతిక పరిస్థితులలోకి అన్వయించుకోవడం ఒక భాధ్యతగా, కర్తవ్యంగా ఉన్నది. రాజకీయ, తత్త్వశాస్త్ర, వివిధ కళల రూపాలలో ముందుకొచ్చే సామాజిక మార్పు యొక్క చైతన్యానికి మూలంగా ఉత్పత్తి శక్తుల మరియు ఉత్పత్తి సంబంధాల వైరుధ్యంగా ఉంటుంది. ఈ సంబంధాలు నిర్ధిష్ట స్థల–కాలాలను అనుసరించి వ్యవహారంలో ఉంటాయని గమనించాలి. ఈ నిర్ధిష్ట సామాజిక గర్భంలో నుండే క్రమానుగతంగా అభివృద్ధి చెందే సామాజిక సంబంధాలు మార్పుకు మూలంగా మారతాయి. ఈ మార్పు అనివార్యంగా భావరూప శక్తులు భౌతిక రూపం దాల్చడంగా ప్రతిఫలిస్తాయి. ఈ రోజుకూ మన భారతదేశంలో మార్పు అనే అంశాన్ని సరిగ్గా అవగాహన చేసుకోవడం లేదనేది విధితమే, రకరకాల మార్పుకు సంబంధించిన తాత్త్విక ధోరణలు రాజ్యమేలుతున్న సందర్భంలో తీవ్రమైన తాత్త్విక సంఘర్షణకు గురికావాల్సిన కాలం మన ముందుంది. నేటి కాలంలో గతితార్కిక తాత్వికతను మన దృక్పథంగా చేసుకుని మార్పు నిర్వచనాన్ని మార్చాల్సిన అవసరం అనివార్యం.

16

అశ్లీల చిత్రాలకు వ్యతిరేకంగా పోరాడదాం!

స్త్రీ – పురుషులిరువురి తీవ్ర వ్యామోహాలు అశ్లీల చిత్రాల వీక్షణం వైపు మొగ్గు చూపిస్తుంటాయని, అంతేకాకుండా అశ్లీల చిత్రాలకు అలవాటుపడి తీవ్ర వ్యామోహులుగా మారుతుంటారని ఇటీవలి అధ్యాయణాలు తెలుపుతున్నాయి. తీవ్ర వ్యక్తివాదం ప్రధానంగా ఉన్న నేటి సమాజంలో అశ్లీల చిత్రాల వీక్షణం ఒక ఉదాహరణగా ఉన్నది. ఇందుకు నేడు ఫలితప్రాధాన్యవాదం–ఆధునికానంతరవాదాలు రాజ్యమేలుతున్న వాతావరణాన్ని గ్రహించాలి. ఇక అశ్లీల చిత్రాల వీక్షణంలో వారి పరిమిత ఆవరణం భంగం చెంది సాధారణంతో తమని తథాత్మ్యం చెందడంతో సుఖం సంపాదించుకుంటూంటారు. ఫలితంగా తీవ్ర భావోద్వేగులుగా మారుతుంటారని గమనించాలి. ఇది రెండు పార్శ్వాలలో వ్యక్తమవుతూంటుంది. నిజానికి మైథునం అనేది సంతానోత్పత్తి క్రియ, ఇది కర్మేంద్రియము. ఈ క్రియ కామంగా అనగా కోర్కెగా వ్యక్తమవుతుంది. ఈ కోర్కె సంతానోత్పత్తి మరియూ సుఖంగా విశేషము కలిగియుంటుంది. సంతానోత్పత్తి క్రియపై సుఖం అధ్యారోపితమైయుంటుంది. ఈ అధ్యారోపితం వ్యవహారిక సత్త అనగా సంతానోత్పత్తి క్రియ యొక్క సుఖం. ఈ ఏకత్వం మధ్యవర్తిత్వ

ఐక్యతగా పరాయీకరణ చెందుతూ ఒకదానినొకటి తొలగించుకుంటూ ప్రత్యేకతను సంతరించుకుంటాయి. ఫలితంగా ఈ వైరుధ్యంలో సుఖంపై వ్యభిచారం అధ్యారోపితమవుతుంది. ఈ వ్యభిచారంపై అంతర్జాల అశ్లీల చిత్రాలు అధ్యారోపితమవుతాయి. మానవ సమాజంలోని సామాజిక అధ్యాసల ప్రతిఫలంగా వ్యక్తిగత అధ్యాసలు కలుగుతుంటాయి(భావజాలం). ఈ అధ్యాసలు పూర్తిగా రాజకీయార్థిక అంశాలతో ముడిపడియుంటాయని గమనించాలి. సంతానోత్పత్తి క్రియ– సుఖమనే అంశాల మధ్య వైషమ్యం ఏర్పడుతుంది(సామాజిక వైరుధ్యం నుండి ఉద్భవిస్తుంది), ఫలితంగా సంతానోత్పత్తి క్రియ యొక్క సద్గుణపు సర్వోత్కృష్ట రూపంగా సుఖాన్ని గుర్తించడం జరుగుతుంది. సుఖమే అత్యుత్తమమని చలామణి అవుతుంది. ఫలితంగా ఈ సుఖానికి ప్రతిరూపంగా వ్యాభిచారం(ప్రత్యక్ష–పరోక్ష) అలాగే అశ్లీల చిత్రాల వీక్షణంగా (అభూత వ్యభిచారం) ఉద్భవిస్తాయి(గత కుటుంబ రూపాలు రూపాంతర(అఫేబెన్ లేదా అఫేబంగ్)పద్ధతిలో వర్తమానంలో వ్యక్తం కావడంగా–వ్యవహరించే నూతన రూపాలుగా వీటిని గ్రహించాలి). అశ్లీల చిత్రాల వీక్షణంతో డోపమైన్ అనే రసాయనం విడుదల అవుతుంది. ఈ రసాయనం అనేది ఒక సుఖ రసాయనంగా మన శరీరంపై ప్రభావం చూపుతుంది, అంతేకాకుండా ఈ రసాయనం సుఖ వ్యసనానికి గురిచేస్తుందని, కావున అశ్లీల చిత్రాల వీక్షణం ఒక మత్తు మందని శాస్త్రీయ అధ్యాయనాలు వెల్లడి చేస్తున్నాయి. కావున ఇది మన సమాజం తక్షణం ఎదురుకుంటున్న సమస్యాత్మక వ్యవహారంగా ఉన్నది, కనుక పరిష్కరించకపోయినా తదనుగుణంగా ఆలోచించకపోయినా మనకూ అంటుకునే సమస్య(విభిన్న రూపాలలో). ఈ సమస్యకు పరిష్కారం(తాత్కాలికమే అనుకోండి) రెండు పార్శ్వాలల్లో సాగాలి ఒకటి జ్ఞాణ సంబంధితం, రెండు ప్రభుత్వ నియంత్రణ చర్యలు. ప్రజలను ముఖ్యంగా విద్యార్థి, యువకులను ఈ సమస్య పై జ్ఞానవంతులను చేయడం కొరకు ప్రభుత్వం మరియు పౌరప్రజా సంఘాలు అధ్యయన తరగతులు, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి. రెండు ప్రభుత్వం వాస్తవ–పరోక్ష–అభూత వ్యభిచారాలను కట్టడి చేయాలి (నిజానికి ఇప్పటి వ్యవస్థ నిర్మూలనతోనే ఇది సాధ్యపడుతుంది). అందులో భాగంగా అశ్లీల చిత్రాలను నియంత్రించాలి, వీటి నిర్వాహకులపై క్రిమినల్ కేసులు వెయ్యడమే కాకుండా ప్రత్యేక దర్యాప్తు సంస్థలను ఏర్పర్చాలి. వ్యభిచార వృత్తి నుండి బయటకు వచ్చిన వారికి సామాజిక భద్రత మరియు ఉద్యోగాలు కల్పించాలి, మొదలైన పరిష్కారాలను

పౌరప్రజా సంఘాలు – ప్రభుత్వాల ఉమ్మడి అవగాహనతో కూడిన దీర్ఘకాలిక కార్యాచరణతో సాగడానికి ప్రయత్నం ప్రారంభమవ్వాలి. అయితే ఉత్పత్తి–పునరుత్పత్తి అనే ద్విముఖ అంశాల మధ్య వైరుధ్యాన్ని పరిష్కరించనంత వరకూ వ్యక్తిలో అరాచకత్వం చోటుచేసుకోకుండా ఉండదని గ్రహించాల్సిందే. అందుకు సామాజిక మార్పు యొక్క అవసరం ఉన్నది, అందుకోసం పరిష్కారం వెతక వల్సిందే.

17

ఏకమేవాద్వితీయం

ఆలోచన పదార్థ జనితం, అందుకే అది దాని రూపమే కానీ దానికి భిన్నమైనది కాదు. ఒకటి పదార్థపు వస్తుగతాంశము విభిన్నతలకు మూలము అది సజీవం–నిర్జీవం నుండి సజీవంగా–సజీవం నుండి నిర్జీవంగా సజీవత్వాన్ని కలిగియుంటుంది. ఆలోచన ఈ విభిన్నతల నుండి వస్తుగతాంశపు రహస్యాన్ని, వాస్తవాన్ని గ్రహిస్తుంది. అది వస్తుగతాంశ రహస్యానికై–విభిన్నతల పరస్పరతను గ్రహించడానికై వాటి చారిత్రకతను, వర్తమానం–భవిష్యత్తుకై పరిశీలించుతుంది. ఈ పరిశీలనలో తేలేదేమనగా ఒకటే(వస్తుగతం) వేరొకటిగా–ఒకటిలో వేరొకటి ఉంటుంది. వేరొకటి ఆ ఒకటిలో కాకుండా ఉండదు. ఒకటిలో ఉండే వేరొకటి ఒకటిగా ఉంటుంది. వేరొకటి ఒకటిలో– ఒకటిలో వేరొకటి ఉంటుంది, అందుకే అది ఒకటి. ఇదే ధర్మాన్ని ఇంకొకటిగా ఆ ఒకటే పరివర్తన చెందుతుంది. అంతా ఒకటే అదే సత్యశాశ్వతం అదే పదార్థ వస్తుగతాంశం. మనం మన ఆలోచనతో సత్యాన్ని గ్రహిస్తాము ఈ విధంగా గ్రహిస్తే తెలుస్తుందేమిటి? రాగద్వేషాలు ఉండకుండా సత్యాన్ని గ్రహిస్తాము. బుద్ధి, పదార్థం వేరుకాదు, వస్తుగతాంశము మూలం. బుద్ధి పదార్థానికి భిన్నంగా ఉండదు. సత్యాన్వేషణకు ఆలోచన కీలకం, ఆలోచన పదార్థ జనితం, బుద్ధి యొక్క అభివర్గము. పదార్థ సత్యం విభిన్న రూపాలుగా

విభజించబడింది. పదార్ధ సారం. పదార్ధ రూపం గ్రహించబడాలి. కానీ అది అదిగా అదే సమయంలో ఉండదు. సారం–అంతఃస్సారంతో ఉండుటే కాకుండా అది చలనంలో ఉంటుంది. అందుకే దృగ్గోచరం తలకిందులు. కావున అది ఉంది అలాగే లేదు. వస్తుగతాంశపు చలన సంశ్లేషణే పదార్ధం. అంతయూ పదార్ధము, పదార్ధమే సాపేక్షం. పదార్ధమే విభిన్న రూపాలుగా పరివర్తన చెందుతుంది. అన్నింటికీ మూలం పదార్ధం. పదార్ధం చలనం, ఆలోచనే విభిన్నం. విభిన్న రూపాలుగా పరివర్తన చెందే పదార్ధాన్ని ప్రతిఫలిస్తుంది ఆలోచన, అందుకే విభిన్నం. కానీ ఆలోచన పదార్ధపు వస్తుగతాంశమును గ్రహించనంత వరకూ కేవలం విభిన్నత్వాన్ని వాటి తేడాలని మాత్రమే ప్రతిఫలిస్తుంది. ఒక ఉదాహరణగా మనం ఒక మనిషికి వైద్యం చేసేటప్పుడు ఒక భాగానికి సమస్య వచ్చినప్పుడు దాని వరకే పరిష్కరించడం జరుగుతూంటుంది. ఇక్కడ మనం గ్రహించాలి విభిన్నానికి పరిష్కారం చూపుతున్నామనుకోవడం సరైనది కాదు. ఎందుకంటే ఒకదానికే పరిష్కారం చూపుతున్నామని గ్రహించాలి. ఎందుకనగా ఆ ఒక్కటి వేరొకటి కాదని ఒక మొత్తంలో భాగమని అప్పుడే తెలుస్తుంది కూడాను. ఇంకా ఎలా చెప్పచ్చో చూద్దాం మన ముక్కు మనం పీల్చే గాలిలో ప్రాణవాయువును వేరుచేయలేదు. అది పీల్చిన గాలిలో ప్రాణవాయువును గ్రహిస్తూ బొగ్గుపులుసు వాయువును వదలడం మన శరీర ధర్మం, ఈ ధర్మం ఎలా సాగుతుంది. పీల్చేదైయుండాలి గాలి. పీల్చగలదై యుండాలి ప్రాణవాయువు శాతం అధికమైన గాలి. పీల్చబడేది ఉండాలి ముక్కు–ఇది పీలుస్తుంది. పీల్చిన దాని నుండి ప్రాణవాయువును–బొగ్గుపులుసు వాయువును వేరుచేసే శారీర ధర్మం. ఈ ధర్మం ప్రక్రియగా సాగుతుంది ఆ విధంగా గాలినే ప్రాణవాయువు–బొగ్గుపులుసు వాయువులుగా వేరు చేస్తూ మార్పునకు గురిచేస్తుంది. అనగా గాలిలోని ప్రాణవాయువును గ్రహిస్తూ–బొగ్గుపులుసు వాయువును విడనాడటం. అందుకే ఒకటే మనలో ప్రవేశిస్తూ వివిధ రకాలుగా విభజించుకుని వైరుధ్యంతో సాగుతూ తిరిగి అది ఒకటిలో భాగమైపోతుంది. కావున అంతా, ఆ ఒకటే వస్తుగతమని గ్రహించాలి.

18

వ్యవస్థీకృత దోపిడి-ప్రత్యక్ష దాడి

మానవుడి ఆచరణాత్మక కార్యకలాపంలో పదార్థాన్ని మొదట తన ఇంద్రియ కార్యకలాపంతో గ్రహిస్తూ ఆలోచనాత్మక కార్యకలాప అంతర్మధనంతో పదార్థం యొక్క సత్యాన్ని బహిరంగ పరుస్తాడు. ఐతే జడతార్కిక ఆలోచన అనేది భావన యొక్క వేరొక రూపంగా పదార్థం ఉండటంగా, భావననే పదార్థం యొక్క రూపును నిర్దేశించడమని, భావనకు పదార్థానికి సారూప్యత లేకపోవడంగా చలామని అవుతుంది. కానీ జడతార్కిక ఆలోచనను విమర్శిస్తూ మానవ ఆచరణలో పాదార్థిక ఆలోచనకు అనగా పదార్థం మానవుని మెదడులో ప్రతిబింబం అవ్వడం, పదార్థం యొక్క అంతర్గత చలన సూత్రాలను గుర్తించడం, పదార్థం యొక్క రూపురేఖలను సరైన రీతిలో ప్రదర్శించడం, పదార్థం మరియు పాదార్థిక భావనకు సారూప్యత ఉండటంగా అభివృద్ధి చెందుతుంది. నిజానికి భారతదేశ చరిత్రను అధ్యాయణం చేయడంలో ఒక విధమైన జడతార్కికత తీవ్రమైన సమస్యగా ఉండటంతో భౌతికవాద గతితర్కం విస్మరించబడుతుంది. ఫలితంగా చరిత్రపై శాస్త్రీయ అంచనాకు దూరమవడం జరుగుతుంది. ఇకపోతే చరిత్రలో భారతదేశం స్వయంసంపూర్ణ గ్రామీణ వ్యవస్థ అనగా భూమిపై వ్యక్తిస్వామ్యం లేదా స్వీయ యాజమాన్యం లేకపోవడంగా చలామని అవ్వడాన్ని

గమనించవచ్చు, ఇక్కడ నిరంకుశ కేంద్రీకృత రాజ్యములు(స్వయంసంపూర్ణ గ్రామీణ వ్యవస్థ యొక్క ప్రతిఫలనం) నీటిపారుదల భాద్యతలతో బలవంతమైన సాయుధ సైన్యాల వ్యవహారంతో అలాగే ఇవి కానుకలు మరియు సామూహిక పని రూపంలో స్థానిక సమూహాలు ఉత్పత్తి చేసే ఆర్థిక మిగులు సేకరణతో కొనసాగేవి(శ్రమ దోపిడీని గమనించాలి). గ్రామ సమాజాలు, వారు “స్వయంగా మనగలగడమనే” ఆర్థిక వ్యవస్థలలో సాపేక్షంగా స్వతంత్రంగా ఉంటాయి (హైడ్రాలిక్ సివిలైజేషన్-వర్ణ వ్యవస్థ). ఎన్ని దండయాత్రలు జరిగినా చెక్కుచదరకుండా మనగలగడానికి కారణమైన ఈ వ్యవస్థ యొక్క స్వయం చలనం నుండి గుప్తులు, కుషనుల కాలంలో ప్రాధమిక రూపంలో భూస్వామ్యం అభివృద్ధి కాసాగింది, ఈ భూస్వామ్యాన్ని భూస్వామ్యం ఎగువ మరియూ భూస్వామ్యం దిగువగా డి.డి కోసాంబి అభివర్ణించారు. భూస్వామ్యం ఎగువ నుండి అనగా రాజ్యం కొంత ప్రాంతాన్ని, భూమిని, హక్కులను, అధికారులకు లేదా శక్తిహీన రాజ్యాలకు నేరుగా మంజూరు చేయడం. ఇది సామంతుల రూపంలో సాగేది, ఇవి అక్కడికక్కడ పన్నులు వసూలు చేయడంతో పాటుగా అవసరమైనప్పుడు రాజ్యానికి సైనిక సహకారం అందించేవి. భూస్వామ్యం దిగువ నుండి అనగా రాజ్యం భూమిని నేరుగా కొందరు వ్యక్తులు(బ్రాహ్మణులు) మరియూ కొన్ని సమూహాలకు అందించి గ్రామాల నుండి భూస్వామ్య, సామంత అధికార శక్తులుగా ఎదగడానికి ప్రోత్సాహకమవడం, వీటినే అగ్రహారాలుగా పిలుస్తారు, భూమిపై వ్యక్తిస్వామ్యం అభివృద్ధిని చూడవచ్చు-కులాల అభివృద్ధిని గమనించవచ్చు, శూద్ర-అంటరాని కూలాల దోపిడీని గ్రహించవచ్చు, అలాగే అగ్రకూలాల, అగ్రవర్ణాల ఊర్ధ్వ స్థితి నుండి అధమస్థితిలోనికి అలాగే వివిధ కులాలు-వర్ణాలు-తెగలు ఊర్ధ్వ స్థితిలోనికి పరిణామాన్ని కూడా చూడవచ్చు. ఇక మొగలుల కాలంలో వారసత్వరహిత, అస్థిరమైన హక్కులు కలిగిన జాగీరుదారీ విధానాన్ని అమలు పరిచారు, ఐతే అక్బర్ కాలంలో ఈ విధానాన్ని రద్దు పరిచి మొత్తం తన జాగీరు అనగా రాజ్యం క్రిందకు తీసుకుని జాగీరు భూముల మున్సబ్దారులకు జీతాలు ఇవ్వడం ప్రారంభించారు. ఈ జాగీరు విధానంలో రైతుల వద్దనుండి అధిక మొత్తంలో ఉత్పత్తిని స్వాధీనం చేసుకోవడంతో తీవ్ర దగాకు గురైయ్యేవారు. రైతుల శ్రమను దోచుకునేవారు(దిగువ కులాలే దోపిడీకి గురైయ్యేది). ఇక భారతదేశానికి బ్రిటీషర్లు

వచ్చిన తరువాత ఈ మొగలుల విధానాన్ని రద్దుచేసి పర్మనెంట్ సెటిల్మెంట్ వ్యవస్థను అలాగే జమిందారీ వ్యవస్థ మరియూ మహల్వారీ వ్యవస్థల అభివృద్ధి, అమలుతో సుస్థిరమైన, సుసంపన్నమైన భూస్వామ్యమనేది భారతదేశంలో అభివృద్ధికాసాగింది (శ్రమ దోపిడీ తీవ్రతరమైనది). ఇక పెట్టుబడి ప్రవేశంతో స్వంతాస్తిని(ప్రవేట్ ప్రోపర్టి) శ్రమశక్తి దోపిడి అభివృద్ధిని కూడా గ్రహించవచ్చు. ఇటువంటి వ్యవస్థీకృత దోపిడీ ప్రతిఫలనంగా ప్రత్యక్ష దాడులు అనివార్యం. అందుకే నేటికీ కారంచేడు, చుండూరు మారణహోమాలనుండి, వ్యక్తిగత దాడుల వరకూ చూస్తున్నాము, అనుభవిస్తున్నాము. వ్యవస్థీకృత శ్రమ దోపిడీని నిర్మూలించేంత వరకూ అణచివేతల రూపాలలో ఒకటైన దాడులు గత–వర్తమాన–భవిష్యత్తులలో సాగడం జరుగుతూనే ఉంటుంది.

19

మానవ శక్తి

శక్తి అనే భావన మానవ అభివృద్ధిలో కీలక పాత్రను పోషించింది. మానవుడే ఒక శక్తి. అతడి శక్తి శ్రమశక్తి–సంతానోత్పత్తి శక్తిగా ద్విముఖమైనదైయుంటుంది. అతడి ద్విముఖమైన శక్తి అతని మెదడు చేత వ్యవహరింపబడుతుంది. అతని మెదడు తన యొక్క సామాజిక ఆచరణ ద్వారా అభివృద్ధి చెందుతూంటుంది. మానవుడి మెదడు అత్యున్నత పదార్థం కావున దానికదే ఒక శక్తి. ఆ శక్తి ఇంద్రియాలు–కర్మేంద్రియాల చేత అభివృద్ధి చెందుతూ వాటిని వ్యవహరింపచేస్తుంటుంది. ఈ శక్తి నిత్యత్వం–మార్పిడి కలిగి ఉంటుంది. ఈ శక్తి పదార్థపు ధర్మం, విశ్వజనీనం అందులో భాగమే మానవుని శక్తి. మన మెదడు భౌతిక పదార్థపు ప్రతిఫలనం, మన మెదడు మన ప్రతిఫలనం, మన మెదడు మానవ ఆచరణ యొక్క పార్శ్వం అయిన ఇంద్రియ కార్యకలాపం అనగా బహిర సంవేదనలనేవి వస్తువుల విశేషములను ఇంద్రియాలు సంవేదనలు(పరిమితులలో) చెంది మెదడు ద్వారా భావనలుగా వ్యక్తపరుస్తాయి. అలాగే మానవుని అంతర్గత భావరూప ధోరణులు భావోద్రేకాలు, ఉద్దేశాలు, భావాలు భావరూపశక్తులుగా మెదడు ద్వారా వ్యక్తమవుతాయి. మానవ మెదడు ఇంద్రియాల లోపంతో(ఆచరణలో భాగమే) లేదా పరిస్థితుల ఆచరణాత్మకత నుండి భ్రమాత్మక ప్రతిఫలనం చెందుతుండటాన్ని

గ్రహించవచ్చు. అలాగే మానవ ప్రయోగం రిత్యా, పరిశ్రమ రిత్యా సత్యాన్ని ప్రతిఫలిస్తాము. నాస్తి–అస్తి అనేది అస్థిత్వంగా లేదా సత్తాగా చెప్పుకున్నా సంభవం అనేది లేకుండా చెప్పుకోలేము అందుకే సంభవించడం సంభవించే సంభవం, సంభవం సంభవించిన సంభవం. అదొక నిరంతర చలనశీలత. ఈ నిరంతరత స్థల–కాలాల చలనశీలతలో గ్రహించాల్సిన అవసరం ఉన్నది, స్థలం పుట్టుక, పరిణామం, అభివృద్ధి నాశనం కాలం, స్థలం యొక్క అభివృద్ధి దశలు కాలంగా, స్థలం యొక్క కొలతలు కాలంలో ఉంటాయి. కాలం స్థలం ద్వారా వ్యక్తమవుతుంది. అయితే కాలం నిరంతరం అభివృద్ధి చెందే గుణమున్నది. అస్తిత్వం తనలోతానుగా ఉన్నది, అది తనకైతానుగా అస్తిత్వం వేరొకదానికొరకు ఉన్నది. అది తనను తాను కోల్పోతుంది రెండవ దానితో గుర్తించుకుంటుంది, అది వేరొక అస్తిత్వాన్ని అతిక్రమిస్తుంది. వేరొక దాన్ని గుర్తించకుండా దానిలో తనను చూస్తుంది. రెండవదాన్ని నిర్మూలించడానికి తనను తాను నిర్ధారించుకుంటుంది, ఫలితంగా తననే తొలగించుకుంటుంది, అందుకు రెండవది సహకరిస్తుంది. ఈ వైరుధ్యం నిరంతరం–సాపేక్షం. వస్తువు ఉన్నప్పుడు సత్త దృవీకరణ అసత్తు అభావం, వస్తువు లేనప్పుడు అసత్తు దృవీకరణ సత్తు అభావం, వస్తువు ఉన్నది– లేదు దృవీకరణ–అభావం. అందుకే సత్త మానవీకరించబడినది, అది మానవీయ సత్త. ఇకపోతే భారతదేశంలో ఇప్పటికీ తత్త్వశాస్త్రం అది పరిశీలించే విషయాలను నిరంతరం అధ్యయనం చెయ్యాల్సిన అవసరం ఉన్నది, వాటిని పరిశోధించాల్సిందే.

20

తాత్త్విక భారతం

తత్త్వశాస్త్రం అనగా వివిధ తాత్త్వికుల నిర్దిష్టానుసార తాత్త్వికతను అనుసరించి నిర్వచించే విషయంగా చెప్పుకుంటారు, అందుకే ఏ తత్త్వశాస్త్రమైనా వేరొకరి తాత్త్విక నిర్వచనాన్ని తమపై మోపడాన్ని అంగీకరించదు. కానైతే తత్త్వశాస్త్రం అనేది ఒక శాస్త్రీయ పరిశోధనకు మరీ ముఖ్యంగా అదొక శాస్త్రాంశముగా మారడానికి చరిత్రలో అభివృద్ధి అయిన పారిశ్రామిక ఉత్పత్తి విధానం మరియూ విజ్ఞాన శాస్త్రాలు కాగా ప్రారంభంలో తత్త్వశాస్త్రమే సకల శాస్త్రాలు కలదిగా, కలిగినదిగా ఉండేది ఐతే యాంత్రిక భౌతికవాదం అనే దృక్పథం నుండి తత్త్వశాస్త్రం ఒక శాఖగా, అధ్యాయనాంశముగా మారింది. అప్పటి నుండీ తత్త్వశాస్త్రంపై గంభీరమైన అధ్యాయనం సాగడాన్ని గమనించవచ్చు. ఐతే ఈ అధ్యాయణంలో పక్షపాత ధోరణిని గ్రహించకుండా ఉండలేము, అందుకు ఆయా తాత్త్విక దృక్పథాల నేపథ్యమని గుర్తించాలి. మానవుని ఆలోచన ప్రారంభమైనప్పటి నుండి తత్త్వశాస్త్రాభివృద్ధిని గుర్తించాలని, మానవుని ఆలోచనా విధానాన్ని శాస్త్రంగా గుర్తిస్తూ తత్త్వశాస్త్రంగా నామకరణం చేస్తూ వచ్చారు. ఐతే గ్రీకు తత్త్వవేత్త అయిన పైతాగరస్ తత్త్వశాస్త్రంగా నామకరణం చేసారని 'ఫిల' అనగా ప్రేమ అని 'సోఫియా' అనగా జ్ఞానమని 'జ్ఞానంపై ప్రేమనే' ఫిలాసఫి అని పిలవడం జరిగింది,

ఐతే భారతీయులు మాత్రం సంస్కృతంలో తత్ అనగా 'నేను' త్వం అనగా 'అది' అని నేను అనబడే ద్వారా అది అనేది తెలుసుకోవడంగా నిర్వచించారు, భారతీయుల నిర్వచనంలో శాస్త్రీయతను గ్రహించవచ్చు. తత్త్వశాస్త్రం అనగా మానవుని వివేచన ద్వారా సంవేదనల ద్వారా తెలుసుకోబడే ప్రకృతి సమాజములుగా చెప్పడం జరుగుతుంది. కానీ మరింత లోతుగా మానవుని ఆచరణాత్మకతలో ప్రకృతి-సమాజాల సామాన్య హేతుబద్ధ సత్య ప్రతిఫలనమే తత్త్వశాస్త్రంగా చెప్పవచ్చు కూడా, ఇకపోతే వాస్తవిక సమస్యను పరిగణనలోకి తీసుకుని పరిశీలనను ప్రారంభించడంతో వాస్తవిక అస్థిత్వాన్ని ప్రతిఫలించడం జరుగుతుంది, కచ్చితంగా ఈ వాస్తవిక అస్థిత్వం హేతుబద్ధ అస్థిత్వంగా సామాన్య/విశ్వజనీనతల వ్యవహారంగా ఉంటూనే ప్రత్యేకాంశపు విషయ పరిగణననే పరిశీలనా వస్తువుగా లేదా సత్యాంశముగా మారుతుంది. ఈ ప్రత్యేకాంశపు గ్రహింపు వాస్తవిక అస్థిత్వ సంపూర్ణ సత్య గ్రహింపుగా, ఈ గ్రహింపుని ప్రత్యేకాంశపు హేతుబద్ధ అస్థిత్వంగా ఈ భావాత్మకమే నిజ వాస్తవికతగా పరిగణన. ఇది కేవలం తలం యొక్క చర్చగా ఉంటున్నా ఈ చర్చ మొత్తం ఊహాత్మకం అని కొట్టివేయలేము. వస్తుగతమైన మానవ ఆచరణ అనేది భావాత్మక విశేషణాంశమైన వస్తుగతమైనది. ఈ వస్తుగతం విశిష్టాద్వైతం కాగా, ఆవశ్యకత అనేది వాస్తవికతగా ప్రతిఫలిస్తుంది, వాస్తవికత ఆవశ్యకమైనది. కావున తత్త్వశాస్త్రంకు సైతం ఊర్ధ్వ గమనం లేదా అరోహనా క్రమంతో పాటుగా అవరోహన దశ, అంతం కలిగినదైయున్నదిగా గ్రహించాలి. కావునే గత తత్త్వశాస్త్రాల యొక్క అంతాన్ని గ్రహించగలము కానీ భౌతికవాద గతితర్కంతో తత్త్వశాస్త్రమే అంతానికి గురైనదిగా భావన. దీనితో నేటికీ భారతదేశ తాత్త్విక శాఖల గతితార్కికాన్ని ఈ భౌతికవాద గతితర్కంలోకి సమన్వయీకరించే భాద్యత మిగిలే ఉన్నది, అప్పుడే భారతదేశంలోని తాత్త్వికతకు సైతం అంతం ఉంటుంది. ఐతే ఈ కర్తవ్యాన్ని చర్చించినా, భావించినా పండిత చర్చగా కొట్టేయడం వితండవాదమవుతుందే కానీ శాస్త్రీయమనిపించుకోదు. అంతేకాకుండా ఇకనైనా అధోగతిపాలైన భారతీయ తాత్త్వశాస్త్రాలను సంశ్లేషణ గావిస్తూ కాళ్ళపై నిలబడేట్లు చేసి భౌతికవాద గతితార్కిక తాత్త్విక భారతంగా మారుద్దాం.

21

మానవ ఆచరణ

ప్రకృతి లేక భావాలలో ఏది ప్రాథమికం అనే సమస్యను తడిమినప్పుడు ఆయా వాదాల ఖచ్చితమైన సమగ్ర నిర్మాణాత్మకతలో సంపూర్ణమైన నిరూపణను ప్రతిఫలిస్తాయి, అయినా భావవాదం ఒక నిర్ధిష్ట చారిత్రక అభివృద్ధికర పార్శ్వాన్ని కలిగినదిగా మార్క్స్ భావించారు కానైతే ఈ అభివృద్ధికి వాస్తవిక, ఇంద్రియ కార్యకలాపపు లోటును గ్రహించాలని వ్యక్తపరిచారు, ఇకపోతే భౌతికవాదం సైతం వస్తువు లేదా వాస్తవికతను ఒక భౌతిక వస్తువుగా పరిగణించడంతో కేవలం ఒక పార్శ్వపు అభివృద్ధాంశంగానే చరిత్రలో నిలబడినదిగా చెప్పుకోవాలి. కానైతే మార్క్స్ మానవ ఆచరణ యొక్క ప్రాముఖ్యతను ప్రకృతి లేదా భావాలలో ఏది ప్రాథమికం అనే సమస్యకు పరిష్కారంగా నిరూపించాడు. అందుకే భావవాదమైన లేదా భౌతికవాదమైన మానవ ఆచరణాత్మక అంశంగా పరిగణించడంగా ఆయా స్థల–కాలాల చారిత్రక నిర్ధిష్ట నియమానుసారంగా భావన. కావున ఆలోచన లేక ఇంద్రియాంశాలు మానవుని ఆచరణగా మరీ ముఖ్యంగా అవి మానవుని వస్తుగత కార్యకలాపంగా నిర్ధారించాడు, ఐతే మానవులే తమ చరిత్రను తాము నిర్మించుకుంటే అవి తమ ఇష్టానుసారంగా–అభిష్టానుసారంగా కాకుండా కేవలం సామాజిక నియమావళిని అనుసరించి సాగుతుంది. కావునే ఆలోచన యొక్క వాస్తవికతను

ఆచరణలో నిరూపించాలని ఆ నిరూపణ అనేది భౌతికవాస్తవికత అని శాస్త్రం. ఇకపోతే ఈ సమస్యకు సమన్వయాత్మక విషయంగా ఆచరణ అనేది భౌతిక వాస్తవికత అయితే అదే ఒక వస్తుగతమైనదిగా గ్రహించాలి కూడా. ఈ నిర్ధిష్టతలను అనుసరించి చరిత్రను పరిశీలించాలి లేకపోతే మానవ సమాజమనేది ఒక సామాజిక శాస్త్రాంశము లేనిదిగా అదొక ఉహాత్మకమైన లేక కేవలం పరిస్థితుల వాదంగా ముందుకు వస్తుంది అందుకే మానవ ఆచరణ నుండే పరిస్థితుల నిర్మాణాత్మకత ఏర్పడుతుందని శాస్త్రం. కావున మానవుడి యొక్క ఆచరణే స్థల-కాలాల నిర్మాణానికి మూలంగా భావించాలి. కావున మానవ సామాజిక చరిత్రలో భాగంగానే ప్రకృతి శాస్త్రాల అవగాహనను, అభివృద్ధిని చూడాలి. ఏమైనా విషయ వాస్తవికత అనేది మన అవగాహనలో ఆచరణ యొక్క ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకోని సాగడమే ఒక శాస్త్రంగా మన భారతదేశంలో అభివృద్ధి కాలేదనే చెప్పుకోవాలి. ఇకపోతే భావాలకు మరియూ అస్థిత్వానికి మధ్య సంబంధం, మరీ ముఖ్యంగా ఐక్యత ఏమిటనే సమస్య వాస్తవానికి ఆధునిక తత్త్వశాస్త్రానికి ఒక మొళికమైన చర్చ ఐతే భావవాదం భావపు అన్యధాకరణ రూపంగా వాస్తవికతను, భౌతికాన్ని గుర్తిస్తూ భావానికి భౌతికానికి మధ్య ఐక్యతగా నిరూపిస్తుంది. ఇక భౌతికవాదం ప్రపంచము ఒక భౌతిక పదార్ధమయమని నిరూపిస్తూ భౌతికమే భావానికి మూలమంటుంది. నిజానికి ఈ రెండిటి ఐక్యతలను విమర్శిస్తూ మానవ ఆచరణే భౌతిక-భావాల భావనలకు మూలంగా భౌతికవాద గతితర్కం భావిస్తుంది. ఈ ఆచరణ నియమానుసారంగా గ్రహించాలి. అది శాస్త్రీయాంశముగా పరిగణించాలని భౌతికవాద గతితర్కం నిరూపిస్తుంది. కావున మన సమాజం ఇప్పటికైనా మానవ ఆచరణను అనుసరించి సాగే సామాజిక నియమావళిని శాస్త్రీయపరమైన విషయంగా అధ్యయనం చెయ్యాలి, అందుకోసం అవిశ్రాంత కృషి చెయ్యాల్సిన అవసరం మన ముందు ఇంకా ఉన్నది.

22

విశ్వనరుడు

మానవ సమాజంలో శ్రామికులు కచ్చితంగా ఇంద్రియకమైన, అంగసంబంధమైన వారి శ్రమకు కావాల్సిన నిరింద్రియ, అభౌతికమైన సామర్థ్యత కలిగి ఉంటారు, అయితే మనం కేవలం ఈ అభౌతికమైన సామర్థ్యాన్ని శ్రమ వరకే పరిమితం చెయ్యలేము ఖచ్చితంగా ఈ అభౌతికమైన సమర్థత ఆయా దేశ కాల పరిస్థితులకు అనుగుణమైన తాత్త్విక–రాజకీయ–మత భావాలు కలిగియున్న వారవుతారు, కావున శ్రామికులు ఖచ్చితమైన విశాల ప్రాతిపదిక కలిగిన అభౌతికమైన మేధస్సును కలిగియుంటారని గ్రహించాలి. అందుకే మొత్తం సమాజపు సామాజిక నియమావళి ప్రాతిపథికగా వివరణను కలిగియుండటము చేతనే శాస్త్రీయమైన అంచనాకు రాగలము. మానవ సమాజం ఉత్పత్తి శక్తుల నిర్ధిష్ట చారిత్రక దశ అయిన ఉత్పత్తి సంబంధాల పునాది ప్రతిఫలనంగా ఉపరితలంతో కూడి యుంటుంది, ఈ నిర్ధిష్ట సామాజిక సంబంధాల నుండే శ్రామికుల శ్రమల పాత్రను వారి అభౌతిక సామర్థ్యతను గ్రహించాలి. నిజానికి ఈ ఉత్పత్తి సంబంధాల ఆస్తి సంబంధాలు, శ్రమ సంబంధాలు, పంపిణీ సంబంధాలపై ఆధారపడి ఆ మొత్తం సమాజంలోని భావాల ఆధిపత్యాన్ని చూడాల్సిన అవసరం ఉన్నది. ఈ ఆధిపత్య భావాల కొనసాగింపుగా శ్రామికుల భావాలు ఉండటమే కాకుండా వాటికి విరుద్ధమైన అవశ్యకమైన

నూతనమైన భావాలు వైరుధ్యంగా ఉద్భవిస్తాయి. ఇవే భావరూప శక్తులుగా శ్రామికుల నిర్ధిష్ట ప్రగతిశీలాంశములుగా ఉంటాయి, కావున ఇటువంటి సిద్ధాంతము నుండే మనం జాషువా గారిని అంచనా కట్టాల్సిన అవసరం ఉన్నది, ఉంటుంది కూడా. జాషువా గారు కచ్చితంగా శ్రామిక మేధస్సుకు పట్టిన సామాజిక నిర్లక్ష్యాన్ని ఈ క్రింది కవిత ద్వారా కళ్ళకు కట్టారు "ఎంత కోయిల పాట వృథయయ్యెనో కదా చిక్కు చీకటి వనసీమలందు, ఎన్ని వెన్నెల వాగు లింకిపోయెనో కదా కటిక కొండల మీద మిటకరించి, ఎన్ని కస్తూరి జింకలీడేరెనో కదా మురికి తిన్నెల మీద పరిమళించి, ఎన్ని ముత్తెపురాలు భిన్నమయ్యెనొ కదా పండిన వెదురు జొంపముల లోన, ఎంత గంధవహన మెంత తంగెటిజున్ను ఎంత రత్నకాంతి, యెంత శాంతి ప్రకృతి గర్భమందు! భగ్నమైపోయెనో పుటరాని చోట పుట్టుకతన...". ఈ కవిత ద్వారా మన సమాజపు కాలగర్భంలో కలిసిపోయిన శ్రామిక మేధస్సును, కృషిని అంచనా కట్టవచ్చు. కుల రక్కసి పాదాల క్రింద నలిగిపోయిన శ్రామిక మేధా తేజస్సును ఇప్పటికైనా బయటకి తియ్యవల్సిన భాద్యత ఉన్నది. అంతేకాకుండా ఏ సమాజానికైనా మూలం శ్రామికులని ఈ భౌతిక శ్రమలపై ఆధారపడే మానసిక శ్రమలు వర్ధిల్లుతాయని ఈ కవిత ద్వారా అంచనాకు రావచ్చు "వాని రెక్కల కష్టంబు లేనినాడు సస్యరమ పండి పులకింప సంశయించు వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు భోజనము బెట్టు వానికి భుక్తి లేదు, వాని తలమీదబులిమిన పంకిలమును గదిగి కరుణింపలేదయ్యె గగనగంగ వాని నైవేద్యమున నంటు వడినా నాడు మూడు మూర్తులకును గూడ గూడు లేదు, పామునకు బాలు, చీమకు బంచదార మేపుకొనుచున్న కర్మభూమి జనించు ప్రాక్తనం బైన ధర్మదేవతకు గూడ నులికిపడు జబ్బు గలదు వీడున్న చోట, వాని నుద్ధరించు భగవంతుడే లేడు మనుజుడెట్లు వాని గనికరించు వాడు జేసికొన్న పాపకారణమేమొ యింతవరకు వాని కెరుకలేదు, ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి యినుపగజ్జెల తల్లి జీవనము సేయు గసరి బుసకొట్టు నాతని గాలిసోక నాల్గు పడగల హైందవ నాగరాజు...". అలాగే ఈ కవిత భారతేదేశంలోని శ్రమలకు ఉన్న ప్రత్యేకాంశమైన అంటరానితనాన్ని, దాన్ని భావజాలాత్మక రూపాల్లో కొనసాగించే మత సంస్థల విషయాన్ని చూపిస్తూ శ్రమ యొక్క మూలంగా, పునాదిగా ప్రతీదీ చలామనీ అవుతుందని వివరించడం జరుగుతుంది. నిజానికి ఈ విశాలమైన చారిత్రక

అంచనాకు జాషువా రావడానికి ఆనాటి భారతదేశంలోకి ప్రవేశించిన ఆధునికతే కారణమైనదని గ్రహించాలి. అయితే సామాజిక మార్పును కాంక్షించే నేటి వాతావరణంలో జాషువాలాంటి శ్రామిక మేధావుల కృషిని పరిగణించకపోవడంలో నాల్గు పడగల హైందవ నాగరాజుల పాత్ర నేటికీ ఉన్నదనే చేదు నిజాన్ని కొట్టేసినా, కాదన్నా, కప్పిపుచ్చినా దాగనిది.

విషయత్వం

శుద్ధ అనుభవం కలంకరహిత హేతువాద దృక్పథానికి భిన్నమైన పార్శ్వాన్ని వ్యక్తం చేస్తుందనడంలో సందేహం లేదు కానీ అనుభవము మరీనూ శుద్ధ అనుభవమే సమస్త జ్ఞానానికి మూలంగా భావించడంలో పొరపాటు ఉంటుంది, అంతే కాకుండా కళంకరహిత హేతువాద దృక్పథం మాత్రమే సమస్త అవగాహనకు భూమిక అని చెప్పలేము, అంగీకరించలేము. కావున మానవ సమాజంలో ఈ రెండు అతివాదాల నుండి మద్యమవాదంగా చేతనా స్థితిని అంచనా కట్టాల్సిన అవసరం ఉంటుంది. అందుకే మానవుని యొక్క ఆచరణకు ఇచ్చే ప్రాధాన్యత, ప్రాముఖ్యతను దాని యొక్క శాస్త్రీయతను గ్రహించడంలో తప్పుడు తాత్త్వికతలు భూమికలుగా నిలవడాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంటుంది. ఈ గుర్తింపే నూతనమైన, ఉన్నతమైన శాస్త్రీయ తాత్త్వికతగా నిలుస్తుంది. కావున మానవుని ఆచరణ గ్రహింపుగా–మానవుని గ్రహింపు ఆచరణలుగా సాగుతాయి. అందుకే అనుభవం అనే భావాలు భావనలు కాలేవని అవి కచ్చితంగా అనుభవ ఆధారల జ్ఞానమని అవి కేవలం ఇంద్రియ కార్యకలాపాల భావరూపాలని అందునా అవి ఆయా వ్యక్తుల సామాజిక ప్రత్యేక రూపాల ప్రతిఫలనాలని గ్రహించవచ్చు, కానీ మానవుని ఆలోచనల నిర్మాణాత్మకత అనే

తార్కికత సైతం మానవుని ఆచరణ ఫలితమే కానైతే ఈ ఆచరణ యొక్క ప్రయోగం, పరిశ్రమల అనంతరం తిరిగి మానవ సామాజిక ప్రయోజనార్ధమైనప్పుడే అది సిద్ధాంతంగా రానివ్వగలదు, వ్యవహరించగలదు, అప్పుడే ఈ సిద్ధాంతం భావజాల రూపంలో మానవ సామాజిక అనుభవంగా ఉద్భవిస్తుంది. కావున ఈ భావజాలాత్మకతే కాల్పనికత రూపాలుగానూ వ్యవహరిస్తుంది కూడా. అందుకే వాస్తవికత సమస్యను పరిగణించినప్పుడు దాని ఆవశ్యక స్థితి నుండే అంచనావేయగలం లేదా దాని అవసరం సైతం ఉండదు, అస్థిత్వమే అవ్వదు. అస్థిత్వం అనే సమస్యను దృష్టిలో పెట్టుకుంటే అది వైవిధ్యపూరిత వస్తువుల పరివర్తనశీలమైన, ప్రభావశీలమైన క్రమపరిణామపు సాధారణ జనితంగా గుర్తించాలి. కానీ అస్థిత్వం సమస్యను అస్థిత్వవాద పూరిత అంచనాతో పరిశీలించడం ఒక పొరపాటు విధానం, అదొక స్వీయాత్మక భావవాదం. అందుకే వాస్తవికత గ్రహింపు సామాజిక అస్థిత్వపు ప్రతిబింబంగా ఉంటుంది, అదొక సామాజిక సామాన్య క్రమ రూపం. అంతేకానీ స్వీయాత్మకత రూపం అనే స్వతంత్ర ఉనికితోనే వాస్తవికతను గ్రహిస్తామనే వాదం శుద్ధ తప్పుగా నిలిస్తుంది. ఫలితంగా అనుభవాన్ని వాస్తవికతను ఒకదానికొకటి పోటీగా, ప్రత్యమ్నయంగా నిలబెట్టి చర్చించడం ఆధునికానంతరవాదం. ఇక ఈ సమస్య సాహిత్యపర భావజాలంలో అంటురోగంగా చలామని అవ్వడాన్ని చూడవచ్చు. ఈ సూక్ష విషయత్వాలను గ్రహించడంలోని లోపాలను సరిచేసుకోవడానికి కావాల్సిన సైద్ధాంతిక భూమికను భావాల తీవ్ర సంఘర్షణల నుండి రాబట్టాలి, అంతేకానీ తపస్సంపన్నత కలిగిన జన్మపరంపరతతో కూడిన అహంకారబరిత దోష పార్శ్వపు భారతీయా కట్టుబాట్ల భావజాలాత్మకతతో అణచివేతల ప్రక్రియల మేధస్సు నేటి కాలానికి పనికి రానిది, కావున వ్యర్ధప్రాయాసల తప్పుడు సిద్ధాంతాల చాటుమాటున తారుమారు తెలివి తేటల ఆచరణలకు గురై చేసే వాదాలు నిలబడని కాలంలో ఉన్నందున మనం సైద్ధాంతిక జాగృతి వహించాల్సిన అవసరం ఉంది. ఏమైనా ఈ కాలంలో సైద్ధాంతిక కృషి సంపూర్ణ ఆధిక్యతను సంతరించుకుంటేనే అణచివేతల, బానిస బతుకులనుండి విముక్తి సాధించుకోగలమని ఆలోచించాలి, ఆచరించాలి.

24

విద్యా దృక్పథం

ఒకానొక పాశ్చాత్య దార్శనికుడు శిక్షకుడికే శిక్షణ అవసరమని ప్రభోదించారు అంటే మానవులు తమ పరిస్థితులను, శిక్షణను తామే నిర్మించుకుంటారని ఐతే ఈ నిర్మాణం కేవలం వ్యక్తుల ఇచ్ఛానుసారం ఉండదని మానవుని సామాజిక సంబంధాల సమాహారపు ప్రతిఫలనమని గ్రహించాలి. ఐతే మానవుని సామాజిక సంబంధాలు ఉత్పత్తి సంబంధాల ప్రతిఫలనపు ఉపరితల నిర్మాణంతో కూడినదై సాగుతుందని శాస్త్రం ఐతే ఈ శాస్త్రం ఆధారంగానే విద్య అనేది కూడా ఉపరితలాంశముగా అది ఆ సామాజిక సంబంధాలను, పునాదియగు ఉత్పత్తి సంబంధాలను ప్రతిఫలిస్తూ పరస్పర ప్రభావశీలములుగా సాగుతాయి. నిజానికి ఈ విషయంలో ఏవిధమైన అభ్యంతరం తెలిపినా శాస్త్రీయమైన వ్యవహారం నుండి దూరమవడమని గమనించాలి. తామేదో శాస్త్రీయులమనే దృక్పథం నుండి ఈ విషయాన్ని ఇటీవల యాంత్రికవాదమని భావించేవారు లేకపోలేదు కూడా. కానైతే విద్యను గ్రహించడంలో, నేర్పించడంలో ఇప్పటివరకూ రెండు పద్ధతులు కలవని గుర్తించాలి, ప్రాచీన కాలం నుండీ విద్యని నేర్చుకోవడంలోని పద్ధతులు ఏమనగా గ్రీకుల సోఫిస్టు పద్ధతి అలాగే భారతీయుల ఉపనిషత్ పద్ధతిగా చెప్పుకోవాలి. సోఫిస్టు పద్ధతి అనేది జ్ఞానాన్ని, వాదనా పటిమను గురుదక్షిణను ఇచ్చుకుని గురువు

నుండి పొందడం. ఉపనిషథ్ పద్ధతి అనగా గురువు వద్ద ఆశీనుడై నేర్చుకునే విద్యగా చెప్పుకుంటాము. ఈ రెండు పద్ధతులే చారిత్రకంగా విద్యను నేర్పించడంలో అభివృద్ధికరమైన విధానంగా ముందుకు సాగాయి. సోఫిస్టు పద్ధతి అనేది చాలామేరకు నిర్దిష్టతలను ఖండిస్తూ స్వేచ్ఛా పద్ధతిలో తమ ఇచ్ఛాను విధానాన్ని తెలుసుకునే ప్రక్రియగా సాగింది, అందుకే ఒకరకంగా తమ కోరిక మేరకు విద్యను అందులోని శేఖలను ఎన్నుకుని నేర్చుకోవడం జరిగేది. ప్రతీదీ ప్రశ్నించబడాలి, మానవుడే అన్నింటికి కొలమానం సత్యం శాశ్వతం కాదు, సత్యం అనిత్యం శాశ్వతత్వం కలది ఈ ప్రపంచంలో ఏదీ లేదు అనే పునాదిగా డబ్బు కోసం తత్వం జీవం కోసం విజ్ఞానమని సోఫిస్టు విధానం సాగింది. ఇకపోతే ఉపనిషథ్ పద్ధతి భారతీయ తాత్త్విక సాంప్రదాయాలను భోదించే క్రమానుసారంగా చెప్పుకుంటాము. అయితే ఈ ఉపనిషథ్ పద్ధతిలో భోదించే విద్యకు సంబంధించిన విభిన్న తాత్త్విక శాఖలు ఆయా గురువు వద్ద నుండే నేర్చుకుంటూ పరంపరానుగతంగా కొనసాగించే విధానంగా చెప్పుకుంటాము. నిజానికి ఈ ఉపనిషథ్ పద్ధతి భారతీయ తాత్త్విక శాఖల అభివృద్ధికి కీలకమైన విధానాన్ని ఏర్పర్చించదనే చెప్పుకోవాలి. ఈ పద్ధతినే బౌద్ధం మరియూ వివిధ శాఖలు అభివృద్ధి చేసాయని చెప్పుకోవాలి కూడా. అయితే ఈ రకమైన పద్ధతులు ఆయా తాత్త్విక శాఖల అధి భౌతికవాద వ్యవస్థల మూలంగా పరిమితించబడటాన్ని గ్రహించవచ్చు. అందుకే పద్ధతిపై ఆయా వ్యవస్థల యాంత్రికవాద ఆధిపత్యం అభివృద్ధికి కుంటుగా మార్చాయి, అయితే అత్యంత గొప్ప చారిత్రక పరిణామ క్రమంలో అభివృద్ధి చెందిన ఈ పద్ధతులను పక్కకు నెట్టేసి కేవలం వ్యాపార లాభాపేక్ష నేపథ్యంగా విద్యను నేటి ఆధునిక సమాజం చూడడంతో తెట్టును పైకి తెచ్చుకునే ప్రక్రియకు నెట్టబడ్డాము. ఫలితంగా సృజనశీలమైన విద్యార్జనను లేదా విజ్ఞాణాన్ని పోటి, పరాయీకరణలతో దెబ్బతీయబడటం జరుగుతుంది. అంతేకాకుండా సమాయానుసార, సందర్భానుసారంగా, కాలానుసారంగా అభివృద్ధి చెందే జ్ఞాణాన్ని గ్రహించకుండా పిడివాద పద్ధతిలో ఆచరించేట్లు చేసే విధానం భవిష్యత్తు తరాలనే నాశనం చేస్తుంది. కావున ఏ విద్యనైనా ఏ దృక్పథంలో భోదిస్తున్నాము ఏ పద్ధతిలో నేర్పిస్తున్నామనేవే శాస్త్రీయ, చర్చకు ఆధారమవుతాయని గ్రహించాలి.

26

రామ రాజకీయం

రామ అనే శబ్దార్థం వాస్తవానికి రమించడం అని రమింపచేసేవాడు అని అర్థం, నిజానికి రామ అనే శబ్దం ఈజిప్టు రాజైన రామ్సెస్–2 నుండి వచ్చిందని, రామ్సెస్–2 అనే వ్యక్తి 'రా' వంశస్తుడని, 'రా' అంటే సూర్యుడని, రామ్సెస్ అనగా సూర్యుడి కుమారుడని ప్రచారం, రామ్సెస్–2 హిటైటీస్ తెగల నాయకుడైన హత్తుసిల్లి రెండుతో తలపడటాన్ని చారిత్రకంగా చెప్పుకుంటారు. ఈ రామ్సెస్ అనే వ్యక్తి ఒంటి చేత్తో లక్షల మంది శత్రు సైన్యాలను నాశనం చేసాడని ఇందుకు బ్యాబూన్ కోతుల సహాయం అందినదని, ఈ రోజుకూ ఈజిప్టులోని రామ్సెస్–2 గుడిలో దర్శనమిచ్చే రాతిపై చెక్కిన కథలను, శిల్పాలను చూడవచ్చు. అంతేకాకుండా గ్రీకుల ఇలియడ్ మాహా కావ్యపు కథా వస్తువులో గ్రీకుల రాకుమారిని ట్రాయ్ నగరపు రాజకుమారుడు వలపించి ట్రాయ్ నగరానికి తీసుకు వెళ్ళి సహజీవనం సాగించడాన్ని, దీన్ని వ్యతిరేకిస్తూ గ్రీకు వీరులు ట్రాయ్ నగరంపై దండెత్తడాన్ని చూడవచ్చు. అలాగే బైబిల్ కథలోను అబ్రహాము భార్యను ఫెరో అపహరిస్తే విడిపించుకు వచ్చే సన్నివేశాన్ని చూడవచ్చు. ఇలా రామాయణ కథకు వస్తువులను బాహ్యంగా మనకు గోచరించడం జరుగుతుంది. కావున రాముడు భారతీయుడు కాదని, నేపాలీయుడు అని లేదా ఈజిప్షియన్ అని

చెప్పుకుంటుంటారు, కానీ ఛాందస్సులు తమ భావజాల పరిధిలో రాముడు భారతీయుడని వాదిస్తుంటారు. అయితే ఈ వాదనలో రామ జన్మ భూమిని చూపడంలో లేదా రామ సేతును చూపడంలో తలమునకలై సాగుతుండటాన్ని గమనించవచ్చు. కానీ రామ జన్మభూమి అనేది(అయోధ్య) బౌద్ధ భూమి అనే ఆధారాలు, శిధిలాలు సైతం మనకు గోచరించడాన్ని చూడవచ్చు, కానీ రామ జన్మభూమిగా అయోధ్య అనేది రాజకీయపరమైన ఎత్తుగడలో భాగమని గ్రహించవచ్చు కూడా. అయితే మానవ జ్ఞాన ప్రమాణాలను పరిగణించి సత్యం విషయమై వాదించడంలో భాగమవ్వాల్సిన అవసరం ఉంటుంది. ఇక మానవుని జ్ఞాణ ప్రమాణాలు ఏమనగా ప్రత్యక్ష అనుమాన, ఉపమాన, శబ్ధ, అర్ధాపత్తి, అనుపలబ్ధులుగా చెప్పుకోవాలి. ఈ ప్రమాణాలలో శబ్ధ ప్రమాణంగా వేదాల నుండి ఇతిహాసాల వరకూ పరిగణించి చర్చించడమే మనకు శ్రేయస్కారంగా ఉండగలదే కానీ ప్రత్యక్షంగానో, అనుమాన ప్రమాణంగానో చర్చను సాగించడం శాస్త్రీయమనిపించుకోదు కూడా, ఏందుకంటే శబ్ధ ప్రమాణం అనేది ఏ సాహిత్యానైనా ఆయా స్థల-కాలల విషయంగా పరిగణిస్తుంది, పరిగణించాలని వాదిస్తుంది. అయితే శబ్ధ ప్రమాణం అనేది ప్రత్యక్ష-అనుమాన ప్రమానాలను రుజువు చేయ ప్రయత్నిస్తుంది కూడా, ఐతే రుజువు చేసే శాస్త్రీయాంశాలలో గత కాలపు అధిభౌతిక పద్ధతిని అనుసరించకుండా ఆధునిక గతితార్కిక పద్ధతిని అనుసరించడంతో అనివార్యంగా ప్రత్యక్ష-అనుమాన మొదలైన ప్రమాణాల వాస్తవ భేదాన్ని, సత్యాన్ని కలిగిస్తుంది. కావున శబ్ధ ప్రమానార్ధంలో రామాయణం భారతీయ సాంప్రదాయ, తాత్వికపరమైన సార ప్రతిఫలనమని, భారతీయ స్థల-కాల పరిధిలో, పరిమితిలో భారతీయత సాధించిన ఇతిహాసంగా చెప్పుకోవాలి. అయితే రామ రాజ్యం అనేది మోనార్కి లేదా టిరానీ అనగా రాజ్యం కేవలం ఒకరు పరిపాలించడంగా చలామనీ అవ్వడం, భారత దేశంలో కేంద్రీకృత నిరంకుశ రాజ్యాలుగా ఉన్న కాలపు రాజ్యంగా రామ రాజ్యాన్ని అర్ధం చేసుకోవాలి, అయితే ఈ మోనార్కిని లేదా టిరానీని ఆధునిక ప్రజాస్వామ్యం అని చెప్పుకునే సందర్భంలో ఇమడ్చాలనుకోవడం నిజానికి నిరంకుశత్వ లేదా నియంతృత్వ పాలనను తీసుకు రాగల ఎజెండాగా సాగుతుంది, అందుకు రాముడు అధినాయక పాత్రను సైతం కలిగి ఉండటాన్ని గమనించవచ్చు, ఫలితంగా ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ పునాది ప్రతిఫలనంగా ఫాసిస్టు రూపంగా అవతరిస్తుంది, అవతరించాలనే

ఎజెండా కూడా నేటి భారతీయ రాజకీయ తలంలో భాగస్వామ్యము కూడా. ఐతే రామ రాజ్యంలో ప్రజలకు భూమి పంపకం, నీటిపారుదల సక్రమతను కలిగియుండటం, వ్యవసాయం సమృద్ధికై కృషి, ఆస్థి తగాదాలు జరగకుండా చూడటం, పన్నులు ప్రజలపై భారం కాకుండా విధించడం, పన్నులు ప్రజలకే కర్చుచేయడం, శాసనాలు ప్రజలకు వ్యతిరేఖంగా ఉండకుండటం, ప్రజల వద్ద నుండి పరిపాలనపై భిన్న అభిప్రాయాలను తెలుసుకుని సరి చేసుకుని పాలించడం, ధన–రాజ్య వ్యమోహం లేకుండా పురుషార్ధములు సత్య ఆధార పాలనగా సాగడం మొదలైన పాలక ప్రజాస్వామ్య అభ్యుదయాన్ని రామాయణం నుండి నేర్చుకోవాల్సిన కనీస అవసరం నేటికీ ఇంకా మన భారత పాలకులపై ఉందనేది దాగని నిజం. కావున రాముని జన్మ భూమి కన్నా ఇతిహాసంలో అతని అభ్యుదయ పాలనను అనుసరించడంలో పోటీపడాల్సిన నేటి స్థితిని కలిగియున్నాము.

అస్తి - నాస్తి

మానవుడు ప్రత్యక్ష కార్యాచరణలోనూ, ప్రయోగంలోనూ, వాదవివాదాలలోనూ, పరిశ్రమలోనూ భాగం కాకుండా ముందుకు సాగలేడు లేదంటే తను అక్కడిక్కడే కుదించబడతాడు. మానవుడు తగిన పరిస్థితులల్లో కొన్ని సంబంధాలు, నియమాలు, ధర్మాలనేవి క్రితం క్షణం ఉండి శాశ్వతంగా విలుప్తం అవుతాయి. ఐతే మానవుని హేతుబద్ధత అనేది కేవలం ప్రధానాంశాన్నే కాకుండా అప్రధానాంశాన్ని సైతం ప్రతిబింబిస్తుంది, ఐతే ప్రధానంశం ప్రతిబింబించడం కచ్చితంగా అప్రధానంశం క్రితం క్షణం వరకూ ఉండి శాశ్వతంగా విలుప్తమవుతుంది. ఇక అస్తిత్వంలో ఉన్న ప్రతీదీ వాస్తవమవ్వదు. ఎందుకంటే వస్తువుగానీ, ఘటణ కానీ ఉత్పన్నం కావడానికి క్రితం క్షణం వుండి శాశ్వతంగా విలుప్తం అవుతుంది, ఇదే ఆవశ్యకత ఈ ఆవశ్యకతే వాస్తవికతగా మారుతుంది. హేతు ప్రత్యయాలు ఉన్నప్పుడు ఉండి లేనప్పుడు ఉండనిది అనే అంశాన్నే ఆవశ్యకతగా చెప్పవచ్చు, అయితే హేతు ప్రత్యయాలు ఉన్నప్పుడు ఉండేది ఒక వస్తువు లేదా వాస్తవికత అనేది దానికదిగా ఉండదు, అనగా ఏదైనా ఒక వస్తువును తీసుకుంటే అది స్వతహాగా అస్తిత్వం కలిగియుండదు అంటే ఏదీ స్వతఃసిద్ధత కలిగినదియైయుండదు, అంతేకాకుండా ఏ వస్తువైనా ఉండటానికి హేతు ప్రత్యయాలు

ఉండాలి. అందుకే హేతు ప్రత్యయాలు ఉండి అది లేనప్పుడు ఉండకపోవడమే కాకుండా అదిగా ఆ వస్తువుగా అది ఉండదు అందుకే ఉన్నది-లేదు లేదా అస్తి-నాస్తి స్థితి. అయితే పాశ్చాత్య తాత్త్వికులు అస్తి-నాస్తి స్థితికి ప్రత్యమ్నాయంగా సంభవించడాన్ని ముందుకు తేవడాన్ని గుర్తించవచ్చు. అయితే భారతీయులు అస్తి-నాస్తి అనేదే ఒక ప్రక్రియగా నాస్తి-దృవీకరణల చలామణులుగా పరిగణించాల్సిన అవసరం ఉంటుంది. ఏకకాలంలో నాస్తి ఏకకాలంలో అస్తిగా పరిగణన. మానవ కార్యాచరణ/కార్యకలాపమే నిజానికి వస్తువు, వాస్తవికతగా గ్రహించాలి. వాస్తవమైనది ప్రతీదీ హేతుబద్ధమైనది, హేతుబద్ధమైన ప్రతీదీ వాస్తవమైనదని హెగెల్ సూత్రీకరణ ఐతే వాస్తవికత అనేది మానవుని ఆచరణగా గ్రహించాలి. హేతుబద్ధత కూడా మానవుని ఆచరణే. వాస్తవికత అనేది అస్తిత్వంలో ఉన్న ప్రతీదీ కాదు నిజానికి ఆవశ్యకత అనే లక్షణాన్ని కలిగియున్నదే వాస్తవం అవుతున్నది, వివరంగా చెప్పుకుంటే ఆవశ్యకత అనేది తగిన పరిస్థితులల్లో కొన్ని సంబంధాలు, ధర్మాలు, నియమాలుగా వాటికవే కొన్ని కారణాలు వాటి స్వభావం చేత మాత్రమే ప్రభావితమయ్యే కొన్ని సంబంధాలు ధర్మాలుగా తగిన పరిస్థితులల్లో వస్తువులు, పరిణామాల సారంగా ఆవిర్భవిస్తుంది. అందుకే వాస్తవం ఆవశ్యకంగా నిరూపితమవుతూ గర్భిత స్థితి యధార్థంగా నిరూపితమవుతుంది. ఇక సామాజిక అస్తిత్వం మానవ ఆచరణ కావున అది ఒకే సమయంలో అది కానటువంటిదై అనగా నాస్తి-అస్తిగా సాగుతుంది. కావున మానవ కార్యాచరణ ప్రతిఫలనం వాస్తవికత మరియూ హేతుబద్ధతలుగా ఉంటాయి, అయితే వాస్తవమనేది మానవ ఆచరణగా ఆవశ్యకత ద్వారా వ్యక్తం కాబడుతుంది ఫలితంగా హేతుబద్దమైయుంటుంది, హేతుబద్ధతనేది మానవ ఆచరణ ఫలితంగా ఆవశ్యకమై వాస్తవికత అవుతుంది. మనం ఉదాహరణగా గుడ్డు పిల్లగా మారడమనేది ఆవశ్యకత ఫలితపు వాస్తవికత, గుడ్డును తినడంగా మారడమనేది ఆవశ్యకత ఫలితపు వాస్తవికత కావున అందుకే వాస్తవికత అనేది ఏంటి? అనే దాని బట్టి ఆవశ్యకత ఏమిటో గ్రహించవచ్చు. గుడ్డు అనేది వాస్తవికత, గుడ్డు పిల్లగా మారడం వాస్తవికత కానైతే ఈ ప్రక్రియ విచ్ఛిన్న ప్రక్రియగా, అది అదే సమయంలో అస్తిగా-నాస్తిగా సాగుతుంది.

28

కవిత్వ సంప్రదానము

కవిత్వంపై చర్చను సాగించడం అనే ప్రక్రియ నిజానికి కష్టమైనదిగా ప్రాచుర్యం పొందింది. ఐతే కష్టమైనదని లేదా తేలికైనదిగా చెప్పుకుంటే అది చర్చ చేసే వ్యక్తి తాలుకు విషయ స్పష్టతలోని లోపంగా చెప్పుకోవాలి. కానీ కవిత్వాన్ని గత కాలాల నుండి విశ్లేషించినా లేదా వర్తమానం నుండి విశ్లేషించినా జరగవలసిన తాత్త్విక సైద్ధాంతీకరణ మన ముందు మిగిలే ఉంటుంది. భాష పుట్టుకను దైవీకరించడం నుండి ప్రారంభించినా అదొక భావవాద పూరిత ప్రాధాన్యత కలిగిన విషయంగా మారుతుందే కానీ శాస్త్రీయమని పించుకోదు. ఐతే శాస్త్రీయత అనే ప్రక్రియ కవిత్వంపై సాగుతుందా అని మరికొందరు భావించినా యాంత్రికవాద భౌతికవాద నేపథ్యంగా చర్చించగలమని అందునా కేవల యాంత్రిక దృక్పథమే అమలయ్యే కాలంతో ఉన్నతిని చేరుకుంటుంది కూడా అని గ్రహించగలము, కానైతే దీనిపై ఉన్నతమైన నియమాలతో(గతితార్కికం) యాంత్రికతపై విజయోత్సవ స్థితిని తీసుకురావడం జరుగుతుంది. ఏమైనా అనుభవాద నేపథ్యంగా కవిత్వాన్ని పరిగణించడం నిజానికి కాదనలేని విషయమే అయినా ఈ అనుభవం మానవుని మెదడు యొక్క భావరూపాల శక్తులని, ఇవి కాదనలేని మానవ సామాజిక ఆచరణ అని గ్రహించాలి. అయితే అనుభవమే కేవల మానవ ఆచరణ కాదు మానవ ఆచరణ

అనేది ఒక సంక్లిష్టపూరితాంశముగా పరిగణించవచ్చు, అది దానికదే వస్తుగతమైనది, అది భావాత్మక విషయంగా వ్యక్తమైయ్యే వస్తుగతమైన ప్రత్యేకాంశము. అందుకే ఒక సంక్లిష్టత కలిగిన స్వభావంగా చెప్పుకోవాలి. ఐతే ఈ భావాత్మకత అనేది ఒక క్రమపరిణామ, నిర్మాణాత్మక చైతన్యయుత స్థితిగా, ఒక తార్కిక సామాన్య సాధారణ విషయంగా చెప్పవచ్చు. ఇది ఆచరణ యొక్క అనురూపంగానే ఉంటుంది. అందుకే అది ఆయా కాల పరిస్థితుల భూమికగా సాగుతుంది కూడా. వ్యక్తి తాలుకు ఇంద్రియ కార్యకలాపము మరియూ అతని ఆలోచనా కార్యకలాపము అనేవి వాటికవిగా వస్తుగతమైనవిగా ప్రస్థావించినా ఈ సంక్లిష్టత కచ్చితమైన సామాజిక నిర్మాణంలో వ్యక్తమవ్వడం అందునా ఈ సామాజిక సంబంధాల వస్తుగత నిర్మాణమే వ్యక్తి తాలుకు వస్తుగతాన్ని నడిపిస్తాయి, నిర్ధేశిస్తాయి కూడా అని గ్రహించాల్సి ఉంటుంది. అందుకే కవిత్వమనే భావజాల ప్రక్రియ, నిజానికి కవిత్వం వాస్తవికతకు వైయక్తిక తారుమారు, తలక్రిందుల ప్రక్రియగా చెప్పుకుంటాము, అయితే ఈ ప్రక్రియలో సామాజిక సంబంధాల వస్తుగతాన్ని వ్యక్తి ఏమేరకు ప్రతిఫలిస్తాడో అతడు సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా లేదా సామాజిక సంబంధాలలోని వ్యక్తి తాలుకు వస్తుగతాన్ని పరిశీలించడంలో అతని పరిధిని ఒకానొక సామాజిక ప్రత్యేక రూపంగా పరిగనించడం, ఐతే ఏ రూపమైనా అది సామాజిక ఆచరణ ఫలితంగా చెప్పాల్సిన, గ్రహించాల్సిన కర్తవ్యం మన ముందు ఉంటుంది కూడా. అందుకే మానవ ఆచరణల సామాన్య ఆచరణ మరియూ ప్రత్యేక లేదా విశిష్ట ఆచరణల పార్శ్వాల వైరుధ్యపు సాధారణాన్ని గ్రహించి, గుర్తించి చర్చను సాగించాలి. ఇకపోతే ఈ నేపథ్యం నుండే భారతీయ సాంప్రదాయంలో కవిత్వ పరిశీలనను వేదాల నుండి భావించడం జరుగుతుంది కూడా, ఐతే వేదాల ప్రమాణాలలో వేద తత్త్వం తెలుసుకోవాల్శిన, నేర్చుకోవాల్సిన జ్ఞాణమని వేదం సుజ్ఞాణం, వేదం స్మర్తం, ద్రష్టము అని వాదన, అందుకే భారతీయత తాలుకు కవిత్వ వ్యవహారాన్ని వేదం నుండి చర్చించాల్సిన అవసరం ఉంటుందనడంలో పొరపాటు లేదు కూడా, కానీ వేద తత్త్వం ప్రామానికమని గ్రహించాలి. వేదాన్ని పరిశీలించే విధానం కీలకం, వేదాన్ని దృక్పథంగా అభివృద్ధి పరుచుకోవడం విధానం అవుతుంది. ఫలితంగా వేదంలోని కవిత్వ నిర్మాణాన్ని అంచనా కట్టవచ్చు. వేద విధానమే పరిశీలనకు-దృక్పథంకు కీలకం. వేద విధానం అనే మహత్తర

కర్తవ్యాన్ని మన భారతీయ దర్శనాలల్లో మిమాంస అనే శాఖలో పూర్వ మిమాంస దర్శించింది. నిజానికి వేదం అనాది–అనంతమని–సృష్టికర్తలు లేరని ఈ దర్శనం స్పష్టపరుస్తుంది. వేదం కర్మ జ్ఞాణంగా భావిస్తూ వస్తుంటారు. కావున వేదపు జ్ఞాణం తాత్త్వికత అనే అంశాలకు సరిపడదని, కేవలం కర్మ జ్ఞాణమునే దాని ముఖ్య తత్త్వంగా వివరించడం జరిగింది. ఐతే వేదాలు క్రతువుల సారం మాత్రమే కావు, జ్ఞానాన్ని తాత్వికతను తనలో ఇముడ్చుకునే కర్మ జ్ఞాణంగా చలామణి అవుతుంది. కర్మ జ్ఞాణాన్ని తాత్వికతను వ్యక్తం చేస్తూ ఉంటుంది. పూర్వ మిమాంస విధి, ప్రతిషేదం, మంత్రం, అర్థవాదం, నామధేయములతో కూడి యున్నది. అనగా వేదంలో వీటిని ముఖ్య అంశాలుగా పరిశీలిస్తుంది. వేదవిధి వేదములకు వేదమైయున్నది, విధిని మనం కర్తవ్యం, సంస్కరించ లేనటువంటి భాధ్యతగా చెప్పుకోవచ్చు అయితే వేద విధి కూడా దీనికి మినహాయింపు కాదు. అందుకే విధిని తప్పించలేని కర్మగా మార్చలేనటువంటి కర్మగా చెప్పుకోవచ్చు. నిజానికి ఈ నిర్వచనం ద్వారానే వేదానికి అపౌరుషేయములు అని అనడానికి ఆస్కారం ఉంటుందని భావించి వాదించారు. విధి రెండు విధములైన కర్మను చర్చిస్తుంది. ఒకటి ప్రధాన కర్మ, రెండు అంగ కర్మ. కర్మ ఫలాపేక్షమైయున్నది, ఐతే విధిని నిర్వహించే కర్మ ఫలాపేక్షరహితము. ప్రధాన కర్మ విధి యొక్క విధాన కర్మ ద్వారా ఫలాపేక్షను పొందడం అనగా యజ్ఞం ద్వారా ఫలాపేక్షను పొందడం. మరి అంగ కర్మ అనగా క్రతువుల నిర్వాహన, అందుకే విధిని నిర్వహించే ఫలాపేక్ష రహితము. నిజానికి కర్మ ఫలాపేక్షము మాత్రమే కాదు. అది కామ్య కర్మములని పండితుల వివరణ. కామ్య కర్మలు కోర్కెలకు సంబంధించినవని గ్రహించాలి. కావున ఫలాపేక్షము, అంతర్లీనం. వేదప్రతిషేదం అనేవి విధి యొక్క తత్వమనే మనం గ్రహించాలి. ఒకటి మనం విధిని అధిగమించకూడని షరతు. కేవలం యజ్ఞమునకు సంబంధించినదే కాకుండా ప్రతిషేదం వ్యక్తి, సమాజపు చెడుగులను ప్రతిషేదించడం అనేది వేదము దాని యొక్క విధి ద్వారా సాధ్యమని తెలుపుతుంది. అందుకే విధికి ఆదేశము అను నిర్వచనం, వేదమంత్రం వేదములకు మూలం, పునాది మంత్ర బలం. ఈ మంత్రాలని ఋక్కులు అని సంబోదించాలని, ఆధునికంగా కవితలని వ్యవహారిస్తే జరిగే తప్పేమిటంటే ఋక్కులు యజ్ఞ సంబంధితాలు కావున కవితలు అలా కావని. వేదానికే ప్రత్యేకముగా ఉన్నటువంటి రూపము

ఋక్కులని, అందుకే అవి వేదాల విధి సంబంధితాలని భావించారు. వాటిని కర్మకు దూరంగా భావవాదంలో ఇమడ్చలేమని వాదన. కర్మానుష్టానంగా ఉండేవి మంత్రములు, కర్మముల నిర్వచనం, అర్థం, వ్యవహారం మంత్రము. ఫలాపేక్ష కర్మములకు మంత్రములు ఎంత ఆధారమో, జ్ఞాన, తత్త్వములకు సైతమూ మంత్రములు ఆధారము. అయితే వేదంలోని మంత్ర భాగాన్ని సంహితలని వీటి తరువాత బ్రాహ్మణాలు, అరణ్యకాలు వచనాలని వ్యవహరించడం శాస్త్రాము. వాస్తవానికి సంహితాల కొనసాగింపు బ్రహ్మణాలు, అరణ్యకాలు అవుతాయే కానీ, వీటికి భిన్నంగా మంత్రాలు దీనికి భిన్నంగా బ్రహ్మణాలు, అరణ్యకాలు ఉండవు, వీటి మధ్య ఏకత్వం, గుణాత్మకం స్వీకరయోజనము. కొందరు పండితులు కేవలం మంత్ర పాటాన్నే వేదంగా భావించారు. కానీ కొందరు మంత్ర బ్రహ్మణాలను వేదంగా గుర్తించాలని వాదించారు. వేద అర్థం, వేదార్థవాదం అనే అంశం పురుషార్థములకు సంబంధించినదిగా, అంతేకాకుండా అర్థాన్ని అంటే వేదం యొక్క ప్రయౌజనం, ఫలితముల గురించిన వివరణగా అర్థం చెప్పుకోవచ్చు. ఏమైనప్పటికీ అర్థం ఈ రెండు నిర్వచనాల మాలగా అవగాహన పరుచుకోవాలి. నామధేయం అనేది ఋషివర్యులే కాకుండా వేదపు దివ్యశక్తులను గురించిన అవగాహన, వివరణలకు సంబంధించినదిగా చెప్పుకొచ్చారు. వేదంలోని నామదేయము పవిత్రములు శక్తుల సమాహారంగా భావించాలని శాస్త్రము. ఐతే ఋషివర్యులు వ్యక్తులు కాదని పూర్వమిమాంస పేర్కుంటుంది, అవి దర్శన తత్త్వాలుగా అర్థం చేసుకోవాలని వివరణ. వేదములు మానవ సమాజపు నిత్య కర్మలు, నైమిత్తిక కర్మలు, కామ్య కర్మలకు సంబంధించిన అంశాలను పరిశీలించడం–వాటికై యజ్ఞ యాజ్ఞాది కర్మములను ఆదేశించడాన్ని గమనించగలము. కావున వేదం భారతీయుల నైతిక–జ్ఞాన సంబంధిత అంశాలలో నరనరాన జీర్ణించుకుపోయిందనే వాదన వాస్తవమని చెప్పుకుంటారు. ఐతే మనం పరిశీలించాల్సిన ముఖ్యత ఏమంటే వేదాన్ని పాశ్చాత్యులు పరిశీలించినప్పుడు వారి అధిబౌతికవాదం ప్రధానంగా ప్రభావం వహించింది. ఫలితంగా వేదమంత్రాలు వాటి గుణ రూప స్వభావాలని విడివిడి ముక్కలుగా భావించారు, అయితే వైవిధ్యంలోని ఏకత్వాన్ని విస్మరించి మనల్ని అజ్ఞానులుగా చిత్రికరించారు కూడా. నిజానికి భారతదేశంలోని ప్రతీ దర్శన శాఖ–తత్త్వం వేద ప్రామాణ్యాన్ని అంగీకరించింది భావవాద శాఖలే కాకుండా, కొన్ని భౌతికవాద

శాఖలు సైతం అంగీకరించాయని గమనించాలి. ఎందుకంటే వేదము యొక్క వేద తత్త్వం దాని విధాన నిర్మాణమే దానికి అంత ప్రాముఖ్యాన్ని కలిగించగలిగిందే కానీ కొందరు వాదిస్తున్నట్లు మత మౌఢ్యం, అజ్ఞాణం కాదనే చర్చ కూడా ఉన్నది. వేద తత్త్వం ప్రధానంపై ఆధారపడి నిర్మితమైయున్నది, ఆ ప్రధానం వేదం యొక్క మౌళికాంశాలను వివరించడం-కొనసాగించడం ముఖ్యముగా ఉన్నది, అంతయూ ప్రధానం, ప్రధానమే సాపేక్షం. ప్రధానమే విభిన్న రూపాలుగా పరివర్తన చెందుతుంది. ప్రధానం ఆధారం-ప్రధానం వ్యవహారం-ప్రధానం చలనం, పరమము. ప్రధానమే జ్ఞాయం, జ్ఞాత, జ్ఞాణం, ప్రధానం వేదము ఉద్దేశాన్ని తెలుపుతుంది. ఆ ప్రధానం పురుషార్థములు. పురుషార్థములే వేద ప్రధానం. ధర్మ, అర్థ, కామ, మోక్ష పురుషార్థములే వేదానికి ప్రధానం. వేదం ధర్మార్థ కామమోక్షార్థాలను సాధించేవిగా ఉంటుంది. ఈ సాధనను ప్రధాన కర్మగా చెప్పుకోవాలి. ఫలితార్థ కర్మకు ధర్మార్థకామమోక్షార్థాలు ప్రధానం అవుతాయి. ఇవి పూర్తిగా మానవ కామ్యాలు. ఈ కామ్య పురుషార్థ తత్త్వమే. కామ్యమనగా కోర్కెలు. మానవుల కోర్కెలు పురుషార్థపు తత్త్వము. కామ్యములనగా కోర్కెలు కావున మానవుల కోర్కెలు ముఖ్యంగా తిండి, గూడు, గూడ్డ, సంతాన వృద్ధి, శత్రు రాహిత్యత, ఆపద రాహిత్యత జ్ఞానం/బుద్ధి ముఖ్యము. వీటి సాధనకై ఆధారపడిన కారణాలను గుర్తించడం వాటిని తమ కారణాలకార్యాన్ని ఆటంకరహితంగా ప్రదర్శించడంకై కారణాలను, ఈ కారణాలను ఈ కారణాలకూ మూలమైన స్వరూపాన్ని ప్రసన్నం చేసుకోవడం వారికి హవిస్సులు అర్పించడంతో క్రమం విచ్ఛిన్నం కాకుండా సాగాలని ప్రయత్నించడం ముఖ్యము. తమ యొక్క నిత్య కర్మలు సుసంపన్నంగా, సమృద్ధిగా ఉండాలని, ఆటంకరహితంగా సాగాలని తపించడం. అంతేకాకుండా నైమిత్తిక కర్మలు అనగా అసందర్భం, అసమయం-ఎరుకరాహిత్యంలో ఎదురుకునే సందర్భాలలో వ్యవహరించే విధానంలో ఆటంకము, ఆపదరాహిత్యంగా ఉంటుంది కూడా అని గ్రహించాలి. అయితే భారతీయ కవిత్వ ప్రక్రియ అనేది వేదంలో సాగడాన్ని కాదనలేము అయితే వేదం యొక్క కవిత్వ ప్రక్రియ కేవలం కవిత్వం అనే స్థితిలో పరిమితం చేయలేము కూడా అనే వాదనలు సాగుతున్నాయి కూడా. ఐతే వేదాల నుండి సంపూర్ణ తాత్త్విక పరమైన దశకు ఉపనిషథ్ చర్చను గమనించాలి. అయితే ఉపనిషథ్ ల కొనసాగింపుగా భౌతికవాదపరమైన

చర్చలో భారతీయ సాంప్రదాయంలో గంభీరమైన తాత్త్విక చర్చను పట్టుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఈ ప్రక్రియలో కవిత్వం యొక్క స్థితిని తలంలో ఒక ప్రధాన చర్చగా నమోదు కాలేదని చెప్పుకోవచ్చు. అయితే ఈ ఉపనిషథ్ దశ అనంతరం భారత దేశంలో తాత్త్విక చర్చల దశగా సాంఖ్యం అలాగే యోగం ప్రధాన పాత్రలను వహించాయి అయితే ఈ సాంఖ్యపు సత్కార్యవాదాన్ని విమర్శించి విచ్ఛిన్నవాదం అనగా ప్రతిత్య సముద్పన్నాన్ని బౌద్ధులు అభివృద్ధి పరిచారు, అలాగే జైనుల స్యాధ్వాదం తాత్త్విక-తార్కిక చర్చను భారతీయ సాంస్కృతిక వికాస సంపూర్ణ దశకు అభివృద్ధికావించారు, అంతేకాకుండా న్యాయ-వైశేషికాల భౌతికవాద అభివృద్ధి గెంతుగా సాగిన వాతావరణాన్ని గ్రహించాలి. ఇంతటి ప్రక్రియలో కవిత్వం కేవలం సూక్ష్మ రూపంలో భాగమవ్వడాన్ని గ్రహిస్తే, బ్రహ్మ సూత్రాల నేపథ్యంగా ఉపనిషథ్స్ యొక్క సారాన్ని దాని యొక్క అవిచ్ఛిన్న చలనాన్ని నిలబెట్టడాన్ని గ్రహించవచ్చు. అయితే 70 రకాల తాత్త్విక వాదల ఖండన నుండి ప్రారంభమై అవిచ్ఛిన్న-విచ్ఛిన్న ప్రవాహ తాత్త్విక పరంపరలో భాగంగా అవిచ్ఛిన్న-విచ్ఛిన్నల వివిధ తాత్త్వికతల సమన్వయాత్మకగా అద్వైతం-విశిష్టాద్వైతం-ద్వైతాల తాత్త్విక పరంపర ప్రారంభమైనది. ఈ సమన్వయాత్మక పరంపర నుండి కవిత్వం తలంలో స్థూల భాగస్వామ్యంగా ముందుకు రావడాన్ని గ్రహించాలి. అయితే ఈ కవిత్వం యొక్క విశేషం అది ఒక సంపూర్ణ ఏకేశ్వరోపాసన రూపంలో వ్యక్తమవ్వడం అదీనూ ఉత్తర మీమాంసగా దాని యొక్క శూన్యం లేదా మాయ యొక్క కేంద్రంగా కవిత్వం రావడంతో పాటుగా కవిత్వంలో సాంఖ్యం మరియూ యోగంలోని తాత్త్విక వ్యక్తి యొక్క నిర్వచనార్ధ మూలలోని అంతర్గతాన్ని అన్వేషించే ప్రక్రియగా, బహిరంగపరిచేదిగా సాగింది. కవిత్వం సామాజిక ఆచరణగా ప్రతిఫలించే ప్రక్రియగా నిరంతరం ముందుకు సాగింది కూడా, కానీ అది ఖచ్చితమైన తాత్త్విక నేపథ్యం మరియు సాంఘిక కట్టుబాట్లను ప్రతిఫలిస్తూ సాగింది. కావున భౌతికవాద ప్రాతిపదిక భావవాద రూపంలోని ఐక్యతల నడుమ కొనసాగిన విధానాన్ని కలిగినదై సంతరించుకుంది. అటుపిమ్మట సాంఘిక మార్పులో భాగంగా కవిత్వం మార్పుల యొక్క బీజాన్ని ప్రతిఫలించడాన్ని గమనించాలి, అయితే ఈ ప్రతిఫలనం అనివార్యంగా మార్పును ప్రతిఫలించడమే కానీ మార్పును ఊహించిన ప్రక్రియగా సాగలేదు ఇందుకు గల కారణం అనివార్యంగా కవిత్వం యొక్క పరిధి, పరిమితిని చూడాలి

(తారుమారు ప్రతిఫలనం). అందుకే ఆయా స్థల-కాలాలలో అభ్యుదయంగా అలాగే ఛాందసంగా వ్యక్తమయింది. కానైతే ఆధునికత ప్రవేశించిన పిమ్మట కవిత్వం యొక్క అభ్యుదయం ఒక రూపంగా అలాగే ఛాందసం ఒక రూపంగా వైరుధ్యంతో బాహ్యంగా ఒక సామాన్య రూపంగా ఏర్పడటాన్ని గమనించవచ్చు, ఈ ఆధునికత అనివార్యంగా సమిష్టి-వ్యష్టిలను ఏర్పర్చడాన్ని చూస్తాము. అయితే ఈ ఆధునికత ఫలితంగా ఉత్పత్తి శక్తుల మరియూ ఉత్పత్తి సంబంధాల వైరుధ్యం నుండి ఒక ప్రక్క భారతీయ సాంప్రదాయాలు కఠినమైన నేపథ్యం మరొక ప్రక్క విప్లవాత్మక నేపథ్యం అనివార్యంగా గోచరించడాన్ని పరిశీలించగలము. ఈ అనివార్యం నుండి కవిత్వం ప్రతిఫలిస్తూ వచ్చింది. ఈ ప్రతిఫలనంలో సమిష్టిపరమైన కర్తవ్యాన్ని మరియూ భాద్యత సైతం వ్యక్తమయిన దశను చూస్తే నేడు వ్యష్టిపూరిత వ్యవహారాలను విప్లవాత్మక దశగా అనివార్యం చేయడాన్ని గ్రహించవచ్చు. అయితే ఈ వ్యష్టిని గతితార్కిక పరమైనదిగా కాకుండా కేవలం అనుభవవాదం - అధునికానంతర వాదం - ఫలిత ప్రాధాన్యవాదాలుగా సాగడంతో ఛాందస్సవాద రూపాలు అనివార్యంగా సమిష్టిపర విప్లవ సాంప్రదాయాన్ని కాలరాయడాన్ని చూడవచ్చు. ఈ వ్యష్టి ఆధునికత యొక్క వ్యక్తిస్వామ్యపు పునాదిగా సాగుతున్న వ్యవహారంగా ఉండటంతో కేవల వ్యక్తి యొక్క భావరూపాలు అందులోనూ మధ్యతరగతి అధిక్యవాదంగా కవిత్వం పరిమితించబడిన వాస్తవాన్ని కాదనలేము. కావున నేటి కవిత్వం పాత్రను సమిష్టిపరం చెయ్యాల్సిన అవసరం అనివార్యం. అందుకు సామాజిక మార్పు యొక్క చలనాన్నే విమర్శనాత్మక రూపంలో అధ్యయనం చెయ్యాల్సిన అవసరం ఆవశ్యకం.

అంటరానితనపు అనురూపమే శిరోముండనం!

భారత దేశం యొక్క విశేష శ్రమ సంబంధాల నేపథ్యపు ప్రతిఫలనంగా అంటరానితనాన్ని పరిగణించడం మన అవగాహన అయితే ఈ విశిష్టత యొక్క వాస్తవ ఆధారాన్ని గ్రహించడంలోనే పొరపాటు ఉండటం విచారకరమైన విషయం, భారత దేశంలోని వివిధ అంటరాని శ్రమలు శ్రామికుల వంతుగా పరిగణించి వ్యవహరించడం కద్దు. నిజానికి ఇది సాంప్రదాయ రూపంలో భావజాలాత్మకమైనదిగా మత భావనగా వర్ధిల్లుతున్న చరిత్ర నేటికీ గోచర దృశ్యం. అయితే ఈ సాంప్రదాయం రాను రాను విభిన్న రూపాలలో ఆధునికతను సాధించినదని గమనించవచ్చు. అయితే ఈ నూతనాంశము కచ్చితంగా గత వాస్తవికతకు భిన్నంగా ఉన్నతమైన విషయంగా చలామణీ అవుతున్నది. అందుకే ఆధునికంగా రాజ్యాంగరూపంలో పాలన సాగుతున్న నేటి తరుణంలో ప్రాథమిక హక్కులు మరియూ అంటరానితనపు వ్యతిరేక చట్టాలు మరియూ దళితులపై వేధింపుల నిరోధక చట్టాలు ఉన్న కాలంలో కూడా మనం దృష్టిసారించే కొన్ని సంఘటనలు ఏమనగా కూలిపనిలో రంగును చూసి బాగా చూసుకోవడం కానీ కులం తెలిసిన తరువాత పట్టించుకోకపోవడం. ఒకరైతే బ్రాహ్మణులకు పాలుపోసేవారు అయితే ఆయనని కులం అడిగారు మాదిగపల్లెలో ఉన్న ఊరు గురించి

అడిగారు, ఆయన చర్చికి వెలతామని చెప్పడం ద్వారా అంటరానికులాన్ని ఊహించి పాలు మానిపించారు. వారివారి స్వంత ఇంట్లోనే దళితులు కుర్చున్నప్పుడు రెడ్లు కోడి పుంజు కోసం అటుగా వచ్చినప్పుడు లెగిసి నిలబడటం, గ్రామాలలోని సినిమా హాలులో నేల టికెట్ తీసుకోవాలి అంతేకాని సీట్లలో కూర్చోకూడదు. అందరి ముందు వరండాలలో వేరుగా కూర్చోపెట్టి భోజనం పెట్టడం. పనులలో కులం బట్టి వేతనాలను నిర్ణయించేవారు. తినే ఆహారాన్ని అలాగే తినడాన్ని సైతం కులం ప్రాతిపథికగా పరిగణించడం జరుగుతున్నాయి అలాగే పాటశాలల్లో ఇప్పటికీ దున్న మాంసాన్ని తినే వారని అంటరానితనాన్ని పాటించే దుర్గుణాన్ని నమోదు చేయవచ్చు, స్నేహం చేయకుండా నిర్లక్ష్యం చేయడం. నీళ్ళ కోసం వాటర్ ప్లాంట్ల వద్ద వివక్షతను చూపడం, అలాగే అభ్యుదయ సంఘాలలో సైతం కుల ప్రాతిపథికగా పదవులు కట్టబెట్టడాన్ని గ్రహించవచ్చు. అయితే ఇంకా మరెన్నో వివక్ష రూపాలు మన కళ్ళ ముందే జరుగుతున్నాయి కూడా వాటిని గ్రహించలేనటువంటి భావజాల బానిసత్వాన్ని కలిగియున్నాము కూడా. నిజానికి అంటరానితనం యొక్క అనురూపాలుగా నేటి శిరోముండనం, బూతులు తిట్టడం వగైరా వ్యవహారాలని పరిగణించి ముందుకు సాగాల్సిన అవసరం ఉన్నది, వీటి అనుసరణ సైతం ఆధునిక రాజ్య వ్యవస్థల రూపాలలో, భావజాల వ్యవస్థల భావజాలాలుగా వ్యవహరిస్తాయి కూడా. అయితే నాగరికత దాని అభివృద్ధిలో భాగంగా ఇటువంటి దారుణాలు ఉద్భవించడం సరైనది కాదని వీటి ములాలని ప్రశ్నించే గొంతుకలు నాగరికతే వర్గ వైరుధ్యాల ఏకత్వమని గ్రహించడంలోని పొరపాటును, సైద్ధాంతికంగా వారి అవగాహనా లేమిని గ్రహించి విమర్శించాల్సిన అవసరం మన ముందుంది. అలాగే మనుధర్మ శాస్త్రంలో సైతం దళితులపై శిక్షల రూపాలు అంటరానితనపు అనురూపాలుగానే భావించాలి. భావనను కేవలం భాషా విషయంగా పరిగణించే దుస్థితి నేటి కాలానికి పట్టిన దౌర్భాగ్యం– ఒక పీడనగా గమనించాలి. కావున సైద్ధాంతిక పోరాటాన్ని కేవల అనుభవవాద ప్రాతిపథికగా దాటివేయ ప్రయత్నాన్ని, వ్యతిరేకించే పరిస్థితిని చూడవచ్చు ఫలితంగా ఆచరణను కేవల ఆత్మాశ్రయ వాదంగా భావించే భావజాలీకులు శిరోముండనాన్ని ఆత్మగౌరవంగా ప్రచారం చేస్తున్నారు. అయితే భావజాల రూపంగా మారిన భౌతిక వాస్తవికతగా గ్రహించే సామర్థ్యాన్ని పట్టుకోలేని అగ్రకుల–అగ్రవర్గాల భావజాలమే కారణమని వాదించేవారు లేకపోలేదు కూడా, అయితే నిజానికి ఉత్పత్తి శక్తుల ఉత్పత్తి సంబంధాల మధ్య వైరుధ్యాన్ని అలాగే వాటికి సంబంధించిన ఉపరితల ఐక్యతను గ్రహించడంలో పొరపాటుగా వారి సైద్ధాంతిక అజీర్తిని అర్థం చేసుకోవాలి. విమర్శించి గుణాత్మకం చెందాలి.

30

ఆపరేషన్ పోలో - ఓ కుట్ర

1948 సెప్టెంబర్ 13-17 ఆపరేషన్ పోలో పై తెలంగాణోద్యమం సందర్భంగా వ్యక్తమైన అభిప్రాయాలు మనం విన్నాము. ఈ అభిప్రాయాలు తెలంగాణోద్యమం నేపథ్యంగా బహిర్గతమవడం ప్రాముఖ్యత కలిగి వున్నది. ఎందుకంటే ఆ ఉద్యమంలో పాల్గొనే వారి వర్గ స్వభావాలు ఏమిటో? వారి వర్గ ప్రయోజనాలు ఏమిటో తేటతెల్లమవుతుంది విభిన్నవర్గాలు తెలంగాణోద్యమం సందర్భంగా ఉమ్మడిగా పాల్గొన్నా సెప్టెంబర్ 13-17 పోలీస్ యాక్షన్ సందర్భానికి వచ్చేటప్పటికీ వారి వారి అభిప్రాయాల్లో చాలా స్పష్టమైన భేదాన్ని గమనించ వీలు కలుగుతుంది. సెప్టెంబర్ 13-19 పోలీస్ యాక్షన్ పై అభిప్రాయాల ఆధారంగా వారి స్వరూప, స్వభావాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఏవిధంగా సామాజిక సంబంధాలు, పరిపాలన వుండగలదో విశ్లేషించుకోవచ్చు. ప్రస్తుతం పాలనను, వారి స్వభావాలను గమనిస్తున్నాము కూడా.

పోలీస్‌యాక్షన్ పై వెల్లబుచ్చే వాదనలు రెండు కోణాల నుండి జరుగుతున్నాయి. ఒకటి అస్తిత్వోద్యమం కోణం, రెండు వ్యవసాయ విప్లవోద్యమ లేదా గతితార్కిక కోణం. అస్తిత్వోద్యమం బూర్జువా వర్గపు ప్రయోజనము మరోప్రక్క పెటీ బూర్జువా వర్గపు

ప్రయోజనమూ కలగలిసినదిగా ఉండి ప్రత్యేక తెలంగాణను అలాగే సామాజిక తెలంగాణను డిమాండ్ చేస్తుంది. ఇక వ్యవసాయ విప్లవోద్యమం, కార్మిక, కర్షక వర్గాల ప్రయోజనాలు ఇమిడి ఉండి ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణను డిమాండ్ చేస్తుంది పెటి బూర్జువా వర్గ ప్రయోజనాలు కూడా వ్యవసాయ విప్లవోద్యమం పరిరక్షించే బాధ్యతను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతుంది. ఆ విధంగా ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ కార్మిక, కర్షక, పెటీ బూర్జువా వర్గాల ప్రయోజనాలను పరిరక్షిస్తుంది. ఇకపోతే బూర్జువా వర్గపు ప్రయోజనం కేవలం తమ ఆస్తి మారక సంబంధాలను పరిరక్షించుకునే దిశగా అడుగులు వేస్తూ, ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను ముందుకు తీసుకెళుతూ, ఒకవేల రాష్ట్ర ఏర్పాటు జరిగినా భూస్వామ్య సంబంధాలు, పెట్టుబడిదారీ సంబంధాలు ప్రత్యక్ష కొనసాగింపు గానే వుంటాయని, ఉండాలని భావించడం జరుగుతుంది.

ఈ పై వాటి వర్గా స్వభావాలు దృష్ట్యా సెప్టెంబర్ 13–17 పోలీస్ యాక్షన్‌పై తమ వాదనలను అర్థం చేసుకోగలము. బూర్జువా, పెటీ బూర్జువా వర్గాలు సెప్టెంబర్ 17 పోలీస్ యాక్షన్‌ను విమోచనా దినంగా అలాగే విలీన దినంగా భావించడం జరుగుతుంది. కార్మిక, కర్షక వర్గాలు ఈ దినాన్ని విద్రోహంగా భావించడం జరుగుతుంది. విమోచనదినంగా భావించేవారు. సెప్టెంబర్ 17ని అట్టహాసాలతో పండుగ వాతావరణంలా జరుపుకుంటున్నారు. విలీనదినంగా కూడా సభలు, కార్యక్రమాలు జరుపుతున్నారు. ఇక విద్రోహదినంగా భావించేవారు నిరసన కార్యక్రమాలు జరుపుతున్నారు.

1947 ఆగస్టు 15న బ్రిటీష్ ఇండియాకు స్వాతంత్ర్యం లభించింది. అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ వచ్చింది. కానీ అదే సమయంలో భారతదేశంలో 560 రాజ సంస్థానాలు నిలయమైనాయి. ఈ సంస్థానాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం క్రింద రైతాంగ పోరాటాలు సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంస్థానాలను భారతదేశంలోకి కల్పుకోవడానికి పెద్ద ఎత్తున సైనిక చర్యలు జరపడమైంది ఈ 560 సంస్థానాలల్లోకే అతి పెద్ద సంస్థానం నైజం సంస్థానం. నైజాం సంస్థానంపై ఆపరేషన్ 'పోలో' అనే పేరిట సెప్టెంబర్ 13 నుండి 17వరకు 1948న సైనిక చర్యను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించింది. సెప్టెంబర్ 18న నైజాం కాంగ్రెస్‌కు లొంగిపోయి నైజాం సంస్థానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి

అప్పగించాడు. నైజాంతో సైనిక, రవాణా విదేశీ వ్యవహారాల వరకే బాధ్యత తీసుకుంటానని అన్న కాంగ్రెస్ ఈ సైనిక చర్యతో మొత్తం, పరిపాలన, సామాజిక బాధ్యతను తీసుకునే స్థితికి అభివృద్ధి చెందింది. ఈ నేపథ్యం గల సైనిక చర్యపై విమోచన దినంగా విలీన దినంగా భావించడం కొందరి వంతైతే, ఇక కమ్యూనిస్టు పార్టీ దాని అభిమానులు మాత్రము ఈ సైనిక చర్య అప్పటికే నైజాం సంస్థానానికి పునాది గల జమిందారీ భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా జరుగుతున్న రైతాంగ పోరాటాన్ని అణచడం కోసమని కావున విద్రోహ దినంగా భావించాలని భావిస్తుంది.

ఇప్పుడు విమోచన దినమా, లేక విలీన దినమా అని తేల్చుడానికి అసలు ఇది ఎందుకు విద్రోహ దినమో వివరించడం ముఖ్యం. ఎందుకంటే సెప్టెంబర్ 17సైనిక చర్య ఆచరణలో అంతకంతకూ రైతాంగ పోరాట విజయాలపై దాడులుగా మారింది. ఈ సైనిక చర్య మూలంగా అసలు దీనికి కారణభూతమైన ఉద్యమ సిద్ధాంత – రాజకీయ – నిర్మాణ సమస్యలను ముందుకు తెచ్చి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో పెద్ద చీలికను ఏర్పర్చింది. సెప్టెంబర్ 13–17 పోలీస్ యాక్షన్ జరిపిన కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను నిజాం నుండి రక్షిస్తున్నానని విస్తృతంగా జరుగుతున్న రైతాంగ పోరాట విజయాలను అణచడం కోసమే రావడం జరిగి ఎలాగైతే విద్రోహం చేసిందో. అదే విధంగా కమ్యూనిస్టు పార్టీ రైతాంగ పోరాటాన్ని మధ్యలోనే వదిలేసి పోరాటాన్ని విరమించిందో, దీని మూలంగా ఈపాటికే విజయం సాధించాల్సిన భారత విప్లవోద్యమపు తిరోగమనాన్ని తెల్పుతుంది. ఇందుకు కారణమైన కమ్యూనిస్టు పార్టీ యొక్క స్వభావం ఏమిటో చర్చించడం ద్వారా భారతదేశంలో జరుగుతున్న విప్లవోద్యమానికి సెప్టెంబర్ 13–17 పోలీస్ యాక్షన్ కీలక గుణపాఠాలని అందించినట్లవుతుంది. ఈ పాఠాలు విప్లవోద్యమం అభివృద్ధికి ఎక్కువగా ఉపయోగపడతాయి.

కావున ఇప్పుడు పోలీస్ యాక్షన్ పూర్వపు తెలంగాణా సామాజిక స్వభావం, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీల పాత్ర, పోలీస్ యాక్షన్, పోలీస్ యాక్షన్ తరువాత తెలంగాణ సాయుధ పోరాటం, 1951 సాయుధ పోరాట విరమణ, గుణపాఠాలు, సమీక్ష మొదలైనవి పరిశీలించడం ద్వారా మాత్రమే సెప్టెంబర్ 17 సైనిక చర్యను, ఆ తరువాత పరిణామాలను సరిగ్గా అంచనా వేయగలము, భవిష్య ఉద్యమాలకు సరైన పాఠాలను తీయగలము.

I. పోలీస్ యాక్షన్ పూర్వపు తెలంగాణా సామాజిక స్వభావం :

సామ్రాజ్యవాద పరిపాలన : మొత్తం భారతదేశం బ్రిటీష్ సామ్రాజ్యవాద పరిపాలన క్రింద నలిగిపోతున్న సందర్భమది. దేశం సంస్థానాలు గాను, బ్రిటీష్ ఇండియా గాను విడిపోయినది. సంస్థానాలు బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు పన్నులు చెల్లిస్తుండేవి. బ్రిటీష్‌వారు రక్షణ, విదేశీ, రవాణా వ్యవహారాలపై ఆధిపత్యం వహిస్తుండేది వారు. దేశంలో 560 సంస్థానాలు ఉండేవి. ఈ సంస్థానాల్లో నిజాం హైదరాబాద్ సంస్థానం అత్యంత పెద్దది. బ్రిటీష్ వారి పారిశ్రామిక సరుకులకు మార్కెట్లుగా వుంటూ, ముడి సరుకులను ఎగుమతి చేస్తూ వుండేది నైజాం సంస్థానం. నిజాం నవాబులు బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు నమ్మినబంట్లు, వారి కనుసన్నలలోనే నిజాం మెలుగుతూ వుండేవాడు. బ్రిటీష్ వారి స్వప్రయోజనాలను నిజాం నవాబు కొనసాగించేవాడు. బ్రిటీష్ సామ్రాజ్యవాద రాజకీయ, ఆర్థిక, సామాజిక దోపిడీలో భాగంగా నిజాం హైదరాబాద్ రాష్ట్రం ఉండేది. బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా ఏవిధంగా ఏ విధమైన తిరుగుబాట్లు జరిగినా నిజాం సంస్థానం పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తూ, పరస్పర సహాయార్థం ప్రజలను పీడిస్తూ వుండేవి.

నైజాం నిరంకుశ పరిపాలన : నైజాం నిరంకుశ పరిపాలన తెలంగాణ, మహారాష్ట్ర , కర్ణాటక ప్రాంతాలల్లో సాగేది. నైజాం నవాబు మొగల్ సామ్రాజ్యం యొక్క అవశేషం. మొగల్ సామ్రాజ్యం క్రింద సామంత రాజ్యాంగా నైజాంకు అప్పగించడమైనది. కానీ నైజాం వంశం బ్రిటీష్ సహాయంతో మొగలాయిలను ఓడించి స్వతంత్ర రాజ్యాంగా ప్రకటించుకున్నారు. తమకు యుద్ధంలో సహాయ పడిన బ్రిటీష్‌కు కోస్తా, రాయలసీమలను ప్రాంతాలను బహుకరించి కొంత మొత్తంలో పన్నులు చెల్లిస్తూ వుండేట్టుగా ఒప్పందం సాగింది. ఈ విధంగా నైజాం సంస్థానం బహుపెద్ద రాజ పరిపాలన కలిగినదిగా ఉండేది. నైజాం నవాబు సర్ఫేకాస్ అత్రఫ్ బల్దా అనే ప్రాంతాల వారీగా అంటే సర్ఫేకాస్ / రాజు యొక్క ప్రత్యక్ష అదుపులో ఉండే భూమి, అత్రఫ్ బల్దా / వివిధ గ్రామాల్లో పరోక్షంగా రాజుల క్రింద వుండే భూముల నుండి పన్నులు వసూలు చేసుకునేవాడు. అలాగే ఫ్యాక్టరీల నుండి పన్నులు వసూలు చేసి చేస్తూ వుండటం జరుగుతుండేది. నైజాం నవాబు పరిపాలనకు పునాది గ్రామీణ ప్రాంతపు జమిందారీ భూస్వామ్య విధానం. ఆ

విధంగా తమ అభివృద్ధి నిరోధక పరిపాలన గల నిజాం హయములో కనీస హక్కులు సైతం కాలరాయబడినటువంటి స్థితి ఉండేది.

3. జమిందారీ భూస్వామ్య విధానం : నిజాం పరిపాలనకు పునాది జమిందారీ భూస్వామ్య విధానం గ్రామీణ ప్రాంతంలో భూస్వామ్య పెత్తనం అత్యంత కీలకం. వెట్టిచాకిరీ విధానం, అధిక వడ్డీలు, శిస్తులు, అధిక కౌలు రేటు, అంటరానితనం అనే రూపాల ద్వారా భూస్వాముల దోపిడీ సాగుతుంది. భూస్వాములు వేల ఎకరాలను తమ గుప్పిటలో పెట్టుకుని నడుచుకునే వారు. ఉదాహరణ 25వేల ఎకరాలు గల కొన్ని భూస్వామ్య కుటుంబాలుండగా, దాదాపు లక్షా డెబ్భై అయిదు వేల ఎకరాలు గల జగమెరిగిన జన్నారెడ్డి ప్రతాపరెడ్డి లాంటి వారు ఏలుతుండేవారు. గ్రామాలల్లో ప్రతీ వ్యక్తీ భూస్వాముల అడుగుజాడల్లోనే ఉండాలి. మరొక ప్రక్క రైతులు అత్యంత దారుణమైన దుర్భర పరిస్థితిని ఎదుర్కొటుండేవారు. కనీసం గంజైనా దొరకడం అదృష్టంగా భావించేవారు. ప్రతీ గ్రామానికీ పట్వారీ, పటేల్ సాబ్‌లుంటూ గ్రామీణ రెవెన్యూ, పోలీస్ వ్యవస్థ నడిచేది. వీరి ద్వారా భూస్వామి అధిక పన్నులు వసూలు చేసుకుంటుండేవాడు. ప్రజలు నిరక్షరాస్యులు. ఈ విధమైన జమిందారీ భూస్వామ్యం నాటి మధ్య యుగపు నైజాం నవాబు పరిపాలనకు పునాది.

4. ప్రజాతంత్ర హక్కుల మృగ్యం : నిజాం పరిపాలనలో కనీస ప్రజాతంత్ర హక్కులు కాలరాయబడినాయి. వివిధ భాషా సాంప్రదాయాలు ఇక్కడ అణచబడినాయి. కన్నడం, తెలుగు, మరాఠీ భాషలు హైదరాబాద్ రాష్ట్రంలో కనుమరుగయ్యే స్థితిని గమనించగలము. కేవలం ఉర్దూ భాషా వ్యాప్తికి మాత్రము అత్యంత ప్రాధాన్యత వుండేది. కేవలం ఉర్దూ భాష తెలిసినవారే ఉద్యోగార్హులకు ఎంపికయ్యే వారు. విద్యా ప్రామాణికపు ప్రోత్సహము కూడా దీన స్థితిలోనే వుంది. గ్రామాలల్లో విద్య ఒక హాస్యాస్పద విషయంగా ఉండేది. ప్రజలు హిందువులుగా ఉన్న వారిని అక్రమంగా ముస్లిమ్‌లుగా మార్చడం ఒక పరిపాటైంది. గ్రామాలు వెట్టి విధానంతో తల్లడిల్లిపోయేవి తమ కనీస అవసరాలు ఏవీ తీరేవి కావు. భారతదేశం మొత్తం జాతీయ స్వాతంత్ర్యపు ఉద్యమ ప్రభంజనంలో ఉంటే హైదరాబాద్ రాష్ట్రంలో మాత్రం జాతీయ ఉద్యమానికి సంబంధించిన ఏ కార్యక్రమమూ చేయ వీలులేని స్థితిని గమనించగలము. కార్ఖానాలలో కార్మికుల

జీతభత్యాలు దీనిస్థితిలో ఉండేది. ప్రజలు స్వేచ్ఛగా తమ జీవితాలను సాగించడం ప్రశ్నార్థకమే. ఈ విధంగా అణువణువూ ప్రజల హక్కులు నిజాం రాష్ట్రంలో మృగ్యమయ్యాయి.

II. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీల పాత్ర :

1. ఆంధ్ర మహాసభ నిర్మాణం : నిజాం రాష్ట్రంలో నవంబర్ 12న 1921 సంవత్సరాన ఒక మీటింగ్‌లో వెంకటరమణరావు అనే తెలుగు లాయర్ తెలుగు భాషను మాట్లాడినందుకు హేళన చేశారు. తెలుగు భాషకు ఈ యొక్క అవమానం ఏ విధంగానైతే జరిగిందో అట్టి అవమానం మళ్ళీ ఏ సందర్భంలోనూ జరగకూడదని ఆ రోజే మాడపాటి హనుమంతరావు గారి నాయకత్వంలో పదకొండు మంది సభ్యులతో కూడిన ఆంధ్ర జన సంఘాన్ని ఏర్పర్చినారు. దీని ప్రధాన లక్ష్యం తెలుగు భాషా అభివృద్ధిగా ఉండేది. ఐతే 1930 కల్లా ఈ సంఘం ఆంధ్ర మహాసభగా ప్రసిద్ధి కెక్కింది. కేవలం భాషా అభివృద్ధే కాకుండా సామాజిక అంశాలను సైతం తన ప్రధాన ఎజెండాకు తీసుకుని పని చేయడం ప్రారంభించింది. ఆంధ్ర మహాసభ యొక్క ప్రాథమిక డిమాండ్లు ఏమనగా

1. ఏర్పరుస్తున్న విద్యా సంస్థలను గుర్తించాలి.
2. నిర్బంధ ప్రాథమిక విద్యను అమలుచేయాలి.
3. తెలుగు భాషను పాఠ్య గ్రంథాల్లో ప్రవేశపెట్టాలి.
4. గ్రామాలల్లో అంటరానితనం పోవాలి.
5. స్థానిక ప్రజా పరిపాలనను ప్రవేశపెట్టాలి.

ఆంధ్ర మహాసభ ఐదవ మహాసభలో మితవాదులు, అతివాదులు అనే విభజన వచ్చింది. అతివాదులకు కమ్యూనిస్టులని, మితవాదులను కాంగ్రెస్ వారని గుర్తింపు వచ్చేసింది. ప్రజలు నిదానంగా అతివాదులు వైపుకు మొగ్గు చూపడం మొదలుపెట్టారు. ఆంధ్ర మహాసభ గ్రామాలల్లో జమిందారీ భూస్వామ్యాన్ని రద్దు చేయాలని వెట్టి విధానం పోవాలని, అధిక పన్నులు, కౌలు రేటులు రద్దు చేయాలని, దున్నేవానికే భూమి కల్పించాలని ప్రజాతంత్ర హక్కులు కల్పించాలని డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. అంతేకాకుండా అంతర్జాతీయ ఫాసిస్టు పాలనకు, యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడాలని, శాంతిని డిమాండ్ చేస్తూ పిలుపునిచ్చారు. ఈ

నినాదాలు ముఖ్యంగా 1944 భువనగిరి పదకొండవ మహాసభలోనూ అలాగే 1945-1946 ఖమ్మంలో జరిగిన పన్నెండవ మహాసభలో ఇవ్వబడినాయి. ఆంధ్ర మహాసభకు రావినారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముఖ్దుం మొహియుద్దీన్ గారులు కీలక నాయకులుగా వ్యవహరించారు. వినతిపత్రాలు, మహార్యాలీలు, పికెటింగ్‌లుగా ఉద్యమం సాగింది. ఆంధ్ర మహాసభకు స్థానిక వ్యాపారుల నుండి కూడా పూర్తి సహాయ సహకారాలు అందించారు. అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతూ రైతాంగ పునాది కలిగిన ఆంధ్ర మహాసభ నిజాం వ్యతిరేక పోరాటానికి కీలకపాత్రను కలిగినది.

ఇప్పుడు నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన కొన్ని ఉద్యమాలను పరిశీలిద్దాం.

ఎ. వందేమాతర ఉద్యమం : నిజాం రాష్ట్రంలో వందేమాతర ఉద్యమం విస్తృత వ్యాపితం కలిగినదిగా గుర్తించాలి. బ్రిటీష్ ఇండియాలో వందేమాతర గీతం పాడటం కోసం పెద్దస్థాయిలో ఉద్యమం జరిగింది. వందేమాతర గీతం ఆలపించడానికి హక్కు లేదు. దీనితో విద్యార్థి వాలంటీర్లు పెద్ద ఎత్తున వందేమాతర గీతాలాపన పెద్ద ఉద్యమంగా తీసుకుని విద్యార్థి పాఠశాలలో విశ్వవిద్యాలయాల్లో, ఉద్యోగుల పనీ స్థలాల్లో, పండగులలో, పబ్లిక్ స్థలాల్లో పాడటం మొదలుపెట్టారు. ఈ గీతాలాపన చేసే వారిని వెంటనే నిజాం రాష్ట్రం నుండి బహిష్కరించడమో, అరెస్టులు చేయడమో, డిటెన్యూలుగా చేయడం, అక్రమ జరిమానాలు విధించడం మొదలైనవి చేశారు. ఇంత నిర్బంధంలో సైతం తమ పోరాటాన్ని ఆపలేదు.

బి. గ్రంథాలయోద్యమము : గ్రామాలలోని రైతాంగానికి కనీసం ప్రాథమిక విద్య మృగ్యం. చదువనేది రైతాంగానికి అందుకోలేని స్వప్నంగా ఉండేది. కానీ ఆంధ్ర మహాసభ లాంటి సంస్థ పుట్టుకతో గ్రామాలల్లో గ్రంథాలయాల స్థాపనకు పెద్ద స్థాయిలో ఉద్యమం ప్రారంభమైంది. గ్రామాలల్లో ఈ గ్రంథాలయాల వద్ద పత్రికలు చదివి వినిపించడం, రాత్రి పాఠశాలలు నిర్వహించి రైతులకు విద్యను నేర్పించడం, బ్రిటీష్ వ్యతిరేక పోరాటాన్ని గురించి తెల్పడం, నిజాం వ్యతిరేక ఉ ద్యమం గురించి వివరించడం జరిగేవి. ప్రారంభమవుతున్న రైతాంగపు గెరిల్లా సాయుధ పోరాటానికి ఈ గ్రంథాలయోద్యమం కీలకమైనది.

సి. అక్రమ మత మార్పిడుల వ్యతిరేక ఉద్యమం : నిజాం రాష్ట్రంలో అక్రమ మత మార్పిడీలు విచ్చలవిడిగా ఉండటాన్ని గమనించగలము. హిందువులుగా

ఉన్న రైతాంగాన్ని ఇక మీదట వెట్టి విధానం ఉండవని, రాజంత వారవుతారని ముస్లిమ్ మతంలోకి చేరిన వెంటనే ఇవి వర్తిస్తాయని "అనల్ మాలిక్" అనే సిద్ధాంతాన్ని పెంపొందించడం ప్రారంభించి అక్రమంగా హిందువులను ముస్లిమ్ మతంలోకి మార్చేవారు.

డి. ఆంధ్రమహాసభ నేతృత్వంలో ఉద్యమం : ఆంధ్ర మహాసభ నేతృత్వంలో ప్రజలు గ్రామీణ భూస్వామ్యానికి వ్యతిరేకంగా అక్రమ పన్నులు, అధిక కౌలురేటుకు వ్యతిరేకంగా, వెట్టి విధానానికి వ్యతిరేకంగా, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడటం ప్రారంభించారు. కనీసం మాట్లాడే స్వేచ్ఛ, సమావేశమయ్యే స్వేచ్ఛను ఈ సంస్థ ద్వారా సాధించుకోవడం, రైతుకూలీలకు జీతాలు ఇప్పించడం వంటివి కూడా ఈ సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఆంధ్ర మహాసభ అనగానే ప్రజా వ్యతిరేకులు భయకంపితులై పోయేవారు. ఆంధ్ర మహాసభ పేరు చెప్పి తమ అణచివేతలను పొగొట్టుకునే స్థాయికి ప్రజల చైతన్యం అభివృద్ధి చెందింది. ఇందుకు ఆంధ్ర మహాసభ యొక్క పాత్ర కీలకమైనది.

3. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం :

1924 సంవత్సరం కాన్పూరులో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. అప్పటి వరకు వివిధ గ్రూపులుగా వ్యవహరించేవారు. ఈ పార్టీ క్రిందకు వచ్చే బలమైన నిర్మాణయుతమైన సంస్థగా అభివృద్ధి చేశారు. దక్షిణ భారతదేశంలో కూడా తన ప్రభుత్వాన్ని పెంచుకుంటూ 1934 కల్లా బలమైన నిర్మాణాన్ని కలిగి వుంది. ఈ నిర్మాణమే హైదరాబాద్ రాష్ట్రానికి విస్తరించింది.

"1934 నుండి ప్రారంభమై పనిచేస్తూ వచ్చిన మద్రాసు తెలుగు జిల్లాల కమ్యూనిస్టు పార్టీ, విప్లవోద్యమం 1934–40 మధ్య కాలంలో హైదరాబాదులోని తెలుగు జిల్లాలకు విస్తరించింది. తొల్దొలుత స్టేట్ కాంగ్రెస్ ఉద్యమంలో నుండి వచ్చిన వారిని, తదితర పురోగామి అభిప్రాయాలతో ముందుకు వస్తున్న వారిని గ్రూపులుగా చేర్చి, ప్రాథమిక మార్క్సిస్టు విజ్ఞానమిచ్చే రాజకీయ గ్రూపు మీటింగులు, అధ్యయన తరగతులు పెట్టి హైదరాబాదు తెలుగు జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ పునాదులు వేయుటకు కృషి చేసింది. మద్రాసు ఆంధ్ర జిల్లాలతో పని చేస్తూ వచ్చిన రాష్ట్రకమిటీయే."

(తెలంగాణ విప్లవోద్యమాన్ని, కమ్యూనిస్టు పార్టీని విచ్ఛిన్నం చేసే మితాతత్వ ధోరణులను అరికట్టండి – హైదరాబాద్ స్టేట్ కమిటీ, సర్క్యులర్ నెం. 4/50 పేజి 113)

మద్రాసు, ఆంధ్ర జిల్లాలో పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీ నాయకులైన చంద్ర రాజేశ్వరరావు హైదరాబాద్ తెలుగు జిల్లాలలోని రావి నారాయణరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి గార్లను కమ్యూనిస్టు పార్టీ వైపుకు ఆకర్షించారు. ఆంధ్ర మహాసభను బలమైన ఉద్యమ సంస్థగా నిర్మించడానికి కమ్యూనిస్టు పార్టీ వాడుకుంది. ఆంధ్ర మహాసభ కేంద్రంగా తన పనులను నిర్వహించింది. చంద్ర రాజేశ్వరరావు గారి తరువాత పుచ్చలపల్లి సుందరయ్య ప్రధాన బాధ్యతలు తీసుకుని పనిచేయడం ప్రారంభించారు.

“అప్పటి నుండి ఆంధ్ర రాష్ట్ర కమిటీయే హైదరాబాద్ తెలుగు జిల్లాలోని పార్టీ నిర్మాణ, ప్రజా ఉద్యమ సమస్యలను ఎప్పటికప్పుడు చర్చించి నిర్ణయాలు తీసుకుంటూ పనిచేస్తూ వస్తుంది. అవసరమైన ఆర్గనైజర్లను పంపి, పార్టీ నిర్మాణానికి, ప్రజా ఉద్యమ నిర్మాణానికి తోడ్పడుతూ వచ్చింది.”

(పై సర్క్యులర్, పేజి 112)

ఈ విధంగా తెలుగు జిల్లాలకు కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం అభివృద్ధి చెంది కార్మిక, రైతాంగ, విద్యార్థి వర్గాలలో పునాదిని విస్తృతపరుచుకుంది.

4. కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో ఉద్యమం : “తెలంగాణ సాయుధ ప్రతిఘటనా పోరాటం ముఖ్యంగా రైతాంగం భూమికోసం సాగిస్తున్న పోరాటమని స్పష్టం చేయబడింది. తదనుగుణ్యమైన పోరాట డిమాండును, లక్ష్యాలను నిర్దేశించింది. అంటే 1946లో కౌలురేట్ల తగ్గింపు, వెట్టిచాకిరి రద్దు, నిర్బంధ ధాన్య సేకరణ రద్దు, అన్యాక్రాంత భూముల సమస్య, కౌలు భూముల నుండి తొలగింపుకు వ్యతిరేకంగా మొదలగుగాగల సమస్యలపై ప్రారంభమైన తెలంగాణా రైతు సాయుధ గెరిల్లా పోరాటం ప్రథమ దశను దాటి భూమి ఆక్రమణ పంపక సమస్యలపైకి పోయి రెండవ దశలోకి వచ్చిందని దాని తాత్పర్యం భూమి లాంటి కీలక సమస్యలపై సాగే రైతు గెరిల్లా పోరాటం రెండవ దశకు చెందిందని నూతన పాలసీ డాక్యుమెంట్లు వివరించే దాననుసరించే నిర్ధారణ చేయబడింది.”

(సర్క్యులర్ నెం. 3/5 హైదరాబాద్ స్టేట్ కమ్యూనిస్టు కమిటీ, తెలంగాణా రైతాంగ సాయుధ గెరిల్లా పోరాట విరమణకు కారణాల వివరణ పేజీ 81)

భారతదేశంలోనే తెలంగాణ సాయుధ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం సాగింది, దీనికి కొన్ని ఉదాహరణలు :

ఎ. చాకలి ఐలమ్మ ఉదంతం : వరంగల్ జిల్లాలో విసునూరు దేశ్‌ముఖ్ నిరంకుశ భూస్వామి. ఈయనను విసునూరు రామచంద్రారెడ్డి అని అంటారు. మొత్తం నిజాం సంస్థానంలో దుర్మార్గుడిగా పేరుగాంచిన వ్యక్తి, తమ తోటి దొరలు సైతం ఈయన పేరు వింటే భయపడతారు. ఇటువంటి జమిందారీ భూస్వామికి వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీల మద్దతుతో జమిందారీ వ్యతిరేక పోరాటంలో జిల్లా ప్రజలు మొత్తం ముందుకురికారు. ఇటువంటి సందర్భంలోనే చాకలి ఐలమ్మ అనే రైతుకూలీ స్త్రీ పాలకుర్తి గ్రామంలో ఆంధ్ర మహాసభ సభ్యురాలు. ఈవిడ నాలుగు ఎకరాల భూమిని విసునూరు దేశ్‌ముఖ్ ఆక్రమించి పంటను స్వాధీనం చేసుకున్నాడు. ఈ అక్రమ ఆక్రమణకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మకు అండగా పాలకుర్తి గ్రామవాసులను ఐక్యం చేసి నాలుగు ఎకరాల భూమిని పంటను తిరిగి సంపాదించింది. దీనికి కమ్యూనిస్టు పార్టీ యొక్క అండదండలు పూర్తిస్థాయిలో ఉన్నది. ఈ చర్యలతో భూస్వాములపై తిరగబడటం ముఖ్యమని, వెట్టి విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని, భూములను స్వాధీనం చేసుకోవాలని చైతన్యం వచ్చింది. ఈ చైతన్యం ప్రక్క గ్రామాలకు విస్తరించింది.

బి. వెట్టి చాకిరీ వ్యతిరేక పోరాటం, గుతపల సంఘము : గ్రామాలల్లో భూస్వామ్య విధానం యొక్క దోపిడీ రూపం ప్రదానంగా వెట్టి చాకిరీ పద్ధతిలో ముడిపడి వుంటుంది. అన్నివర్గాల ప్రజలు తమ శ్రమశక్తిని భూస్వాముల పబ్బంగడపడానికే వెచ్చించేవారు. ప్రజలు పండగులు జరుపుకుంటున్నా, భూస్వాములు ఏ కార్యక్రమం జరుపుకుంటున్నా ప్రజలే అన్ని రకాల పన్నులు చెల్లించడం, పాలోత్పత్తులు, గొర్రెలు, కోళ్ళు, వివిధ సామానులు సైతం అప్పగించాలి. మొదటగా భూస్వాములు భూములు దున్ని ఆ తరువాతే తమ భూమిని సాగుచేసుకోవాలనే నిబంధనలుండేవి. వీటిని అతిక్రమిస్తే తీవ్రమైన శిక్షలను విధించేవారు. భూస్వాములు అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ కట్టని వారి భూములను స్వాధీనం చేసుకునేవారు. చాకలి వారు ఎటువంటి జీతమూ

ఆశించకుండా భూస్వాములు బట్టలు ఉతకడం, గ్రామాలల్లోని స్త్రీలు ఉచితంగా ఇంటి పనులు చేయడం జరుగుతుండేది.

ఇటువంటి వెట్టి విధానానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలందరూ ఆంధ్రమహాసభ అనే ఐక్య సంఘటనగా సంస్థ క్రింద ఐక్యత సాధించారు. వెట్టి విధానానికి వ్యతిరేకంగా పోరాడటం మొదలుపెట్టారు. అందరూ వెట్టి పనులకు వెళ్ళకుండా సహాయ నిరాకరణ చేసారు. వెట్టికి రావడం లేదని భూస్వాములు తమ గూండాలను ప్రయోగించి ప్రజలను కొట్టడం, బలవంతం చేయడం మొదలుపెట్టారు. అందరూ వెట్టి పనులకు వెళ్ళకుండా సహాయనిరాకరణ చేసారు. వెట్టికి రావడం లేదని భూస్వాములు తమ గుండాలను ప్రయోగించి ప్రజలను కొట్టడం, బలవంతం చేయడం మొదలుపెట్టారు. ఇటువంటి దౌర్జన్యానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ గుతపలతో, వారి వారి సాంప్రదాయ ఆయుధాలతో తిరగబడండని పిలుపునిచ్చారు. దీనితో ప్రజలు గుతపలను చేతబూని భూస్వాములు గడీల ద్వారా ప్రదర్శనలు చేయడం, ప్రజలను ఇబ్బంది పెడుతున్న భూస్వాములు గుండాలను దేహశుద్ధి చేయడం వంటివి జరిపేవారు. దీనితో గుతపల సంఘంగా పేరుగాంచారు. ప్రజలు మొత్తం ఒక్కసారిగా గుంపుగా వెళ్ళి గుతపలను క్రింద కొడుతూ ప్రదర్శన చేసేవారు. ఈ ప్రదర్శనకు భూస్వాములు భయపడేవారు.

దొడ్డి కొమురయ్య మరణం : కడివెండి గ్రామం, జనగామ తాలూకా, వరంగల్ జిల్లాలో విసునూరు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద యెత్తున సామూహిక ప్రదర్శనకు పూనుకున్నారు. కొన్ని రోజుల నుండి సమ్మె చేస్తున్న ప్రజలు ఈ ప్రదర్శనకు సిద్ధమయ్యారు. ప్రజలయొక్క పోరాట పటిమను, ఐక్యతను దెబ్బతీయడానికి విసునూరు దేశ్‌ముఖ్ తన గుండాలను సిద్ధం చేసి ఆ సామూహిక ప్రదర్శనపై కాల్పులు జరపించాడు. ఆ కాల్పులలో 4 జులై 1946 నాడు దొడ్డి కొమురయ్య మల్లయ్యలు మరణించారు. వీరి మరణంతో తెలంగాణ పోరాటం సాయుధ గెరిల్లా విజృంభణ స్థాయికి చేరింది.

డి. జైత్రయాత్రలు : తెలంగాణలోని జమీందారీ భూస్వామ్య వ్యతిరేక పోరాటం ప్రజా ప్రదర్శనలు, సమ్మెలు, బహిష్కరణల నుండి జైత్రయాత్రల స్థాయికి అభివృద్ధి చెందింది. గ్రామాలకు గ్రామాలు భూస్వాముల పీడన నుండి విముక్తి చెందడానికి ఈ జైత్రయాత్రలు తోడ్పడ్డాయి. కొన్ని గ్రామాలను ఎన్నుకుని ప్రజలు

ఆ గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజలను చైతన్యపరచడం, భూములను పంచడం చేసేవారు. జైత్రయాత్ర జరుగుతుంటే ఆ గ్రామాల్లోని భూస్వాములు పారిపోయారు. ఈ విధంగా తెలంగాణ రైతాంగ పోరాటం జైత్రయాత్రల రూపంలో ఉన్నత స్థాయికి అభివృద్ధి చెందింది.

ఇ. రజాకార్ వ్యతిరేక పోరాటం : ఖాసీం రజ్వి నేతృత్వంలో నిజాం నవాబు రజాకార్ అనే సైనిక ముఠాను తయారుచేయించాడు. ఈ రజాకార్ సైన్యం కేవలం పోరాడుతున్న రైతాంగంపై దాడులు చేయడం, రైతాంగపు ఇల్లులపై పడి లూఠీలు గృహదహనాలు, స్త్రీలను చెరచడం, ఇష్టమొచ్చినట్లు ప్రజలను చంపడం పరిపాటైన పనిగా చేస్తూ వుండేది. ఈ సాయుధ రజాకార్ ముఠాలకు వ్యతిరేకంగా సాయుధ ప్రతిఘటనకు కమ్యూనిస్టు పార్టీ పూనుకుంది. ఇందుకోసం కమ్యూనిస్టు పార్టీ సాయుధ దళాలను ఏర్పర్చింది అవి : ఎ. గ్రామ రక్షక దళాలు : గ్రామాలల్లో ప్రజలు సాధించుకున్న భూములు ప్రజాతంత్ర హక్కులు, స్థానిక పరిపాలనను రక్షిస్తూ ఉండే సాయుధ దళం, బి) నిర్మూలనా దళాలు : ఈ దళాలు రజాకార ముఠాలు గ్రామాలకు రానివ్వకుండా చెట్లను కొట్టి అడ్డమేయడం, రోడ్లు తవ్వడం వంటి ఆటంక పనులు నిర్వహించేవి. సి. సాయుధ దళాలు : పెద్ద సంఖ్యలో ప్రజలు సాయుధులై పెద్ద సైన్యాన్ని ఎదుర్కొంటూ ప్రజా ఉద్యమాన్ని, విముక్తి ప్రాంతాలను పరిరక్షిస్తూ విస్తృతం చేయడానికి పూనుకునే దళాలు ఇందులో సుమారు 300 నుండి 400 మంది దాకా ఉండేవారు. ప్రజలు భూస్వామ్య వ్యతిరేక పోరాటపు అభివృద్ధిలో ఈ రజాకార్ విమూఖలను ప్రతిఘటించడం ఉన్నత స్థితిగా అభివర్ణించాలి. రజాకార్ మూఖలు ప్రజా ఉద్యమాన్ని అణచడానికి క్యాంపులను ఏర్పర్చుకుని అక్కడ నుండి తమ దోపిడీలను కొనసాగించేవారు. ఈ క్యాంపులను నిర్మూలించడం కమ్యూస్టు దళాలకు ఒక చర్యగా ఉంటూ భారీగా క్యాంపులను తొలగించి రైతాంగ విప్లవ పోరాటపు శక్తిని చాటారు.

తెలంగాణా సాయుధ రైతాంగ గెరిల్లా పోరాట విజయాలు : "ప్రధానంగా నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలలో 16వేల చదరపు మైళ్ళలో గల 2500 గ్రామాలలో గ్రామ రైతాంగ సోవియట్లు యేర్పడ్డాయి. ఈ రైతాంగ కమిటీలు ఆ ప్రాంతాలలో ప్రజల ద్వేషానికి గురైన భూస్వాములను తరిమేసి వారి భూముల్లో పరిమితిని మించిన అదనపు భూమిని స్వాధీనం చేసుకున్నాయి. 10 లక్షల

ఎకరాల భూమి వ్యవసాయ కూలీ, పేద రైతులకు పంచి పెట్టడం జరిగింది. 'వెట్టి' చాకిరి విధానాన్ని రూపుమాపింది. తాతల, తండ్రులు నుండి కూడా తీరని, భరింపరాని వడ్డీ చాలా సందర్భాలలో సంపూర్తిగా రద్దు చేయటమో లేదా కొన్ని చోట్ల చాలా భాగం తగ్గించివేయటమో జరిగింది. అరణ్య ప్రాంతం యావత్తూ కోయ, లంబాడీ మొదలైన ప్రజలు లంచగొండి అధికారుల బారి నుండి రక్షింపబడ్డారు. వారిపై జరుపబడుతున్న రాక్షస దోపిడీ అంతం చేయబడింది. దాదాపు ఈ ప్రాంతాలన్నింటిలో 'శాంతి భద్రతలను ఈ గ్రామీణ రైతాంగ కమిటీలే నిర్వహించేవి 13 వేల వ్యవసాయ కూలీ యువకులు సాయుధ గెరిల్లా సేవలో స్వచ్ఛంధంగా చేరారు. వీరు గాక వందల కొద్దీ సాయుధ దళాలు నైజాం, రజాకారుల, పోలీసుల, భూస్వామ్య గుండాల దాడిని యెదుర్కొనటంలో అనుక్షణం నిమగ్నమై ఉండేవి."

(తెలంగాణా రైతాంగ సాయుద పోరాటం – దాని గుణపాఠాలు

– మాకినేని బసవ పున్నయ్య పేజి : 28)

III. పోలీస్ యాక్షన్ :

ఆగష్టు 15, 1947 స్వాతంత్ర్యము : భారతదేశం బ్రిటీష్ దాస్య శృంకాల నుండి విముక్తి చెందడానికి శతవిధాలా తీవ్ర ప్రయత్నం సాగించింది. ఈ పోరాటంలో జాతీయ బూర్జువా వర్గం బ్రిటీష్ సామ్రాజ్యవాదుల సామాజికార్థిక పునాదులను ఏ మాత్రమూ కదిలించని స్థితిలో ఉద్యమాలు నిర్వహించారు. అందుకు ఉదాహరణ ఉప్పు సత్యాగ్రహము, వ్యక్తి సత్యాగ్రహాలు మొదలైనవి. సామూహిక ప్రజా బలాన్ని ప్రదర్శిస్తూ పారి శ్రామిక పెట్టుబడులలో వాటాను కాంక్షించడమే ధ్యేయంగా జాతీయ బూర్జువాల పాత్రను గమనించగలము. కానీ ఇటువంటి మోసపూరిత పరిస్థితి కనబడుతున్న నేపథ్యంలో కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావులు మాత్రం గట్టి స్థాయిలో బ్రిటీష్ సామ్రాజ్యవాదుల సామాజికార్థిక పునాదులు కదిలించే విధంగా పోరాడటం ప్రారంభించారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదం యొక్క పునాదులైన జమిందారీ ఫ్యూడల్ సంస్థానాలలో రైతాంగపు సాయుధ తిరుగుబాట్లు, నావి సైనికుల తిరుగుబాటు, కార్మికవర్గం వేల సార్లు సమ్మెకు దిగాయి. ఈ పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ అత్యంత శ్రమకోర్చింది. ఈ పోరాటాల నుండి ప్రజలను ప్రక్కదోవ పట్టించడానికి. అంతేకాకుండా రెండవ

ప్రపంచ యుద్ధం యొక్క పర్యవసానంగా బ్రిటీష్ సామ్రాజ్యవాదం కోలుకోలేని స్థితిలో ఉంది. కాబట్టి తన చెప్పుచేతల్లో ఉండే అప్పటికే పూర్తిస్థాయిలో తయారు చేసుకున్న కాంగ్రెస్ పార్టీలోని వర్గానికి అధికార మార్పిడిని అప్పగించింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదుల పరిపాలన, భౌగోళికం, రాజ్యాంగాన్నే యథావిధిగా కాంగ్రెస్ కొనసాగించింది. ఇక 80% పరిశ్రమలలో సామ్రాజ్యవాదుల పెట్టుబడులే ఉన్నాయి. గ్రామాలల్లో భూస్వాముల పెత్తనం యథావిధిగా కొనసాగుతూనే ఉంది. లార్డ్‌మౌంట్ బార్డన్ అవార్డ్ ప్రకారం భారతదేశానికి స్వాతంత్ర్యము అనే బూటక స్వాతంత్ర్యమను ఆగష్టు 15, 1947 ప్రసాదించింది, సిద్ధించింది.

2. హైదరాబాద్ సంస్థానంలో పరిస్థితి :

ఒకప్రక్క భారతదేశం స్వాతంత్ర్యము వచ్చిందనే పరిస్థితి కానీ హైదరాబాద్ సంస్థానంలో మాత్రం నిజాం తన సంస్థానంని భారతదేశంలో విలీనం చేయడానికి ఇష్టపడలేదు. హైదరాబాద్‌ను స్వతంత్రంగా వుంచాలనే ప్రతిపాదనలో పరిపాలన సాగించడం మొదలుపెట్టాడు. ఈ కుట్ర బుద్ధికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ పెద్దయెత్తున సాయుధ పోరును విజృంభించింది. గ్రామాలల్లో పోరాటం భూస్వాములను ఏమాత్రమూ రానివ్వకుండా ప్రజలే గ్రామ పరిపాలనను సాగిస్తున్నారు. రజాకర్ మూఖలు, సాయుధ పోలీసులు గ్రామాలను ధ్వంసం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజాంతో ఒప్పందం కుదుర్చుకుని రక్షణ, రవాణా, విదేశీ వ్యవహారాలు పర్యవేక్షించడం మొదలుపెట్టింది. కానీ తెలంగాణలోని స్థితి రోజురోజుకీ దారుణమవుతూనే ఉంది. ఖమ్మం, వరంగల్, నల్లగొండల నుంచి కరీమ్‌నగర్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, కృష్ణా, గుంటూరు జిల్లాలు, తూర్పుగోదావరి మొదలైన వాటికి విస్తృతమవుతుంటే ఈ పోరును ఏ మాత్రమూ అడ్డుకోలేని స్థితిని అర్థం చేసుకోవచ్చు.

3. హైదరాబాద్ సంస్థాన విలీనం :

“కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నాడు తెలంగాణాలో ప్రజలు అత్యంత క్రూరమైన నైజాం నవాబు, మిలిటరీ దాడులను ఎదుర్కొంటుంటే, రజాకార్లు, భూస్వాముల గూండాల కిరాతక విధ్వంసాన్ని ప్రతిఘటిస్తుంటే ఆ ప్రజా రక్షణకై చిటికెనవేలు కదపలేదు. హైదరాబాద్‌లో జోక్యం కలిగించుకోలేదు సరికదా, నానాట విస్తృతమై ప్రజ్వరిల్లుతున్న తెలంగాణా రైతాంగ సాయుధ ప్రతిఘటన

వల్ల భూస్వామ్య పెట్టుబడిదారీ వర్గాలలో కలిగిన భయాందోళనలను ఆసరగా తీసుకుని, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 1948 సెప్టెంబరులో తాను సైనికంగా జోక్యం కలుగజేసుకునేందుకు మాత్రం వేగిరపడింది. ఆ సైనిక జోక్యాన్ని "హైదరాబాద్ ముక్తి అని గొప్పగా చెప్పుకుంది."

(తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం – దాని గుణపాఠాలు

– మాకినేని బసవపున్నయ్య – 33)

50,000 మంది సైన్యాన్ని దింపి పోలీస్ క్యాంపులను ఏర్పర్చి నిరంతరం మిలిటరీ దాడులు చేస్తూ అడవుల నుండి ప్రజలను బయటకు పంపేసే బ్రిక్స్ పథకం క్రింద సైనిక చర్య సాగుతుండేది.

ఎ. నిర్బంధం

దాదాపు నాలుగువేల మంది వీర కిశోరాలు, కమ్యూనిస్టులు బలైపోయారు. 10వేల మందికి మించి రెండు మూడేండ్ల పాటు చెరసాలల పాలయ్యారు. కనీసం 50 వేల మంది పోలీసు క్యాంపులలో బంధింపబడి, పోలీసుల నిర్బంధాలకు, చిత్రహింసలకు గురయ్యారు. వేలాది గ్రామాలలో వున్న లక్షలాది ప్రజలపై దాడులు, లాఠీచార్జిలే గాక కొన్ని కోట్ల విలువ చేసే వారి ఆస్థి ధ్వంసం చేయబడటమో, లూటీ చేయబడటమో జరిగింది. దాదాపుగా 50 వేల మంది సాయుధ పోలీసులను, సైన్యాన్ని దించారు. 1947–48లో కాశ్మీరీ వివాదంపై పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో ఖర్చుపెట్టిన దానికన్న ఎక్కువ మొత్తాన్ని తెలంగాణాలో సైనిక పాలన అనతగిన పరిస్థితి అమలు జరిపేందుకై భారత కేంద్ర ప్రభుత్వం వెచ్చించింది"

(తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం – దాని గుణపాఠాలు

– మాకినేని బసవపున్నయ్య పేజి నెం. 28)

"భారత ప్రభుత్వం హైదరాబాదులో జోక్యం కలిగించుకున్నప్పుడు, ఆ జోక్యం బూజు పట్టిన నైజాం జమిందారీ వ్యవస్థను నిర్మూలించి ప్రజాతంత్ర సంస్కరణలను ప్రవేశపెట్టేందుకు ఉద్దేశించబడిందని చెప్పుకున్నది. ఈ మాటల బూటకత్వాన్ని జోక్యం ప్రారంభమైన ఈ రెండున్నర సంవత్సరాలలో అభివృద్ధి కాముకులందరూ గుర్తించారు. వందలాది సభలు, ప్రదర్శనలు, విజ్ఞప్తులు మొదలైన

వాటి ద్వారా వీరు ఏక కంఠంతో జరిపిన ఆందోళనే పన్నెండు మంది తెలంగాణా వీరులపై విధింపబడిన ఉరిశిక్షను ప్రభుత్వం రద్దుపరిచేలా జేయగలిగింది. జమిందారీ భూస్వామ్య విధానాన్ని రద్దుచేసి రైతుకు భూమి, ప్రజలకు తిండి లభింపజేసేందుకు వ్యవసాయ సంస్కరణలను అమలు జరపాలనే సమస్యను ప్రభుత్వం వెనుక తిష్ట వేసుకొని వున్న పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలు దేశం మొత్తం మీద బుట్టదాఖలు చేయించాడు."

(తెలంగాణా పోరాటంపై భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ
1951 మే ప్రకటన పేజి : 67-68)

ఈ విధంగా హైదరాబాద్ చర్యగా ప్రసిద్ధి కెక్కిన సంఘటన కేవలం నిజాంను రక్షించడానికి, కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని నిర్మూలించడానికేనని గమనించాలి. కాంగ్రెస్ నిజాంకు రాజ్‌ప్రముఖ్‌గా బిరుదునివ్వడం, ఎన్నో లక్షలు నగదు రూపంలో ఇవ్వడం జరిగింది. గ్రామాల నుండి తరిమివేయబడిన భూస్వాములు 13-17 వరకూ జరిగిన పోలీస్ యాక్షన్‌లో తిరిగి ఆ సైన్యం ద్వారా గ్రామాలకు ప్రవేశించారు. సెప్టెంబర్ 17కి పోలీస్ యాక్షన్ పూర్తైంది కానీ ఆ తరువాత కమ్యూనిస్టులను, ప్రజలను హింసించడం ప్రారంభించారు. ఇటువంటి పరిస్థితిలో హైదరాబాద్‌ను కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం తనలో విలీనం చేసుకుంది. అప్పటికీ విముక్తైన గ్రామాలను, ప్రజల మద్దతును, ప్రజా సైన్యాన్ని నాశనం చేయడం లక్ష్యంగా హైదరాబాద్ విలీనం పోలీస్ యాక్షన్‌తో జరిగింది.

IV. పోలీస్ యాక్షన్ తరువాత తెలంగాణ పోరాటం

1. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంపై గందరగోళం :

పోలీస్ యాక్షన్ తరువాత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని కొనసాగించాలా? లేక విరమించాలా? అనే సమస్య అప్పుడు ఆ ఉద్యమాన్ని నిర్మిస్తున్న ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో పెద్ద స్థాయిలో అంతర్గత చర్చలకు దారి తీసింది. ఈ రెండు వాదనలు ఏ విధంగా సాగాయంటే ఒకరు 1948 సెప్టెంబర్ 13-17 పోలీస్ యాక్షన్ ప్రారంభించినపుడు అది నిజాం నుండి రక్షింపబడటానికే అని వాదన అసలది రైతాంగం సాధించుకున్న విజయాలపై దాడి అని మరోవాదన సాగినాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై గందరగోళం మొదలైంది. ఆ ప్రభుత్వంపై

భ్రమలు పెరిగాయి. ప్రజల మద్దతు దూరమైనదనే వాదనలు, దూరమవ్వలేదనే వాదనలు, శత్రువు సైన్యాన్ని తట్టుకోలేమనే వాదనలు ఈ పోరాటంపై గందరగోళాన్ని ఏర్పర్చాయి.

2. కమ్యూనిస్టు పార్టీలో అంతర్గత ఘర్షణలు :

కమ్యూనిస్టు పార్టీలో పెద్ద స్థాయిలో అంతర్గత ఘర్షణలు పుంజుకున్నాయి. ఈ ఘర్షణ భారతదేశం యొక్క విప్లవ వ్యూహం, ఎత్తుగడలకు సంబంధించింది. ఈ సమస్యకు ప్రధాన దోహదం చేసింది అప్పటి తెలంగాణ రైతాంగ పోరాటమని గమనించాలి. కమ్యూనిస్టు పార్టీలో అంతర్గత ఘర్షణలు ఏ స్థాయికి వెళ్ళాయంటే మనది రష్యా మార్గమని, చైనా మార్గమని అసలు మనకంటూ సొంత మార్గముందని వాదనలు సాగాయి. ఈ వాదనలు కలిగినవారు అత్యంత కష్టం మీదనే కమ్యూనిస్టు పార్టీ యొక్క ఐక్యతను సాగించారు. ఇటువంటి వాదనల పర్యవసానమే తెలంగాణ పోరాటం పట్ల గందరగోళమని గమనించాలి. కొందరు ఈ పోరాటాన్ని ఆపేయాలని, కొందరు కొనసాగించాలని తమ అభిప్రాయాలను ముందరపెట్టారు. ఇటువంటి సంక్షోభ స్థితిలో నుంచి బయటపడటానికి కమ్యూనిస్టు నాయకులు తీవ్ర ప్రయత్నం చేసారు. ఈ క్రింద పేరాతో మనం అత్యంత సులువుగా ఆనాటి స్థితిని తెలుసుకోగలము.

"మన విశాలాంధ్ర విప్లవోద్యమాన్నీ, మొత్తం భారతదేశ విప్లవోద్యమాన్ని ఎదుర్కొన్న వ్యూహానికీ, ఎత్తుగడలకు సంబంధించిన అనేక క్లిష్ట సమస్యలను సరియైన పరిష్కార మార్గాలు తెలుసుకోజాలక, మనం తీవ్రమైన అంతరంగిక చర్చల్లో పడ్డ సంగతి మీకంతా తెలుసు 1950 మే నెలలో అప్పటి వరకు ప్రధానంగా విశాలాంధ్ర విప్లవోద్యమం యొక్క పని చూస్తూ – అప్పటి వరకు కామ్రేడ్ రణదివే నాయకత్వాన నడుస్తున్న పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీల రాజకీయ లైనుకు వ్యతిరేకంగా, ఒంటరిగా నిల్చి పోరాడుతున్న మాకు (విశాలాంధ్ర కమిటీ ముఖ్యులు – రచయిత) కేంద్ర కమిటీ బాధ్యలు ఒప్పగించబడ్డాయి. మేము కేంద్ర కమిటీ బాధ్యతలను నిర్వహించ నియమించబడిన మరుక్షణంలోనే మన పార్టీ నెదుర్కొన్న అనేక రాజకీయ – నిర్మాణ సమస్యలకు సరియైన పరిష్కారం చూపెట్టే సలహాలు, నిర్ణయాలు ఈయమని కోరుతూ నేటి ప్రపంచంలో విప్లవానుభవజ్ఞులైన సోదర కమ్యూనిస్టు పార్టీలకు ప్రత్యేక విజ్ఞప్తి చేశాం. అంతటితో నిల్చి వుండక, అట్టి

సలహా సంప్రదింపులకు ప్రత్యేక కృషి చేశాం. అనివార్య కారణాల వలన కొంత ఆలస్యమైనా అనుభవజ్ఞులైన సోదర పార్టీల సలహా, సహాయాలను సాధించుకోగలిగాం.

(తెలంగాణ విప్లవోద్యమాన్ని, కమ్యూనిస్టు పార్టీని విచ్ఛిన్నం చేసే మితవాద ధోరణులను అరికట్టండి.

– హైదరాబాద్ స్టేట్ కమిటీ, సర్క్యులర్ నెం. 4/52 పేజి: 110)

అంతర్జాతీయ కమ్యూనిస్టు నాయకుల సలహాలతో పార్టీ నూతన పాలసీ డాక్యుమెంట్లను తయారుచేసుకుంది. భారత కమ్యూనిస్టు బృందం కామ్రేడ్ స్టాలిన్‌ను కలుసుకున్నారు. కామ్రేడ్ స్టాలిన్ తెలంగాణ పోరాటంపై ఈ విధంగా అన్నారు.

"1951 మొదటి భాగంలో – కొనసాగించగలగడం కష్టసాధ్యంగా కనపడుతున్నదనీ, ఆ పోరాటాన్ని భారత కమ్యూనిస్టు ఉద్యమం సంరక్షించుకోలేక పోవడం విచారకరమైన సంగతేననీ, దాన్ని కొనసాగించాలా? విరమించాలా? అన్న తుది నిర్ణయం తీసుకోవాల్సింది భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీయేననీ తేల్చి చెప్పడం కూడా జరిగింది."

(తెలంగాణా సాయుధ పోరాటం మితవాద కమ్యూనిస్టుల వక్రభాష్యాలు – మాకినేని బసవ పున్నయ్య పేజి : 16)

సలహా, సంప్రదింపుల అనంతరం నూతన పాలసీ డాక్యుమెంట్లు కలిగించిన అవగాహనతో మరొక కొత్త వాదన ముందుకొచ్చింది.

"తెలంగాణా పోరాటం నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోయడానికే సాగుతున్నదని కొందరు భావిస్తున్నారు. భూమి కోసమూ జమీందారీ భూస్వామ్య పీడననూ, నైజాం పీడననూ అంతమొందించడం కోసమూ తెలంగాణా రైతులు సాగిస్తున్న ఈ పోరాటం నెహ్రూ ప్రభుత్వం ఏర్పడటానికి చాలాకాలం ముందు 1946లోనే ప్రారంభమయిందన్న సత్యాన్ని మీరు గుర్తించడం లేదు. నెహ్రూ ప్రభుత్వం నైజాం సంస్థానంలో ప్రవేశించిన తరువాత కూడా ఈ పోరాటం కొనసాగించిందంటే, అది నెహ్రూ ప్రభుత్వం తాను చేతనైతే కూలదోయడం కోసమే సంస్థానంలో ప్రవేశిస్తున్నానని ఆనాడు చెప్పుకొని అదే నైజాంతో ఈనాడు చేతులు కలిపి పున: ప్రతిష్టింపబూనుకున్న భూస్వాముల నుండి రైతులను

సంరక్షించడం కోసమే పోరాటం కొనసాగించవలసి వచ్చింది. అందువలన తెలంగాణా రైతుల పోరాటం ప్రారంభం కావడం గానీ, కొనసాగడం గాని నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోయడానికి కాదనే జమిందారీ భూస్వామ్య పీడనను తుదముట్టించేందుకోసమేననేది అందరికీ స్పష్టం కావలసిన విషయం.

(తెలంగాణా పోరాటంపై భారత కమ్యూనిసష్టు పార్టీ కేంద్ర కమిటీ
1951 మే ప్రకటన పేజి : 68)

కావున కొనసాగించాలా? విరమించాలా? లేక కేవలం రైతాంగ విజయాల రక్షణకై సాగించాలా? అనే వాదనలు వచ్చినాయి. ఈ వాదనలతో పార్టీ తీవ్ర ఘర్షణలకు లోనయ్యింది. ఈ అంతర్గత ఘర్షణలో ఐక్యత సాధనకు ముఖ్యమైన నిర్ణయానికొచ్చింది.

"మన ఉద్యమ లక్ష్యం నెహ్రూ ప్రభుత్వాన్ని కూలద్రోసి ప్రజా రాజ్యాన్ని నెలకొల్పుకోవడంగా పెట్టుకొనకుండా భూములనూ, ప్రజా ఉద్యమాన్ని సంరక్షించుకోవడం గానూ, మిలటరీ హెూంగార్డులు, భూస్వాములు నిర్బంధ విధానాన్ని ప్రతిఘటించే లక్ష్యాన్ని వుంచుకోవాలి. ఈ కనీస కోర్కెల సాధన కోసం సాయుధ పోరాటాన్ని కొనసాగించాలి. అలాగే వయోజన ఓటింగ్ ప్రాతిపదికపై ఎన్నికైన రాజ్యాంగ సభ ద్వారా సంస్థాన భవిష్యత్తును నిర్ణయించాలని డిమాండ్ చేయాలి."

(తెలంగాణా గెరిల్లా పోరాటం కొనసాగించాలి. – చంద్ర రాజేశ్వరరావు
మే 1957, పేజి : 243 – 244)

ఈ విధంగా కమ్యూనిస్టు పార్టీలోని అంతర్గత ఘర్షణ తీవ్రరూపం దాల్చుతూనే పోరాటాన్ని కొనసాగించింది.

పోరాటరంగంలో కాంగ్రెస్‌పై భ్రమలున్న ప్రాంతాలు ఆయుధాలు విసర్జించింది. కానీ కాంగ్రెస్ లక్ష్యాన్ని గమనించిన తరువాత మళ్ళీ ప్రజలు, గెరిల్లాలు ఆయుధాలు పట్టుకుని పోరాడటం ప్రారంభించారు. ఈ ఘర్షణల ప్రభావం ఆ విధంగా సాగింది. ఇంత అంతర్గత వైరుధ్యాల నడుమ కూడా పోరాటం సాగింది.

3. పోరాట విరమణకు ఉపక్రమణ :

నూతన పాలసీ డాక్యుమెంట్లు కల్పించిన అవగాహనతో సాయుధ

పోరాటాన్ని కొనసాగించాలి కానీ అది నెహ్రూ ప్రభుత్వాన్ని కూల్చడానికి కాదని కేవలం రైతుల విజయాల రక్షణార్థమేనని అవగాహన కొచ్చి పోరాడుతున్న గెరిల్లాలపై వారంట్లు నిర్బంధాలు, అరెస్టులు, కేసులు, ఉపసంహరించాలని అలా అయితేనే ఆయుధాలు విసర్జించాలనే డిమాండుకు కమ్యూనిస్టు పార్టీ వచ్చింది. దీనికి తోడు జనరల్ ఎన్నికలలో పోటీ చేయడం కూడా ముఖ్యమైన విషయంగా పరిగణించింది.

"ఎన్నికల పోరాటంతో పాటే రాజకీయ ఖైదీల విడుదల, గెరిల్లా సభ్యులపై వారంట్లు రద్దు, అన్ని బాపతు కేసులు ఉపసంహరణ, కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభలపై నిషేధం తొలగింపు, మిలటరీ క్యాంపుల ఎత్తివేత, మున్నగు సమస్యలపై ప్రచారం, ఆందోళనలు తీవ్రతరం చేసి ప్రజా సమీకరణతో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి."

(సర్క్యులర్ నెం. 3/51, హైదరాబాద్ స్టేట్ కమ్యూనిస్టు కమిటీ తెలంగాణా రైతాంగ సాయుధ గెరిల్లా పోరాట విరమణకు కారణాల వివరణ పేజి 91-92)

అలాగే వివిధ వాదనలు ఉన్నవారు సైతం తమ వాదనలు ప్రక్కకు పెట్టమని,పోరాటాన్ని ఎలా నడపాలో, ప్రజలను ఎలా సమీకరించలోనని తీవ్ర ప్రయత్నం చేయమంది. ఈ క్రింద వివరణ మనకు చాలా స్పష్టమైన అభిప్రాయాన్ని కలిగించుతుంది.

"దేశంలోని అన్ని రాష్ట్రకమిటీలు, పార్టీ యూనిట్లు పోరాట కోర్కెలను బలపరుస్తూ ప్రచారం గావించి, ప్రజా సమీకరణ చేయాలని విజ్ఞప్తి చేసింది. తీర్మానం వెనుక ప్రజాభిప్రాయాలను కూడగట్టమని కోరింది. ఉపసంహరించాలా? లేదా అంతిమ విజయం సాధన వరకూ అట్లే కొనసాగించాలా? అనే పోరాట చర్చలు ఆపివేసస తీర్మానంలో వెల్లడించిన కోర్కెలపై ఆ ఆందోళనతో ముందుకు రావాలని కోరింది."

(సర్క్యులర్ 3/51 హైదరాబాద్ స్టేట్ కమ్యూనిస్టు కమిటీ తెలంగాణా రైతాంగ సాయుధ గెరిల్లా పోరాట విరమణకు కారణాల వలన పేజి : 84)

ఇటువంటి స్పష్టమైన అవగాహన (సంపూర్ణం కాదులేండి!) ఉండినా సాయుధ పోరాట విరమణ అవససం అని మొదటి నుండీ వాదిస్తున్న వారు మాత్రం పార్టీ మెజార్టీ నిర్ణయాన్ని కాలదన్ని తమ వాదనలనే ముందుకు తీసుకెలుతూ

పార్టీలో గుంపులు కడుతూ, వ్యక్తిగత దౌర్జవాదులని, గుండాగిరీ పద్ధతులని, దుందుడుకు వాదులని నిందా ప్రచారం చేయడం మొదలుపెట్టారు. రావినారాయణ రెడ్డి, వి.డి. దేశ్‌పాండే లాంటి వారు ఈ నిందా ప్రచారానికి పరాకాష్టనని చెప్పుకోవాలి. నారాయణరెడ్డి తెలంగాణ నగ్న సత్యాలని డాక్యుమెంట్లు, వి.డి. దేశ్‌పాండే నైతే అప్పట్టి ప్రభుత్వ హెూంశాఖ కార్యదర్శి శేషాద్రి అయ్యంగారిని కలుసుకుంటూ గెరిల్లాల పై నిందా ప్రచారం చేయసాగాడు. విశాలాంధ్ర కమ్యూనిస్టు కమిటీకి ఏకరుపెట్టకుండా హైదరాబాద్ సిటీ కమిటీకి సంబంధించిన పార్టీ నుండి బహిష్కరించిన, పార్టీ రహస్యాలు చెప్పేసిన వారిని కలుపుకుని కన్వెన్షన్స్ గ్రూపుగా ఏర్పడి (ఈ గ్రూపుకు కామ్రేడ్ అజయ్‌ఘోషి మద్దతు కూడా ఉంది) పోరాట వీరులపై నిందలు చేయుడం పోరాటాన్ని వేంవే విరమించుతున్నామని ప్రచారాలు చేయడం, పార్టీ నిర్మాణాన్ని దెబ్బతీయటం ప్రారంభించారు.

"కేంద్ర కమిటీ తీర్మానం ప్రజాందోళనతో ప్రభుత్వంపై ధోరణులనాధారం చేసుకొని ప్రభుత్వమే మన పార్టీని లొంగదీసే స్థితికి వచ్చింది. ఈ విధంగా జూన్ నెలలో మన పార్టీ తీర్మానం ఒక ఫలితాన్ని ఆశిస్తే మన పార్టీ ఆంతరంగిక వైరుధ్యాల పుణ్యమా అంటూ వేరొక విధమైన ఫలితాలు వచ్చాయి."

(సర్క్యులర్ నెం. 3/51 హైదరాబాద్ స్టేట్ కమ్యూనిస్టు కమిటీ, తెలంగాణ రైతాంగ సవయుధ గెరిల్లా పోరాట విరమణ కారణాల వివరణ పేజి : 87)

ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీ యెదుర్కొంటున్న వైరుధ్యాలను ఆసరా చేసుకొని తీవ్రమైన ఎదురుదాడికి పాల్పడింది. ఇక పార్టీలో ముఠాలు, నిర్మాణం దెబ్బతినడం, కేంద్రకమిటీ నుండి సరైన సహకారం రాకపోవడం మొదలైన విషయాల మూలంగా పోరాటాన్ని ఉపసంహరించింది. పోరాటాన్ని కొనసాగించాలని గెరిల్లాల డిమాండు ఉన్నా మధ్యలో ఆపడం జరిగింది. ఈ విధంగా పోరాట విరమణకు అప్పటి పార్టీ వారు సమాధానం తెల్పెరు.

సమీక్ష :

ఆఖరున ఈ సమీక్షలో మనం తెలంగాణ సాయుధ పోరాటాన్ని పోలీస్ యాక్షన్ తరువాత విరమించాలా? లేక రైతాంగ విజయాలకై మాత్రమే కొనసాగించాలా? అనే వాదనలకు మద్దతు పలకడమా? లేదా ఏది సరైనది అని

నిర్ణయించడం మాత్రం కాదు. ఈ రెండు వాదనలు కాకుండా తెలంగాణ సాయుధ పోరాటాన్ని విరమించకుండా కేవలం రైతు విజయాల సంరక్షణకై మాత్రమే కొనసాగించకుండా కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వాన్ని కూలదోసే అంతిమ విముక్తి లక్ష్యంగా సాగితే బాగుంటుందని అదే సరైన విప్లవ మార్క్సిస్టు –లెనినిస్టు అవగాహన అని గమనించాలి. ఎందుకంటే కాంగ్రెస్ భూస్వామ్య రక్షణలో నిజాం పాత్రను అందిపుచ్చుకుంది. వాస్తవానికి తెలంగాణ సాయుధ పోరాటం భూమి కొరకు జరిగే పోరాటమని అది ఇంకా విముక్తి స్థాయికి ఎదగలేదని కేంద్ర కమిటీ వాదించింది. కానీ సుమారు 3000 గ్రామాలు విముక్తి అయ్యి, గ్రామ రాజ్యకమిటీలు ఏర్పడ్డాయి. ప్రజలు తమంతటి తాము ప్రజాసైన్యంలోకి వచ్చి చేరారు, కావున రైతు గెరిల్లా సాయుధ పోరాటంపై ఆనాడు నూతన పాలసీ డాక్యుమెంట్లలో వివరించినట్లుగా మూడు దశలు గల స్థాయిలో పోరాటముంటుందని మొదటి దశ కౌలు రేటు తగ్గింపుకో, లేక శిస్తుల తగ్గింపుకో సాగుతుండడం, రెండవ దశ భూమి పంపకం మున్నగు ప్రధాన సమస్యల సాధన స్థాయికి చెందినదని మూడవది ముఖ్యమైనది శత్రు ప్రభుత్వ పాలన అంతమొందించి, తమ పరిపాలనా పద్ధతి ప్రవేశపెట్టుటకు సాగించే స్థాయికి వచ్చినపుడు – అంటే విముక్తి ప్రాంతాలు, విముక్తి సైన్యాల నిర్మాణాల స్థాయి కందినపుడు అది మూడవ దశగా అభివర్ణించారు. కావున తెలంగాణలో విముక్తి ప్రాంతాలు, సాయుధ సైన్యము, గ్రామ రాజ్యకమిటీలు ఏర్పడినపుడు అది మూడవ దశలో ఉన్న పోరాటంగా అభివర్ణించకుండా, కేవలం రెండవ దశగా అంటే భూమి కొరకు జరిగే రెండవ దశ పోరాటంగా అభివర్ణించడం పూర్తి మార్క్సిస్టు లెనినిస్టు వ్యతిరేక నిర్ణయంగా పరిగణించాలి. అలాగే ఇంకొక ముఖ్య విషయమేమంటే,

“దేశమంతా సంసిద్ధమయితేనే సాయుధ రైతు గెరిల్లా పోరాటం సాగించాలి. లేకపోతే మానివేయాలి అనేది తప్పుడు వాదన”

“దేశంలో పలు ప్రాంతాల సాయుధ రైతు గెరిల్లా పోరాటాలు విజృంభిస్తే ఒక ప్రత్యేక ప్రాంతంలో సాగే పోరాటానికి ఊతగాను, సహాయంగాను వుండే మాట వాస్తవం. అంతేగాని అలా వస్తేనే ఏ ఒక్క ప్రాంతంలోనైనా ప్రారంభించాలనే వాదన శుద్ధ తప్పు వాదన. ఈ వాదన ప్రకారం మొదలుపెడితే యావద్భారత రైతు సాయుధ విప్లవం, లేకపోతే ఏ ఒక్క చోట ప్రారంభించరాదన్న పిడివాదముతో

రైతు విప్లవ పోరాట విస్తృతాన్నే అరికట్టుటకు దారి తీస్తుంది. వెనుకబడి వున్న ఉద్యమ ప్రాంతాలను చూపెట్టి, ముందుకు వస్తున్న పోరాటాలను వెనుకపట్టు పట్టించి నీళ్లు కార్చటానికి మార్గమవుతుంది.”

(సర్క్యులర్ నెం. 3/51 హైదరాబాద్ స్టేట్ కమ్యూనిస్టు కమిటీ, తెలంగాణ రైతాంగ సాయుధ గెరిల్లా పోరాట విరమణకు కారణాల వివరణ పేజి 75, 76) కావున ఈ వివరణల ద్వారా మనకు అర్థమయ్యేదేమంటే దేశ వ్యాపిత సాయుధ పోరాటానికి అవకాశముంటేనే పోరాటం చేయడం సరైనది కాదని ఒకానొక ప్రాంతంలో సాగితే దాన్ని ముందుకు తీసుకుని పోవాలని అవగాహన ఇస్తుంది. తెలంగాణ సాయుధ పోరాటానికి అవకాశముంటేనే పోరాటం చేయడం సరైనది కాదని ఒకానొక ప్రాంతంలో సాగుతే దాన్ని ముందుకు తీసుకుని పోవాలని అవగాహన ఇస్తుంది. తెలంగాణ సాయుధ పోరాటం ఒకానొక ప్రాంతంలో ప్రారంభమై అది అభివృద్ధి చెందుతున్నప్పుడు దాన్ని అపేసే అవగాహన సరైనది కాదు. దాని కొనసాగిస్తూ మిగతా ప్రాంతాలల్లో అలాంటి పోరాటం ప్రారంభించడం కూడా ముఖ్యమేనని అందుకు ప్రయత్నించకుండా ఉండటం రివిజనిజమేనని గమనించాలి.

అలాగే పోరాటం కొనసాగించడానికి గల అవకాశాలను సైతం ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలోని ఒకానొక వర్గం వివరణ నిచ్చారు. అదేమంటే “సాయుధ గెరిల్లా దళాలను, కార్యకర్తలను వర్ణనాతీతమైన చిత్రహింసకు గురిచేస్తున్నప్పటికీ ప్రజలు వారికి భోజనం పెట్టడం, వారికి రక్షణ సౌకర్యాలు కలిగించడం, శత్రువుల యొక్క రాకపోకలను గూర్చిన సమాచారాన్ని అందించడం చేస్తూనే ఉన్నారు. వారు కొద్ది సంఖ్యలో దళాలుగా కూడ ఏర్పడుతున్నారు. వారు వేర్వేరు పద్ధతుల ద్వారా తమరు తాము పంచుకున్న భూములను, గెల్చుకున్న విజయాలను కాపాడుకుంటున్నారు. వారు తమ దైనందిన సమస్యలపై పాక్షిక పోరాటాలు సాగించుటతో పాటు, శత్రువర్గం యొక్క సాయుధ బలగాలపై దాడుల్లో గూడా పాల్గొంటున్నారు. అయితే ఇది సాయుధ రైతాంగ గెరిల్లా పోరాటాన్ని పటిష్టతరంగా సాగించుటకు అవసరమైనంత విస్తృత స్థాయిలో లేదు. ఇందుకు ప్రధానకారణం కొందరు జనం ప్రచారం చేస్తున్నట్లు, ప్రజలు అలసిపోవడం, పోరాటాన్ని విరమించాలని కోరటం గాదు. మన రాజకీయ, మిలటరీ నిర్మాణ, సాంకేతిక

బలహీనతలే అందుకు కారణం. ఈ బలహీనతలను తొలగించుకుంటే ప్రజలను వారి కోర్కెలపైన విస్తృత ప్రజా పోరాటాలలోకి తీసుకుని రావడం సాధ్యమవుతుంది.”

(తెలంగాణ గెరిల్లా పోరాటం కొనసాగించాలి!

–చంద్ర రాజేశ్వరరావు, మే 1951, పేజి 242)

కావున ఇటువంటి అవకాశంతో పాటుగా అంతర్జాతీయ పరిస్థితులు, జాతీయ పరిస్థితులు, కూడా పోరాటాన్ని కొనసాగించడానికి అవకాశాలు ఉన్నాయి. కానీ ఈ పరిస్థితులను, సైద్ధాంతిక అవగాహనను ప్రక్కకు పెట్టి సాయుధ పోరాటాన్ని ఉపసంహరించి వ్యవసాయ విప్లవోద్యమాన్ని సాధించలేకపోయారు. ఫలితంగా ఉపసంహరణతో ప్రత్యేక పరస్థితి ఏర్పడినది అదేమంటే బూర్జువా × కార్మికవర్గం మధ్య యుద్ధంలో కార్మికవర్గం ఓడిపోతే రాజకీయ అధికారం కొరకు జరిగే పోరాటం బూర్జువా వర్గాల మధ్యధిగా మిగిలిపోవడమే కాకుండా కార్మికవర్గ కనీసహక్కులు బూర్జువా డిమాండ్ల చాటున కొనసాగుతాయి. అందుకే ప్రజాస్వామ్య విప్లవంలో భాగమైన నీరు, నిధులు, ఉద్యోగాలు అనే హక్కులు కూడా బూర్జువా రాజకీయ ఉద్యమంతో భాగమవ్వడమే కాకుండా యావత్తు వ్యవసాయ విప్లవ డిమాండ్లు సైతం ప్రతిఫలించాయి. బూర్జువా వర్గం వీటికి సైతం రాజకీయ ఉద్యమంలో ప్రముఖ పాత్రను కల్పించి విస్తృత ప్రజానీకాన్ని కదిలించి తన ప్రయోజనాన్ని అందిపుచ్చుకుని తిరిగి ప్రజలను అణచివేతను తెరపైకి తీసుకురావడం జరుగుతుంది. ఈ స్థితి నుండే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఏర్పడినది.

కావున నేడు 13–17 పోలీస్ యాక్షన్ కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క నగ్న స్వరూపాన్ని తెల్పడంతో పాటు ఈ పోలీస్ యాక్షన్ తరువాత పర్యవసానాలు ఏవిధంగా తెలంగాణా సాయుధ పోరాటాన్ని విరమించారో కూడా బహిరంగపర్చింది. ఈ గమనిక ద్వారా ఇంకా భారతదేశానికి తెలంగాణా పోరాటం అందించే పాఠాలను గ్రహించాలి. కావున ప్రత్యేక తెలంగాణ పోరాటంతోనే నేడు పోరాటస్ఫూర్తిని విరమిస్తే అది పూర్తిగా తప్పు అవుతుంది. కాబట్టి దున్నే వానికే భూమి, ప్రజా రిపబ్లిక్, కార్మికులకు కనీసవేతనం, హక్కులు, కులీనుల ఆస్తుల స్వాధీనం మొదలైనవి వ్యవసాయ విప్లవోద్యమం ద్వారా సాధించడం జరుగుతుంది కాబట్టి ఏవిధంగానైతే తెలంగాణా సాయుధ రైతాంగ విప్లవాన్ని

విరమించడమనే మోసాన్ని గుర్తిస్తూ కేవలం ప్రత్యేక తెలంగాణతో పాలకపక్షానికి ఉపయోగపడకుండా, ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ సాధన లక్ష్యంగా కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావుల ఐక్యత, విముక్తి ధ్యేయంగా అడుగులు వేద్దాం! నేటి ఈ సెప్టెంబర్ 17ని వ్యవసాయ విప్లవోద్యమానికి వ్యతిరేకంగా జరిగినా దాడిగా గుర్తించి అందుకు వ్యతిరేకంగా పోరాటాలు జరపాలి, నిరసనలు ఉధృతం చేయాలి. వ్యవసాయ విప్లవోద్యమానికి సన్నద్ధమవ్వాలి. రండి! గ్రామాలను విముక్తి చేద్దాం! గ్రామాల నుండి పట్టణాలను సాధిద్దాం! ఈ అవగాహనతోనే సెప్టెంబర్ 17ని అర్థం చేసుకోవాలి.

-- సమాప్తం --